ఆదివారం
15-12-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 84
పేజీలు : 8, వెల: రూ.6.00

Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

సిరియాపై ఇజ్రాయిల్ దాడులు ఉధృతం

దమాస్కస్: సిరియారాజధాని దమాస్కస్, దాని శివారు ప్రాంతాలపై ఇజ్రాయిల్ ఉధృతంగా దాడులు సాగిస్తోంది. బంకర్లలోని రాకెట్లను, ఆయుధసామగ్రిని ఇజ్రాయిల్ సైన్యం (ఐడీఎఫ్) ధ్వంసం చేసిందని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎస్ఓహెచ్ఆర్) తెలిపింది. పర్వతసానువుల్లోని సొరంగాలను, ఆయుధ డిపోలను, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లను, బార్జేలోని సైనిక శాస్త్రసాంకేతిక విభాగాల సామగ్రిని కూడా ఐడీఎఫ్ నాశనం చేసినట్లు పేర్కొంది. గతంలో రసాయన ఆయుధాలను సిరియాపై ఇజ్రాయిల్ ప్రయోగించింది. అసద్ దేశం విడిచిన తరుణంలో వ్యూహాత్మక ప్రదేశాల్లో ఉన్న సిరియా యుద్ధ సామగ్రిని, మిలటరీ వ్యవస్థను సమూలంగా నాశనం చేసేలా సైన్యానికి ఇజ్రాయిల్ పూర్తి స్వేచ్ఛ ఇస్తోంది.

తాకట్టు లేకుండా రైతుకు రూ.2 లక్షల రుణం

న్యూఢిల్లీ: వ్యవసాయ అవసరాలకు, పంట సాగు కోసం ఎలాంటి తాకట్టు లేకుండా అందించే రుణ సదుపాయాన్ని పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రైతులు ఎలాంటి తనఖా లేకుండా రూ. 1.6 లక్షల వరకు రుణం తీసుకునే వెసులుబాటు ఉండగా... ఇటీవల దాన్ని రూ.2 లక్షలకు పెంచింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని తాజాగా స్పష్టంచేసింది. పంటల సాగుకు

- మిగతా 2 లో

గంటకు 30 మంది మృతి

జెనీవా: నీట మునిగి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా గంటకు 30 మంది నీట మునిగి చనిపోతున్నట్లు వెల్లడించింది. 2050 నాటికి 7.2 మిలియన్ల కంటే ఎక్కువ మంది నీటి ప్రమాదాల్లో చనిపోయే అవకాశం ఉందని తాజా నివేదికలో హెచ్చరించింది. చిన్నారులే ఎక్కువగా ఇలాంటి ఘటనల్లో

- మిగతా 2 లో

ఏపీకి జాతీయ ఇంధన వినియోగ అవార్డు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ఇంధనశాఖ ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు లభించింది. భవనాలు, పరిశ్రమ, మున్సిపాలిటీ, వ్యవసాయం, డిస్కమ్‌లు, రవాణారంగంలో ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య చర్యలను ప్రోత్సహించడం, అమలు చేయడంలో సుస్థిరత కనపరిచిన ఆంధ్రప్రదేశ్... జాతీయ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు–2024, రాష్ట్ర ఎనర్జీ ఎఫిషియన్సీ ఫెర్ఫార్మెన్స్ (గ్రూపు–2) విభాగంలో మొదటి బహుమతి సాధించింది. జాతీయ ఇంధన

- మిగతా 2 లో

స్వోత్కర్ష... పరనింద

కాంగ్రెస్‌పై విమర్శలు.

రాజ్యాంగంపై చర్చలో మోదీ ఎదురుదాడి

న్యూఢిల్లీ: దేశంలోని ప్రతి ఒక్కరు తమ కర్తవ్యానికి కట్టుబడాలని, ప్రభుత్వం కూడా తన విధి ధర్మాన్ని నిర్వర్తించాలని ప్రధాని మోదీ అన్నారు. సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అన్నది సమ్మిళిత వృద్ధికి హామీనిచ్చే విజన్ అని చెప్పుకొచ్చారు. గరీబీ హఠావో అన్న కాంగ్రెస్ నినాదం అతిపెద్ద మోసమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో జరిగిన ప్రత్యేక చర్చకు మోదీ శనివారం సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్‌పై నిందలు మోపి... తన భుజకీర్తిని ప్రశంసించుకున్నారు. తమ పదేళ్ల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకొని అరకొర విజయాలు స్తుతిస్తూ... కాంగ్రెస్ 55 ఏళ్ల పరిపాలనను విమర్శిస్తూ, దేశంలో జరిగిన ప్రతిదానికీ ఆ పార్టీయే కారణమన్నట్లుగా మాట్లాడారు. తన మాటల్లో కొత్తదనం లేనప్పటికీ ఏదో గొప్పగా మాట్లాడుతున్నట్లు బీజేపీ సభ్యులు ప్రధాని మోదీకి వత్తాసు పలకడం సభలో కనిపించింది.

అధికరణ 370 రద్దుతో దేశానికి మంచి జరిగిందని మోదీ అన్నారు. రాజకీయ కుటుంబాలకు చెందని లక్ష మంది యువతను రాజకీయాల్లోకి తెస్తానని చెప్పారు. రాజకీయ నేపథ్యంలేని కుటుంబాల నుంచి వచ్చేవారిని అన్ని పార్టీలు ఆదరించాలని, దేశ రాజకీయాల్లోకి నవతరానికి అవకాశమివ్వాలని సూచించారు. భారత రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు కాంగ్రెస్ ఎన్నో రకాలుగా ప్రయత్నించిందని ఆరోపించారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదన్నారు. ఆదివాసీ మహిళ దేశానికి రాష్ట్రపతి అయ్యారని, మహిళలకు అన్ని రంగాల్లోనూ గౌరవం దక్కాలని అన్నారు. మన దేశం వికసిత్ భారత్ కావాలని, ఐకమత్యమే దేశాభివృద్ధికి కీలకమని మోదీ చెప్పారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు విషబీజాలు

- మిగతా 2 లో

శంభు సరిహద్దులో

మళ్లీ ఉద్రిక్తత

అన్నదాతపై బాష్పవాయువు... జలఫిరంగులు

17 మందికి గాయాలు... పాదయాత్ర నిలిపివేత

న్యూఢిల్లీ: శంభు సరిహద్దు వద్ద మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. తమ డిమాండ్ల పరిష్కారం కోసం రైతులు శనివారం చేపట్టిన 'ఢిల్లీ చలో' మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఆందోళనకర పరిస్థితులు తలెత్తాయి. రైతులపై హర్యానా పోలీసులు బాష్పవాయువు, జల ఫిరంగులు ప్రయోగించారు. ఈ ఘటనలో సుమారు 17 మంది రైతులకు గాయాలయ్యాయి. దీంతో ఢిల్లీకి తమ పాదయాత్రను నిలిపివేస్తూ రైతు సంఘాల నేతలు కీలక నిర్ణయం తీసుకున్నారు. అంతర్గత సమావేశం అనంతరం తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని రైతు నాయకుడు తేజ్వీర్ సింగ్ తెలిపారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం రైతులు మరోసారి ఉద్యమబాట పట్టారు. శనివారం మధ్యాహ్నం 'చలో ఢిల్లీ' మార్చ్ ప్రారంభించారు. కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల సాధన కోసం 101 మంది రైతులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. అయితే, రైతులను శంభు సరిహద్దు వద్ద హర్యానా పోలీసులు అడ్డుకున్నారు. రైతులపై బాష్పవాయువు, జల ఫిరంగులు ప్రయోగించారు. దీంతో సరిహద్దు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రైతుల ఢిల్లీ చలో మార్చ్‌ను అడ్డుకోవడం ఇది మూడోసారి. డిసెంబర్ 6 నుంచి ఢిల్లీ వైపుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నించగా... ఇప్పటికే ఆ ప్రయత్నాలను రెండుసార్లు పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసుల తీరుపై రైతులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతుల ఢిల్లీ మార్చ్ నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిలిపివేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 17వ తేదీ అర్ధరాత్రి వరకూ సేవలు నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.

భద్రతా కారణాలను ఉటంకిస్తూ రైతులు ముందుకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో... శాంతియుతంగా తాము ఢిల్లీ మార్చ్ నిర్వహిస్తామని రైతు నేతలు విజ్ఞప్తి చేశారు. 'మా నిరసనలకు అడ్డుపడకండి. మాకు వెళ్లేందుకు రోడ్డు ఇవ్వండి. ఇనుప బారికేడ్లు, రాతి బారికేడ్లు మా గొంతును అణిచివేయలేవు' అని రైతు నేత ఒకరు విజ్ఞప్తి చేశారు. దేశంలోని 50 శాతం రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నారని, వారి గొంతు

- మిగతా 2 లో

18న రైల్ రోకో
రైతు నేత పంధేర్ పిలుపు
2లో

విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు కృషి

- తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యార్థుల భాగస్వామ్యం
- నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్
- కామన్ డైట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర–మొయినాబాద్: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేయాలని కృషి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కామన్ డైట్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారన్న నమ్మకం, ఆత్మవిశ్వాసం కలిగించిన మీకు ధన్యవాదాలు అని అన్నారు. కొన్నేళ్లుగా ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు టాలెంట్ ఎక్కువని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తక్కువ అనే అపోహ బలంగా నాటుకుపోయిందని, అలాంటి అపోహలను తొలగించాలని ప్రజా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పీవీ నరసింహారావు మొట్టమొదటిసారిగా రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభించారన్నారు. అక్కడ చదువుకుని ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎంపికయ్యారని తెలిపారు. ఐఏఎస్ బుర్రా వెంకటేశం, ఐపీఎస్ మహేందర్ రెడ్డి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులే అని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో సంపూర్ణ విశ్వాసం కల్పించాలని, విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి, విద్యా ప్రమాణాలు పెంచాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. డైట్, కాస్మోటిక్, మౌలిక వసతులకు గత ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదని, ఇది ప్రజా ప్రభుత్వం అని నిరూపించేందుకు సింగిల్ స్ట్రోక్ లో వాటన్నింటినీ పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ 200 శాతం పెంచామన్నారు. రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23 లక్షలు మంది, 11వేల ప్రయివేటు పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వివరించారు. మల్టీ టాలెంటెడ్ విద్యార్థులను మనం ఎందుకు తయారు చేయలేకపోతున్నామో ఆలోచించాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల లాంటివని, విద్యార్థుల కోసం పెట్టేది ఖర్చు కాదు, అది వారి భవిష్యత్ కు పెట్టుబడి అన్నారు. 70 ఏళ్ల నుంచి మనం ముందు నుంచే ఎందుకు ప్రణాళికలు వేసుకోవడం లేదన్నారు. ఆత్మపరిశీలన చేసుకోవాలని, వీటికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇటీవల ఫుడ్ పాయిజన్ జరిగి ఓ బాలిక మరణించిందని, ఆమె తల్లిదండ్రులు ఎంత బాధపడి ఉంటారోనని ఆవేదన చెందారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతినెలా 10వ తేదీలోగా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు అందజేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పని మహిళా సంఘాలకు అప్పగించామని, కుట్టు పనికి ఇచ్చే రుసుం రూ.25 నుంచి రూ.75 కు పెంచినట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, తరచూ

- మిగతా 2 లో

మాదిగలకు న్యాయం
సుప్రీం తీర్పు తూచా అమలు
2లో

బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే

విద్యార్థులకు అనారోగ్యం

- హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలి
- డైట్ మెనూ ప్రారంభోత్సవంలో భట్టి

విశాలాంధ్ర–హైదరాబాద్: బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యమే గురుకుల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినడానికి ప్రధాన కారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మధిర నియోజకవర్గం బోనకల్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శనివారం నూతన డైట్ మెనూను ఆయన ప్రారంభించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ... పది సంవత్సరాలు అధికారంలో ఉన్న గులాబీ పాలకులు ... గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులు కల్పించకుండా, డైట్ చార్జీలు పెంచకుండా, పెండింగ్ బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లనే విద్యార్థుల ఆరోగ్యాలు దెబ్బతిన్నాయని అన్నారు. హాస్టల్ విద్యార్థుల సంక్షేమం పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు... ఇప్పుడు హాస్టల్స్ బాగాలేవని, భోజనం సరిగా లేదని మాట్లాడటానికి సిగ్గుండాలని ధ్వజమెత్తారు. మెస్ బిల్లులను చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసిన ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందలేదన్నారు. కాంట్రాక్టర్లు నాసిరకం ఆహార పదార్థాలు సరఫరా చేయడం వల్ల వాటిని తిన్న విద్యార్థుల ఆరోగ్యాలు దెబ్బతిన్నాయని విమర్శించారు. 40 శాతం డైట్ చార్జీలు పెంచిన ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అంకితభావం, చిత్తశుద్ధితో విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేయడమే తమకు తెలుసన్నారు.

పరిశుభ్రత బాధ్యత టీచర్లదే

కొత్త మెనూ ప్రకారమే విద్యార్థులకు డైట్ అందించాలని, నాణ్యత లోపిస్తే ఉపేక్షించమని, కఠిన చర్యలు తీసుకుంటామని భట్టి హెచ్చరించారు. ఆహార పదార్థాలలో కల్తీ ఉండకూడదని, పరిశుభ్రతలో కూడా తేడా రాకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ పాలకులు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే 11వేల ఉపాధ్యాయులను డీఎస్సీ ద్వారా నియమించామన్నారు. మరో ఆరు వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామన్నారు. 56 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏవయ్యా..ఇంత జరిగినా నీకింకా బుద్ధిరాలేదా! ఇక మన సిన్మాలో ఎవరినీ చంపడం, కొట్టడం ఉండవు.

సహకార బ్యాంకుల బలోపేతానికి చర్యలు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

టీసీసీబీఈఏ నాల్గో రాష్ట్ర మహాసభల్లో వక్తలు

విశాలాంధ్ర–హైదరాబాద్: రాజకీయాలకు అతీతంగా సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగానికి, రైతుకు, ప్రభుత్వానికి వారధిగా ఉన్న సహకార బ్యాంకుల బలోపేతం కోసం తగిన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన నిధులలో కొంత సహకార బ్యాంకులలో జమ చేసి, కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా ఈ బ్యాంకులు ఆర్థికంగా ఎదగగలవన్నారు. హైదరాబాద్, కాచిగూడ, మ్యాడం అంజయ్య భవన్‌లో శనివారం తెలంగాణ సహకార సెంట్రల్ బ్యాంకుల ఉద్యోగుల అసోసియేషన్ (టీసీసీబీఈఏ) 4వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. మహాసభల ప్రారంభోత్సవానికి టీసీసీబీఈఏ అధ్యక్షులు, ఏపీటీబీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు అధ్యక్షత వహించారు. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టీఎస్కాబ్) అధ్యక్షుడు మార్నేని రవీందర్ రావు, ఏఐసీబీఈఎఫ్ చైర్మన్ తపన్ కుమార్ బోస్, ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవి కుమార్, ఏపీటీబీఈఎఫ్ అధ్యక్షులు రవీంద్రనాథ్, కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్, నల్లగొండ డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, టీసీసీబీఈఏ చైర్మన్ కె.జనార్దన్ రావు, ప్రధాన కార్యదర్శి పి.నాగేందర్, ఉప ప్రధాన కార్యదర్శులు షేక్ అలీముద్దీన్, బి.ప్రవీణ్, ఏపీసీసీబీఈఏ వైస్ చైర్మన్లు కేటీ రామారావు, వి.రాధాకృష్ణ మూర్తి, టి ప్యాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి షరీఫ్, ఉప ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, ఏఐబీఈఏ రాష్ట్ర నాయకులూ పీవీ కృష్ణ రావు ప్రసంగించారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర

- మిగతా 2 లో

రేపు లోక్‌సభ ముందుకు

జమిలి బిల్లు

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలపై మోదీ సర్కారు అత్యంత ఆసక్తి కనబరుస్తోంది. సాధ్యమైనంత త్వరలో దీనిని అమలులోకి తీసుకురావాలని వడివడిగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా జమిలి ఎన్నికలపై ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ నివేదికను, దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన బిల్లును కేంద్ర కేబినెట్ ఇప్పటికే ఆమోదించింది. ఇక ఈనెల 16న లోక్‌సభ ముందుకు వన్ నేషన్–వన్ ఎలక్షన్ బిల్లు తీసుకురావడానికి మోదీ సర్కారు అన్ని ఏర్పాట్లు చేసింది. సోమవారం ఈ బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి ఎన్నికల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభ, రాష్ట్ర

- మిగతా 2 లో

యోల్‌కు మళ్లీ పదవీ గండం

ద.కొరియా అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం

పార్లమెంట్ ఆమోదం

సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడు యోల్ సుక్ యోల్‌పై అభిశంసన తీర్మానాన్ని నేషనల్ అసెంబ్లీ ఆమోదించింది. అసెంబ్లీలో మొత్తం 300 మంది ఉండగా.. 204 మంది అభిశంసన తీర్మానానికి అనుకూలంగా... 85 మంది వ్యతిరేకంగా ఓటేశారు. దీంతో ఆయన త్వరలోనే పదవీ బాధ్యతల్లో నుంచి తప్పుకుం టారన్న సంకేతాలందాయి. ఈ తీర్మానానికి సంబంధించిన పత్రాలను రాజ్యాంగం ప్రకారం న్యాయస్థానానికి పంపుతారు. వాటిని పరిశీలించేందుకు కోర్టుకు 180 రోజుల గడువు ఉంటుంది. ఆలోగా అధ్యక్షుడిగా యోల్‌ను కొనసాగించాలా.. లేదా అన్నది న్యాయ స్థానం నిర్ణయిస్తుంది. ఆయనను తొలగిస్తేగనుక 60 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలి. అప్పటి వరకు ప్రధానమంత్రే... అధ్యక్ష బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 'ఎమర్జెన్సీ మార్షల్ లా' విధించిన యోల్‌పై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. యోల్ తన ప్రకటనను వెనక్కు తీసుకున్నాగానీ పరిస్థితులు చక్కబడలేదు. అధ్యక్షుడి రాజీనామాకు విపక్షాలు పట్టుబట్టాయి. మార్షల్ లాను వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదిం చింది. మార్షల్ లా అమలు చట్టవిరుద్ధమని స్పీకర్ ప్రకటించారు. అధ్యక్షుడిపై ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి. అయితే అధికార పీపుల్ పవర్ పార్టీ (పీపీపీ) ఓటింగ్‌ను బహిష్కరించడంతో అది వీగిపోయింది. మళ్లీ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. దీంతో యోల్ తొలగింపునకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఎఫ్‌బీఐ నూతన డైరెక్టర్‌పై నిఘా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ త్వరలో పగ్గాలు చేపట్టనున్న క్రమంలో కీలక పదవుల్లో నియామకాలను చకాచకా చేపడుతున్నారు. ఇదే క్రమంలో కొందరు భారత సంతతి అమెరికన్లకు కీలక బాధ్యతలు అప్పగించారు. ఇలాంటి వారిలో కశ్యప్ పటేల్ ఉన్నారు. ఈయనను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్ పదవి వరించింది. అయితే కొత్త డైరెక్టర్‌పై ఎఫ్‌బీఐ నిఘా పెట్టిందని ఓ నివేదిక తెలిపింది. న్యూ గవర్నమెంట్ వాచ్‌డాగ్ ఈ మేరకు వెల్లడించింది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో తన ఓటమికి ఎఫ్‌బీఐ సభ్యులే కారణమని ట్రంప్ గతంలో ఆరోపించారు. తమ రహస్య సమాచారాలను మీడియాకు, ఇతరులకు లీక్ చేశారని తెలిపారు. దీంతో ఎఫ్‌బీఐ కొత్త డైరెక్టర్ నియామకం అనంతరం సంస్థలోని సిబ్బందిపై వేటు పడుతుందని, ఉద్యోగుల్లో అభద్రతా భావం పెరిగింది. దీంతో కశ్యప్ పటేల్‌పై వారు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఇరాన్ హ్యాకర్లు ఆయనను లక్ష్యంగా చేసుకున్నట్లు సీఎన్ఎన్ పేర్కొంది. దీనిపై ట్రంప్ అధికార మార్పిడి బృందం ప్రతినిధి అలెక్స్ స్పందిస్తూ గతంలో ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు ఇరాన్‌కు వ్యతిరేకంగా కశ్యప్ పటేల్ పని చేశారని తెలిపారు. ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా అమెరికాను సురక్షితంగా ఉంచుతారన్నారు. సైబర్ దాడులపై ఎఫ్‌బీఐ ఇప్పటికే పటేల్, ట్రంప్ బృందానికి సమాచారం ఇచ్చినట్లు మీడియా తెలిపింది.

సిరియాపై జోక్యం చేసుకోవద్దు

రష్యా, ఇరాన్‌కు టర్కీ సూచన

అంకారా: సిరియా వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దంటూ రష్యా, ఇరాన్‌కు టర్కీ సూచించింది. 'దమాస్కస్ తిరుగుబాటుదారుల వశమైంది. ఇంకా సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ దళాలకు మద్దతిచ్చే ప్రయత్నాన్ని సాగించవద్దు' అని రష్యా, ఇరానియన్లకు టర్కీ విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్ స్పష్టంచేశారు. '2011లో అంతర్యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అసద్‌కు రష్యా, ఇరాన్ మద్దతుగా నిలిచాయి. ఆ దేశాలు సహాయం చేసినప్పటికీ తిరుగుబాటుదారులే గెలిచేవారు. అయితే, ఫలితం మరింత హింసాత్మకంగా ఉండేది' అని ఫిదాన్ పేర్కొన్నారు. అధికార బదిలీపై తిరుగుబాటుదారులతో చర్చలు జరిపాకే అసద్ సిరియాను వీడారని, ఆయనకు తమ దేశంలో రాజకీయ శరణ కల్పిస్తున్నామని రష్యా ప్రకటించింది.

గంటకు 30 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిపింది. అప్రమత్తత, నివారణ చర్యలు తీసుకోని పక్షంలో ప్రమాదం మరింత పెరుగవచ్చని పేర్కొంది. భవిష్యత్తులో నీటికుంటలు, బోరుబావులు, పర్యాటక ప్రాంతాల్లో సంభవించే ప్రమాదాలను తగ్గించడానికి ప్రపంచ దేశాలు తగు విధంగా చర్యలు చేపట్టాలని, సముచిత నిధులు కేటాయించాలని సూచించింది. ఒక్క 2021 సంవత్సరంలోనే మూడు లక్షల మంది నీట మునిగి మరణించినట్లు నివేదిక పేర్కొంది. తక్కువ-మధ్యస్థ ఆదాయంగల దేశాల్లో ఇలాంటి ప్రమాదాలు అధికమని వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన ఘటనల్లో 92శాతం పేద దేశాల్లోనే జరిగినట్లు నివేదిక తెలిపింది. 2021లో పశ్చిమాసియా దేశాల్లో (భారత్‌తో సహా) 83 వేల మరణాలు సంభవించగా... ప్రపంచ మరణాల శాతంలో ఇది 28 శాతమని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. జెనీవాలో జరిగిన సమావేశంలో డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయసస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ నివేదికపై మాట్లాడారు. నీటి ప్రమాదాలపై అవగాహన పెంచుకోవడానికి తమ తాజా నివేదిక ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. అలాగే నివారణ వ్యూహాలకు మార్గనిర్దేశం అందిస్తుందని, ప్రమాదాల కేసుల ట్రాకింగ్‌కూ ఉపయోగపడుతుందని అన్నారు. యూరోపియన్ దేశాల్లో ఇలా మరణించే వారి శాతం 68 శాతంగా, పశ్చిమాసియా దేశాల్లో 48 శాతం మేర తగ్గినట్లు నివేదిక తెలిపింది. ఈ ప్రమాదాల్లో ఎక్కువగా చనిపోయేది చిన్నారులు, యువత అని పేర్కొంది. ఐదేళ్ల లోపు చిన్నారుల మరణాల శాతం 24 శాతం కాగా 5-14 సంవత్సరాల మధ్య వయసులవారిలో మరణాలు 19 శతం, 15-29 మధ్య వయస్కుల్లో 14 శాతంగా ఉందని వెల్లడించింది భారత్‌లో సంభవించిన మరణాలను గమనిస్తే... 26 శాతం (30-44 మధ్య వయసు), 25 శాతం (18-29 వయసు), 17 శాతం (45-59 వయసు), 12 శాతం (0-13 వయసు), 10 శాతం (14-17), 10 శాతం (60 ఏళ్లకు పైబడినవారు)గా ఉన్నట్లు పేర్కొంది. ఈ పరిస్థితుల్లో మార్పు రాకపోతే భవిష్యత్తులో ఎక్కువ మంది చనిపోయే అవకాశం ఉందని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరించింది. ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోకపోతే... ఇది సైలెంట్ కిల్లర్‌గా మారుతుందని హెచ్చరికలు చేసింది.

18న రైల్ రోకో

న్యూఢిల్లీ: ఢిల్లీలోని శంభు సరిహద్దు రణరంగంగా మారింది. రైతుల ఆందోళనతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అయితే లాఠీ చార్జి, బాష్పవాయువు, రబ్బర్ బుల్లెట్లతో రైతులను పోలీసులు అడ్డుకుంటున్నారు. దీంతో శనివారం రైతుల జాతా ముందుకెళ్లలేకపోయింది. దీంతో ఈనెల 18న రైల్ రోకోకు రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ పిలుపునిచ్చారు. రైతులపై రసాయనలు చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బాంబులు సైతం విసిరారని మండిపడ్డారు. ఈ ఘటనల్లో 17 మంది గాయపడ్డారని చెప్పారు. కొందరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. గాయపడ్డ రైతులకు సరైన చికిత్స అందించాలని పంజాబ్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని పంధేర్ చెప్పారు. తమ భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. ఈనెల 16న ట్రాక్టర్ ర్యాలీ, 18న రైల్ రోకోకు పిలుపునిచ్చారు. రైల్ రోకో జయప్రదం చేయాలని పంజాబ్ రైతులను కోరారు. రైతులకు మద్దతుగా ప్రకటనలు చేస్తే చాలదని, వారి సమస్యల పరిష్కారం కోసం పార్లమెంటును స్తంభింపజేయాలని ప్రతిపక్షాలనుద్దేశించి పంధేర్ అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రైతు సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపిస్తానన్న హామీకి కట్టుబడాలని డిమాండ్ చేశారు.

సహకార బ్యాంకుల బలోపేతానికి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సహకార బ్యాంకుల ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల పోరాటాలకు సీపీఐ అండగా ఉంటుందని హామీనిచ్చారు. సహకార బ్యాంకుల యాజమాన్యం, ఉద్యోగులు, యూనియన్లు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పనిచేయడం ద్వారా సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. సహకార బ్యాంకుల వ్యవస్థలో రెండంచెల వ్యవస్థను అమలు చేయాలనే ఉద్యోగుల డిమాండ్ న్యాయమైనదని కూనంనేని అన్నారు. దీంతో వ్యవస్థాగత ఖర్చులు, వడ్డీ తగ్గి ప్రధాన లబ్ధిదారులైన రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగానికి, రైతుకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉన్న సహకార బ్యాంకుల ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు, పింఛన్, హెల్త్ కార్డులు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు.

మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సహకార బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టతకు చర్యలు చేపట్టిందన్నారు. రాంబాబు అధ్యక్షోపన్యాసం చేస్తూ సహకార బ్యాంకులపై కేంద్ర వివక్షపూరిత ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కొండూరు రవీందర్ ప్రసంగిస్తూ దేశంలో సహకార వ్యవస్థ బలంగా ఉన్న విషయాన్ని ఐక్యరాజ్య సమితి గుర్తించి ఇక్కడ సహకార సదస్సు నిర్వహించడానికి ముందుకు వచ్చిందన్నారు. కుంభం శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు వ్యాపార లావాదేవీలు పెంపొందించే వారికి తగిన ప్రోత్సాహకాలు ఇస్తామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అపెక్స్ బ్యాంక్ యాజమాన్యంతో చర్చించి తన వంతు కృషి చేస్తాన్నారు. రవికుమార్ మాట్లాడుతూ సహకార బ్యాంకుల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని, ఈ చర్యలను నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్ వద్ద అందోళన చేస్తామన్నారు. కొన్ని రాష్ట్రాలలో సహకార బ్యాంకులలో ప్రైవేటు పెట్టుబడులకు జరుగుతున్న ప్రయత్నాలను తిప్పకొట్టాలన్నారు. సహకార బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వడ్డీ 6 శాతం రాయితీని, ఇతర ప్రొత్సాహకాలను యధావిధిగా కొనసాగించాలని బాలరాజు డిమాండ్ చేశారు.

ఏపీకి జాతీయ ఇంధన వినియోగ అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం పునరుత్పాదక ఇంధన శాఖ కేంద్రమంతి శ్రీపాద్ నాయక్ చేతుల మీదుగా న్యూఢిల్లీ విజ్ఞాన భవన్‌లో అవార్డు ప్రదానం చేశారు. పభుత్వం తరపున ఇంధనశాఖ జాయింట్ సెక్రటరీ, రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ సీఈవో బీఏవీపీ కుమారరెడ్డి అవార్డును స్వీకరించారు. ఎనర్జీ ఎఫిషియన్సీకి సంబంధించి ముఖ్యమంతి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వం, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ సహాయ సహకారాలు, రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ విభాగాలు, వినియోగదారుల సహకారంతో అవార్డు సాధించడంలో కీలకంగా నిలిచాయని కుమారరెడ్డి పేర్కొన్నారు.

రైతుకు రూ.2 లక్షల రుణం

(మొదటిపేజీ తరువాయి)

రైతులు పెడుతున్న ఖర్చులను, ద్రవ్యోల్బణం పెరుగుదలను పరిశీలిస్తూ ఆర్‌బీఐ ఈ పరిమితి పెంచుతూ వస్తోంది. 2004లో కేవలం రూ.10 వేలే ఉంది. క్రమంగా పెంచుతూ తాజాగా దీన్ని రూ.2 లక్షలకు పెంచింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం... సాధారణంగా భూ యజమానుల నుంచి ఎలాంటి పూచీకత్తు అడగకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీతో రుణం తీసుకొని అప్పులపాలవుతున్నారు. అలాంటివారికి అండగా ఉండేందుకు రిజర్వ్ బ్యాంక్ ఈ సదుపాయం కల్పిస్తోంది. వ్యవసాయ పెట్టుబడుల ధరలు పెరుగుతున్నందున రైతులకు రుణ సదుపాయం మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వ్యవసాయ మంత్రిత్వశాఖ తెలిపింది.

ఈ చర్య ద్వారా చిన్న, సన్నకారు రైతులైన 86 శాతం మందికి ప్రయోజనం చేకూరనుందని పేర్కొంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను వేగంగా అమలుచేయాలని, కొత్త రుణ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించాలని బ్యాంకులకు సూచించింది. వ్యవసాయ రంగంలో రైతుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు, వారికి అవసరమైన ఆర్థిక సౌలభ్యం కలిగించేందుకు ఇదొక వ్యూహాత్మక చర్యగా అభివర్ణించింది.

సందీప్ ఘోష్‌కు బెయిల్‌పై కోల్‌కతాలో నిరసనలు

కోల్‌కతా: ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌కు బెయిల్ రావడంపై కోల్‌కతాలో నిరసనలు వెల్లువెత్తాయి. బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ (డబ్ల్యూబీజేడీఎఫ్) శనివారం మధ్యాహ్నం కరుణామోయి నుంచి సాల్ట్ లేక్‌లోని సీబీఐ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించింది. సందీప్ ఘోష్‌కు బెయిల్ ఇవ్వడాన్ని ఆక్షేపించారు. ఇలాంటి వారు బయటకు వస్తే భవిష్యత్‌లో మాకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. 'న్యాయం జరిగే వరకు రోడ్లపైనే ఉంటాం. సీబీఐపై మాకు నమ్మకం ఉంది కానీ ఆ సంస్థ ఏం చేస్తోందో తెలియదు' అని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, వామపక్ష అనుబంధ విద్యార్థి సంఘాల అధ్వర్యంలో కొన్ని చోట్ల ప్రదర్శనలు జరిగాయి. 90 రోజులలో చార్జిషీట్ దాఖలు చేయడంలో సీబీఐ విఫలమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీబీఐ ఏం చేస్తున్నదో తెలియదు కానీ న్యాయం జరిగేంత వరకు న్యాయ పోరాటం, వీధి పోరాటం ఆగబోదని నిరసనకారులు స్పష్టంచేశారు. బాధితురాలి తల్లిదండ్రులు కూడా నిరసనల్లో పాల్గొన్నారు.

రేపు లోక్‌సభ ముందుకు జమిలి బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేలా రాజ్యాంగ సవరణ బిల్లుకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో అధికార బీజేపీ 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అనే కీలక ప్రణాళిక అమలుదిశగా ముందడుగు వేసింది. మూడు కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్టాలను రాజ్యాంగ సవరణ బిల్లుతో అనుసంధానించేందుకు, చట్టాలను సవరించడానికి ఒక సాధారణ బిల్లు సహా రెండు ముసాయిదా చట్టాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఇటీవల సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదించిన రెండు బిల్లుల్లో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు కాగా... మరొకటి సాధారణ బిల్లు. మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లోని (పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూకశ్మీర్) అసెంబ్లీలకు సంబంధించిన చట్టాలను సవరించేందుకు సాధారణ బిల్లు తీసుకొస్తున్నారు. కేబినెట్ అజెండాలో ఈ బిల్లులు లేకపోయినా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పట్టుపట్టడంతో ఇవి ఆమోదం పొందాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతోపాటే స్థానిక ఎన్నికలనూ నిర్వహించాలని రామ్‌నాథ్ కోవింద్ అధ్వర్యంలోని కమిటీ సిఫార్సు చేసింది. ఇందుకోసం రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రవేశపెట్టాలని సూచించింది. అయితే స్థానిక ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టిన కేంద్రం... లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు ఆమోదం తెలిపింది. దీనికి 50 శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సిన అవసరం లేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. స్థానిక ఎన్నికలనూ వాటితో కలిపి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణతోపాటు 50 శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అయితే రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మద్దతు అవసరం. ఎన్డీయేకు అంత బలం లేకపోవడంతో ఇండియా ఐక్యసంఘటనలోని కొన్ని పార్టీల మద్దతు తీసుకోవాల్సి ఉంటుంది. 542 మంది సభ్యులు ఉన్న లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది మద్దతుంది. ఇండియా ఐక్యసంఘటనకు 235 మంది సభ్యులున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 361 మంది సభ్యుల మద్దతు అవసరం. బిల్లులపై సమగ్ర చర్చ జరగాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం... వాటిని పార్లమెంటులో ప్రవేశపెట్టాక పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ద్వారానే రాష్ట్రాల స్పీకర్లతో సంప్రదింపులు జరపాలని భావిస్తోంది.

శంభు సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

అణిచివేయలేరని చెప్పారు. ఖనౌరి సరిహద్దు వద్ద సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర) రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లెవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని, ఆయన ఆరోగ్యం ప్రధానితో సహా అందరి కళ్ల ముందే క్షీణిస్తోందని ఆయన వాపోయారు. తాము జెండాలు, దుస్తులతో మాత్రమే చలో ఢిల్లీ వెళుతున్నామని, కావాలంటే తమను క్షుణ్ణంగా సోదాలు చేసుకోవచ్చని, తాము కేవలం సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడేందుకే ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్నామని ఆయన వివరించారు. మరోవైపు...రైతు నేతల విజ్ఞప్తులపై అంబాలా ఎస్పీ స్పందిస్తూ రైతులు ఢిల్లీకి వెళ్లాలనుకుంటే తగిన అనుమతి తీసుకోవాలని, అప్పుడు వారిని అనుమతించేదుకు అభ్యంతరం లేదని చెప్పారు. సుప్రీంకోర్టు విచారణకు కొంత సమయం పడుతుందని, అందువల్ల రైతులు తాత్కాలికంగా తమ నిరసనలు నిలిపివేయాలని హర్యానా మంత్రి అనిల్ విజ్ కోరారు.

రైతుల డిమాండ్లు...

తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని రైతులు ప్రధానంగా కోరుతున్నారు. రుణ మాఫీ చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, రైతులపై పెట్టిన పోలీస్ కేసులు ఎత్తివేయాలని, 2021 లఖింపూర్‌ఖేరి బాధితులకు న్యాయం చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు అనారోగ్యం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నట్టు చెప్పారు. గత పాలకులు గురుకుల పాఠశాలల నిర్వహణ, భవన నిర్మాణాలకు కేవలం రూ.70 కోట్ల బడ్జెట్లో కేటాయించగా, తమ ప్రభుత్వం రూ.ఐదువేల కోట్లు కేటాయించిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య పేదలకు అందించడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు ఐదువేల కోట్లు కేటాయించినట్టు వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. 30 నియోజకవర్గాల్లో భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. విద్యార్థులకే కాకుండా ఆసుపత్రిలో ఉన్న రోగులకు కూడా డైట్ చార్జీలను పెంచామని వెల్లడించారు.

ఉపాధ్యాయులు పూజింపబడాలి

విద్యాబుద్ధులు నేర్పించే గురువుగా భగవంతుడు ఇచ్చిన వరాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని, సమాజంలో పూజింపబడాలని భట్టి పేర్కొన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి బిడ్డకు మంచి వసతితో కూడిన విద్యను అందించాలన్నది తమ లక్ష్యం అన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి బుక్స్, యూనిఫామ్స్, హాస్టల్ విద్యార్థులకు బెడ్ షీట్స్, పరుపు, మంచం, చక్కటి వసతి కల్పించడంతో పాటు పోషకాహారం అందిస్తామన్నారు. తొలుత మల్లు భట్టి విక్రమార్కకు జిల్లా అధికారులు, గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

స్వోత్కర్ష...పరనింద

(మొదటిపేజీ తరువాయి)

నాటారని కాంగ్రెస్‌నుద్దేశించి విమర్శలు గుప్పించారు. ఒక దేశం, ఒక రేషన్ కార్డు, ఆయుష్మాన్ కార్డు, డిజిటల్ ఇండియా గురించి మాట్లాడారు. రాష్ట్ర భాషల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. కాంగ్రెస్ పాలనలో రాజ్యాంగానికి 75 సార్లు సవరించారని, ఎమర్జెన్సీ కాలంలో ప్రజల హక్కులు హరించారని, కోర్టులు, పత్రికల గొంతు నొక్కేశారన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదోన్నతిని కూడా అడ్డుకున్నారన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అనేక కుట్రలు చేశారన్నారు. నెహ్రూ, ఇందిర గాంధీ, రాజీవ్ గాంధీ ముగ్గురూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీశారని, కీలక నిర్ణయాలు తీసుకునేది పార్టీ అధ్యక్షురాలు అని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అన్నారని, ఇదే కాంగ్రెస్ పాలన తీరుకు నిదర్శనమని మోదీ వ్యాఖ్యానించారు. జుమ్లా పదం కాంగ్రెస్‌కు ఎంతో ఇష్టమని... గరీబీ హఠావో అనే ఆ పార్టీ నినాదం దేశంలోనే అతిపెద్ద జుమ్లా అని ప్రధాని విమర్శించారు. ఒకే కుటుంబం 55 ఏళ్లపాటు దేశాన్ని పాలించిందని, ఆ కుటుంబం ఈ దేశానికి అనేక విధాలుగా నష్టం కలిగించిందని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. '1947 నుంచి 1952 వరకు ఎన్నికైన ప్రభుత్వం మనకు లేదు.

ఆ సమయంలో ఆ కుటుంబం ఈ దేశానికి చేసిన నష్టం అంతా ఇంతా కాదు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు అనేక విధాలుగా యత్నించారు. రాజ్యాంగ మార్పుపై రాష్ట్రాల సీఎంలకు నెహ్రూ లేఖలు రాశారు. ఆయన తప్పు చేస్తున్నారని బాబూ రాజేంద్ర ప్రసాద్ కూడా చెప్పారు. ఎంతో మంది పెద్దలు సలహాలు ఇచ్చినా నెహ్రూ వినలేదు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు అనేకసార్లు ప్రయత్నించారు' అని అన్నారు.

మోదీ తన ప్రసంగాన్ని ముగిస్తూ రాజ్యాంగ విలువలను సమర్థించేవిగా 11 ప్రతిపాదనలు చేశారు. అవి 1) ప్రభుత్వమైనా... పౌరులైనా తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలి. 2) సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అనేది సమ్మిళిత వృద్ధికి హామీనిచ్చే విజన్ 3) అవినీతిని సహించేది లేదు. 4) దేశ సంస్కృతి సంప్రదాయాలు చూసి పౌరులు గర్వపడాలి... చట్టాలను గొప్పగా అనుసరించాలి 5) వలసవాద ఆలోచన విధానాన్ని మార్చుకోవాలి. 6) కుటుంబ రాజకీయాలకు స్వస్తి పలకాలి 7) రాజ్యాంగాన్ని గౌరవించాలి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం దాని దుర్వినియోగాన్ని ఆపాలి 8) రిజర్వేషన్లు కోల్పోకుండా చూడాలి, మతాధారిత రిజర్వేషన్లను నివారించాలి 9) మహిళల నాయకత్వంలో పురోభివృద్ధికి భారత్ ఉదాహరణ కావాలి 10) భారత అభివృద్ధికి రాష్ట్రాలు హామీనివ్వాలి. రాష్ట్రాలభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం. 11) ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ మన లక్ష్యం.

విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, అందుకే రాష్ట్రంలో 75 ఐటీఐ లను టాటా సంస్థతో కలిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేశామని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నిరుద్యోగులకు నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 2028 ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. క్రీడల్లో ప్రోత్సహించే ఉద్దేశంతో నిఖత్ జరీన్, సిరాజ్ వంటి వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కార్పొరేట్ కు దీటుగా ప్రతీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. తప్పుచేసే వారిపై చర్యలు తప్పవని, విద్యార్థులతో మెస్ మేనేజ్మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈడీ అధికారులపై క్యాసినో నిర్వాహకుల దాడి

పనాజి: దేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులపై జరుగుతున్న వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఓ కేసు నేపథ్యంలో క్యాసినో నౌకలో సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గోవాలోని ఆఫ్‌షోర్ క్రూయిజ్ ప్రైడ్ క్యాసినో నౌకలో సోదాలకు వెళ్లిన ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ పోలూరి చెన్నకేశవరావు, ఇద్దరు సిబ్బందిపై క్యాసినో డైరెక్టర్, అతడి అనుచరులు దాడికి పాల్పడినట్లుగా గోవా పోలీసులు వెల్లడించారు. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి తాము స్వాధీనం చేసుకున్న ఆధారాలను సైతం ధ్వంసం చేశారని అధికారులు ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని నిందితులు బెదిరించారన్నారు. గత నెలలో ఢిల్లీలోని బిజ్వాసన్ ప్రాంతంలో ఓ సైబర్ మోసం కేసును ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్న సమయంలో కొంతమంది దుండగులు వారిపై దాడులకు పాల్పడ్డారు. జనవరిలోనూ పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో కేసు దర్యాప్తుకు వెళ్లిన అధికారులపై అక్కడి వారు దాడి చేయడంతో ముగ్గురు అధికారులు గాయపడ్డారు. దీంతో కేంద్ర దర్యాప్తు సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఏకగ్రీవంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలను బహిష్కరించడంతో ఎక్కువ ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో మాత్రం పార్టీల కతీతంగా కొందరు నామినేషన్లు దాఖలు చేయగా, వాటికి ఎన్నిక నిర్వహించారు. ఇటువంటి స్థానాల్లో వైసీపీ నేతలు అధికారపక్ష అభ్యర్థులకు వ్యతిరేకంగా పోటీ చేసిన వారికి పరోక్ష మద్దతుచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మేజర్, మైనర్ ఇరిగేషన్ పరిధిలోని మొత్తం 6049 ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించగా... రాత్రి 9 గంటల సమయానికి దాదాపు 5857 స్థానాల ఫలితాలు ప్రకటించారు. మిగిలిన స్థానాల్లో లెక్కింపు కొనసాగుతోంది. కూటమి పార్టీలు బలపర్చిన అభ్యర్థులనే విజయం వరించింది. ఉదయం 9.45 నుంచి 10.15 గంటల వరకు పోటీదారుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. పరిశీలన తర్వాత అభ్యర్థుల తుది జాబితా ప్రకటించారు. పోటీ ఉన్న చోట ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎన్నిక నిర్వహించారు. మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలు ప్రకటించారు. సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు ఎన్నికైన డైరెక్టర్లలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునే ప్రక్రియ చేపట్టారు. సాగునీటి సంఘాల ఎన్నికలను పురస్కరించుకొని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. సీమ జిల్లాల్లో అక్కడక్కడా స్వల్ప ఘర్షణలు చోటుచేసుకోగా, మిగిలిన ప్రాంతాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

మాదిగలకు న్యాయం

'గ్లోబల్ మాదిగ డే'లో రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఎన్నికల్లో రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రకటన చేస్తూ... మాదిగలకు అనుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ విధానం స్పష్టంగా తెలియజేశామని పేర్కొన్నారు. గ్లోబల్ మాదిగ డే-2024 కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సుప్రీం కోర్టులో పెండింగ్ లో ఉన్న మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల కేసులో బలమైన వాదనలు వినిపించేలా దామోదర రాజనర్సింహ నేతృత్వంలో న్యాయవాదులను నియమించామన్నారు. సుప్రీంకోర్టు తీర్పును తూచా తప్పకుండా అమలు చేస్తామని శాసనసభ వేదికగా స్పష్టంగా ప్రకటించామని చెప్పారు. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా అధ్యయనం చేసేందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘం వేశామని చెప్పారు. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జ్యుడీషియల్ కమిషన్‌ను కూడా నియమించామని, వారం రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందన్నారు. తన పేషీలో మాదిగలు ఉండాలని డాక్టర్ సంగీతను నియమించుకున్నామని తెలిపారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో వీసీగా మాదిగ సామాజిక వర్గం వ్యక్తిని నియమించామని అన్నారు. ఐఐటీ వీసీగా, విద్యా కమిషన్ మెంబర్ గా, ఉన్నత విద్యా శాఖలో మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించామని, పగిడిపాటి దేవయ్యని స్కిల్ యూనివర్సిటీ బోర్డు డైరెక్టర్‌గా నియమించామన్నారు. తమ ప్రభుత్వం న్యాయం చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. నా రాజకీయ ప్రస్థానంలో మాదిగ సామాజిక వర్గం పాత్ర ఎంతో ఉందన్నారు.

డైట్ చార్జీలు పెంపు : కమిషనర్

విశాలాంధ్ర - ఇల్లందు : ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతి విద్యార్థి నాణ్యమైన ఆహారం తీసుకోవాలని ఇల్లందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్స్‌లో డైట్ బిల్లులు పెంచిన నేపథ్యంలో తెలంగాణ మైనార్టీ గురుకులాల్లో కూడా పెంచడం జరిగింది. ఈ నేపథ్యంలో కొత్త మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పట్టణంలోని స్థానిక గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్ విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ ఉపకారాన్ని అభినందించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే నాణ్యమైన పౌష్టికాహారం ఎందుకు తీసుకోవాలో పలు సూచనలు, సలహాలు కమిషనర్ చేశారు. కార్పొరేట్ తరహాలో అందించే నాణ్యమైన ఆహారాన్ని అస్వాదిస్తూ ఒక లక్ష్యంతో అంకితభావంతో చదువుకోవాలని, తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ భీమనపల్లి కృష్ణయ్య, మున్సిపాలిటీ రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

108 వాహనంను ప్రారంభించిన దయానంద్

విశాలాంధ్ర - పెనుబల్లి : పెనుబల్లిలో 108 వాహనంను, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన 108 వాహనంను పెనుబల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరితో కలిసి డాక్టర్ మట్ట దయానంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు, కల్లూరు ఏఎంసి వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది, పెనుబల్లి మండలం అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, మిట్టపల్లి కిరణ్ కుమార్, వంగా నిరంజన్ గౌడ్, పసుమర్తి విశ్వనాథం, చీకటి రామారావు, ఈడ కమలాకర్‌రావు, చిన్నస్వామి, గోదా చెన్నారావు, కాటినేని చెన్నకేశవులు, మల్లెల రాజా, పోతురాజు కిషోర్, గోగినేని రమేష్, మేకతోటి కాంతయ్య, పెనుబల్లి మండలం, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలకు అందించే డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏటూరునాగారం బిసి బాలుర, ఎస్‌సి బాలికల హాస్టల్, ఎస్‌టి బాలుర, హాస్పిటల్, ఎస్‌టి బాలికల హాస్పిటల్, గిరిజన బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల గిరిజన గురుకుల రెసిడెన్సీల్‌లో వివిధ సేమియా తదితర వాటిని ప్రారంభించారు. ముందుగా చదువుల తల్లి సరస్వతి చిత్ర పాఠంకు పూలమాల వేసి, ఘనంగా ప్రారంభించారు. ప్రభుత్వం డైట్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచడంతో విద్యార్థులు పాటలు, నృత్యంలు చేశారు ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం యంపిడిఓ రాజ్యలక్ష్మి, కార్యదర్శి రమాదేవి, స్పెషల్ ఆఫీర్స్ బిసి బాలుర, ఎస్‌సి బాలికల హాస్టల్ హెచ్ డబ్ల్యూ ఓ రేణుక,ఎస్ సి బాలుర హాస్టల్ వార్డెన్ ఎస్ డబ్ల్యూ ఓ, వెట్నారి డాక్టర్ శ్రీకాంత్, ఎస్‌సి హాస్టల్ వార్డెన్ జి.ప్రశాంత్, ఎస్ టి హాస్టల్ వార్డెన్ మనోజ్ కుమార్, ఎస్‌టి బాలికల ఆశ్ర పాఠశాల హెడ్ మాస్టర్ సతీష్ కుమార్, ఇంచార్జి వార్డెన్ నిర్మల, గిరిజన బాలుర రెసిడెన్సీల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, గిరిజన బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజారామ్, సిబ్బంది చందా కళ్యాణ్, యెంపెల్లి ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విశాలాంధ్ర - వనపర్తి : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం, వారి భవిష్యత్తు కోసం ఎంతో వెచ్చిస్తోందని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచిన నేపథ్యంలో శనివారం మర్రికుంటలోని తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొత్త కామన్ డైట్ మెనూ చార్ట్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే విధంగా ప్రభుత్వం కొత్త డైట్ మెనూ ప్రారంభించిందని చెప్పారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు 40 శాతం మెస్ చార్జీలు, దాదాపు 200 శాతం కాస్మటిక్ చార్జీలు ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఖగవాన్, గిరిజన సంక్షేమ పాఠశాల ప్రిన్సిపల్ సరస్వతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు 40 శాతం మెస్ చార్జీలు, 200 శాతం కాస్మటిక్ చార్జీలను పెంచాడం జరిగిందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం నారాయణపూర్‌లో తెలంగాణ బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. డిఆర్డిఓ శ్రీనివాసరావు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ముందుగా కిచెన్ షెడ్, వంట పాత్రలను, స్టోర్ రూమ్ పరిశీలించారు. నూతన డైట్ మెనూ ప్రారంభించారు. 80 ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమం కన్నుల పండుగగా కొనసాగుతుందని, ఇదే డైట్ మెనూ స్ఫూర్తిగా తీసుకొని పగడ్బందీగా అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి...

మెదక్ జిల్లాలో గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, మెడికల్ కిట్, బయోమెట్రిక్ పరికరాలు, సీసీ కెమెరాలను పర్యవేక్షించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ నెల 15, 16వ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం నాలుగు పేపర్ల వారీగా ఈ పరీక్ష జరగనుందని తెలిపారు. జిల్లాలో 5855 మంది అభ్యర్థుల కోసం 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మెదక్‌లో 11 పరీక్షా కేంద్రాలలో 3,769 విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 9908696575 టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించి, వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

వ్యవసాయ రంగం సాంకేతికంగా ఎదగాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : మన వ్యవసాయ రంగం సాంకేతికంగా ఇంకా ఎదగాల్సి ఉందని కొత్త పరిశోధనలతో పురభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులకు వ్యవసాయపరంగా అన్ని విధాల మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వ్యవసాయ విద్యలో మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ కళాశాలలో సాగు చేస్తున్న మియాజాకి మామిడి సాగును, ఇతర పంటల సాగును నిశితంగా పరిశీలించారు. వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ హేమంత్ తాను చేపట్టే సాగు వినూత్న ప్రయోగాలు గురించి మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల కేవలం విద్యార్థులకు బోధన అందించడం మాత్రమే కాకుండా రైతులకు ఉపయోగపడేలా పురోగతి సాధించాలన్నారు. అశ్వరావుపేటలో ఆనాటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు ఆలోచనలతో ఇక్కడ వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు అంకురార్పణ జరిగిందన్నారు. ఈ ప్రాంతంతో పాటు ఇక్కడ రైతాంగాన్ని వ్యవసాయపరంగా మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇక్కడ వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిందన్నారు. 35 ఏళ్ల ప్రస్థానంలో 2,500 మంది వ్యవసాయ విద్యాధికులు, శాస్త్రవేత్తలు, ఇక్కడ నుంచే తయారయ్యారని గుర్తు చేశారు. వ్యవసాయ కళాశాల నా చిరకాల కలల పంట అని ఇతర వ్యవసాయ కళాశాలలకు దీటుగా ఈ కళాశాలను తీర్చిదిద్దడమే తన లక్ష్యంగా అభివృద్ధి చేస్తా అన్నారు. పంటలకు వాల్యూయేటెడ్ రావాలంటే ప్రాసెసింగ్ ప్లాంట్లను ఎక్కువ సంఖ్యలో నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం పామాయిల్ మొక్కల నుంచి బై ప్రొడక్ట్ పరిశోధనలు విస్తృతంగా జరగాలని ఆయన అధికారులతో అన్నారు. భవిష్యత్తులో కలెక్టర్, ఎస్పీల జీతం కంటే పామాయిల్ రైతులు ఎక్కువ ఆదాయాన్ని రాబట్టే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం వరి పంటలో నెంబర్ వన్‌గా నిలుస్తోందని ప్రభుత్వం వరి రైతులను మరింతగా ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి వివరించారు.

అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ మాది ఒక రైతు కుటుంబమని 1989లో గొప్ప సంకల్పంతో ఈ వ్యవసాయ కళాశాలను మంత్రి తుమ్మల సహకారంతో ఆనాడు ప్రారంభించారన్నారు. ఈ కళాశాల ఎంతోమంది గొప్ప శాస్త్రవేత్తలను తయారుచేసిందన్నారు. ములకలపల్లి మండలంలో ఫ్యాక్టరీ స్థాపనకు కృషి చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మలను కోరారు. ఈ సందర్భంగా చెట్ల ప్రాముఖ్యత తెలిపే పాటను ఎమ్మెల్యే జారే పాడి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.

కళాశాలలో జరిగిన సభలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పి ఓ రాహుల్ వ్యవసాయ రంగం పై అనేక కొత్త విషయాలను చర్చించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి, డాక్టర్ రాజిరెడ్డి హార్టికల్చర్ వైస్ ఛాన్సలర్, పాల్వంచ డిఎస్పి సతీష్ బాబు వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థులు, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్, మరిపెడ: ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం, పరిశుభ్రత, ఆరోగ్యం పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మరిపెడ తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, కాలేజ్‌లో కామన్ డైట్ మెనూ ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసి సరదాగా మాట్లాడుతూ అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టల్లో ఒకే విధమైన డైట్ ప్లాన్‌ను నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రారంభించారని, రాష్ట్రంలో గత పదేళ్లలో మొదటిసారిగా, సంక్షేమ హాస్టళ్ల చరిత్రలో మరెన్నడూ లేని విధంగా డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచుతూ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకొని అమలు పరుస్తున్నామని తెలిపారు. రెసిడెన్షియల్ హాస్టళ్లను నేడు వ్యక్తిగతంగా సందర్శించి, అక్కడే విద్యార్థులతో కలసి భోజనం చేసి పరిస్థితులను స్వయంగా అంచనా వేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ రెవెన్యూ కే.వీర బ్రహ్మాచారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, సంబంధిత జిల్లా అధికారులు. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిరుమలయపాలెంలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి

పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడే విధంగా ఇందిరమ్మ ప్రభుత్వం కామన్ డైట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మంత్రి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం, మహ్మదాపురం లోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి విద్యార్థులు, అధికారులు బ్యాండ్ వాయిస్తూ, పూలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదోని పిల్లలు కూడా ధనికుల పిల్లల్లా చదవాలని, పేదోని పిల్లల కోరికలు తీరేలా ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచిందన్నారు.

కడెం వాగు వంతెన నిర్మాణానికి మంత్రి భూమి పూజ

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ నియోజకవర్గంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క గంగాపూర్ వాసుల దశాబ్దాల కల నెరవేరుస్తూ వాగుపై వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కడెం మండలం మారుమూల అడవి ప్రాంతమైన కొండల మధ్య ఉండే గంగాపూర్‌కు వెళ్లాలంటే సోమవారి పేట గంగాపూర్, మధ్యలో కడెం వాగు నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. వాగు దాటలేక గంగాపూర్ నివాసితులు 20 ఐదు కిలోమీటర్ల ప్రయాణాన్ని ప్రయాణిస్తూ కడెం బ్రిడ్జ్ అవతలి భాగం నుండి పాండవ పూర్ మీదుగా దట్టమైన అడవి మధ్యలో ప్రయాణం చేసి అలసిపోయే వారు. గంగాపూర్ వాసులకు భయంకరమైన ప్రయాణాన్ని అధిగమిస్తూ, ప్రభుత్వం వాగుపై వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముందుగా ఖానాపూర్ మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను మంత్రి ధనసరి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆకస్మికంగా సందర్శించి. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సి దండే విట్టల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి ఆత్రం సుగుణ, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఉద్యమిస్తాం : విజయసారధి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో -మహబూబాబాద్: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 పార్లమెంట్‌లో ఆమోదించబడి హక్కుగా చట్టం చేయబడిన బయ్యారం ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా కాలయాపన చేసి ఏర్పాటు సాధ్యం కాదని కేంద్ర మంత్రి ప్రకటించడం తెలంగాణ ద్రోహిగా కిషన్ రెడ్డి ని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారధి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ తెలంగాణ హక్కని దానిని స్థాపించకుండా దశాబ్ద కాలంలో నాన్చివేత ధోరణితో వ్యవహరించిన మోడీ సర్కార్ తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ పార్లమెంటులో రాత పూర్వకంగా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు సాధ్యం కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం విభజన చట్టాన్ని అపహాస్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కిషన్ రెడ్డిని తెలంగాణ ప్రజలు ఎంపీగా గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే తెలంగాణ ప్రజల భిక్షతో కేంద్రమంత్రి అయి తెలంగాణ ద్రోహిగా మారారని ధ్వజమెత్తారు. తెలంగాణకు విభజన హక్కు ఉక్కు పరిశ్రమనకు సంబంధించి ఆనాటి ప్రభుత్వం సర్వే చేసి నీటి వనరులు రవాణా సౌకర్యం తదితర అంశాలను పరిశీలించిన పిదప, 36 వేల కోట్లతో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని స్పష్టంగా పేర్కొన్న విషయం కిషన్ రెడ్డికి గుర్తుకు లేదాయని ఆయన ప్రశ్నించారు. యూపీఏ 2 ప్రభుత్వంలో వచ్చిన 2014 విభజన హామీని అమలు చేయాల్సింది పోయి ఈ ప్రాంతం ఉపాధి అవకాశాలపై నీళ్లు చల్లుతారా ఇప్పటికీ ఈ ప్రాంతంలో బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు అని సిపిఐ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రజా పోరు పాదయాత్ర నిర్వహించడం, బయ్యారం ఉక్కు పరిశ్రమ అనేక ఆందోళనలు సిపిఐ ఆధ్వర్యంలో చేశామని తెలిపారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో ఏర్పాటుచేసిన కామన్ డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి. శ్రీనివాస్‌రావు, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మిలతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి డా. బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, ఇందులో భాగంగా విద్యార్థులకు 8 సంవత్సరాల తర్వాత డైట్ చార్జీలు 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలు 200 శాతం పెంచిందని తెలిపారు. ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఆరోగ్యకరమైన పోషక విలువలు కలిగిన మెనూ ప్రకటించిందని, ప్రతిరోజు వివిధ రకాలైన మెనూను సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని ఉన్నత స్థాయిలకు ఎదిగి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు, పోషకులతో కలిసి భోజనం చేశారు.

ఘనంగా డైట్ కాస్మోటిక్స్ చార్జీల పెంపు కార్యక్రమం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలకు అందించే డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ములుగు మండలం జగ్గన్నపేట గ్రామంలోని ట్రైబల్ వెల్ఫేర్ ఏహెచ్‌ఎస్ బాలికలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., డైరెక్టర్ టిసిఆర్ అండ్ టిఐ సముజ్వల, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవి చందర్‌తో కలసి పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వం అమలు చేసిన పథకంపై, కలెక్టర్ మాట్లాడారు. కలెక్టర్ విద్యార్థులతో కల్సి భోజనం చేశారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిడి పోచం, డిఈఓ పాణిని, డిడబ్లుఓ శిరీష, ప్రజాప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌హెచ్ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో డిజిటల్ మీడియా కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్

హైదరాబాద్: కెఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ ఇటీవల, 2024 డిసెంబర్ 2వ తేదీ నుండి 14వ తేదీ వరకు రెండు వారాల పాటు నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ (సిబీపీ)ని ముగించింది. ఇది అధునాతన డిజిటల్ మార్కెటింగ్ నైపుణ్యాలు, సోషల్ మీడియాలో సమకాలీన ధోరణులలో కెరీర్ ప్రారంభ అధ్యాపకులను ప్రోత్సహించడానికి రూపొందింది. న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) స్పాన్సర్ చేసిన ఈ కార్యక్రమం ఆచరణాత్మక పరిజ్ఞానం, పరిశ్రమకు సంబంధించిన పరిజ్ఞానంను నొక్కి చెప్పింది. విశిష్ట విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు కార్యక్రమ ప్రాముఖ్యతను పెంచడంలో కీలక పాత్ర పోషించారు. హెచ్ఆర్ మేనేజ్‌మెంట్, స్కిల్, కెరీర్ డెవలప్‌మెంట్‌లో కన్సల్టెంట్, అలాగే టెడ్ఎక్స్ థాట్ లీడర్, ఓడి ఫెసిలిటేటర్, బ్లాగర్, రచయిత, వక్త, హైదరాబాద్‌కు చెందిన రొటేరియన్ రవీంద్ర వర్మ పివిఎస్ ప్రారంభ సెషన్‌లో ఈ వేడుకకు విచ్చేశారు.

అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్ సుస్థిర వృద్ధి: కేర్‌ఎడ్జ్ రేటింగ్స్

ముంబయి: భారత ప్రభుత్వం ఆర్థిక ఏకీకరణ మార్గంలో కొనసాగుతుందని, భారతదేశ జీడిపి వృద్ధి ఒక మోస్తారుగానే ఉన్నప్పటికీ, ఎఫ్‌వై25లో 6.5 శాతంగా, ఎఫ్‌వై 26లో 6.7 శాతం వద్ద ఆరోగ్యకరంగానే ఉంటుందని అంచనా వేస్తున్నట్లుగా కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ పేర్కొంది. 2025కి సంబంధించి సెక్టార్ ఔట్‌లుక్‌పై నిర్వహించిన వెబ్‌నార్‌లో కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ తన అంచనాలను ప్రకటించింది. 2025లో అంతర్జాతీయ అనిశ్చితి ఉన్నప్పటికీ, భారత్ స్థిరంగా కొనసాగుతుందని కేర్‌ఎడ్జ్ రేటింగ్‌లు తెలియజేస్తున్నాయి. కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ చీఫ్ రేటింగ్ ఆఫీసర్, ఈడీ సచిన్ గుప్తా ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్థిరత్వం, స్థితిస్థాప కత ప్రపంచ సవాళ్లను ఎదుర్కొంటుండే ఎఫ్‌వై25 మొదటి సగం భారత దేశ కార్పొరేట్ సెక్టార్‌లో జాగ్రత్తతో కూడిన ఆశావాదాన్ని చిత్రీకరిస్తుందని, అనిశ్చిత అంతర్జాతీయ వాతావరణం మధ్య, ప్రైవేట్ మూలధన వ్యయంలో ఊహించిన ఊపు ఇంకా కార్యరూపం దాల్చనందున, దీర్ఘకాలిక పెట్టుబడులకు కట్టుబడి ఉండడానికి వ్యాపార సంస్థలలో సంకోచం ఉంటుందని, అయినప్పటికీ, ఊహించిన ద్రవ్య విధాన సడలింపు మద్దతుతో 2025లో ప్రైవేట్ పెట్టుబడిలో మెరుగుదలని ఆశిస్తున్నామని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే కేటాయించాలి

విశాలాంధ్ర - చర్ల : రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదరుల ఎంపికలో పారదర్శకంగా అర్హులైన వారికే కేటాయించాలని బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు చర్ల మండలంలో డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్, వద్ది చెక్ డ్యాం, బస్టాండ్ నుండి కాలేజీ వరకు రోడ్డు ఏర్పాటు చేస్తానని హామీలు ఇచ్చినట్లు గుర్తు చేసారు. అదేవిధంగా బలరాం నాయక్ ఎంపీ పార్లమెంటు ఎన్నికల సమయంలో చర్ల మండలానికి మెడికల్ కళాశాల ను ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీ ఇచ్చినట్లు వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మాహిళలకు ఫ్రీ బస్ ప్రయాణం ఇస్తూనే బస్సులు తగ్గించిందని విమర్శించారు. రైతు బంధు నిధులు, కౌలు రైతులకు రూ. 12 వేలు, కళ్యాణ్ లక్ష్మి తులం బంగారం వాగ్దానాలు నెరవేర్చడం లేదని ఎద్దేవ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మండల కో కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, కాక అనిల్, అంబోజిసతీష్, బుల్లెబ్బాయి తడికల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

తహసీల్దార్ శ్రీనివాస్

విశాలాంధ్ర - చర్ల : విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక ఎస్సీ హాస్టల్లో ఆయన సందర్శించారు. ప్రభుత్వం పెంచిన నూతన మెనూను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ ఫలాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అంకితభావంతో చదవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ప్రతి పేద విద్యార్థి అందిపుచ్చుకోవాలన్నారు. ఎమ్ఈఓ మాట్లాడుతూ ఒకప్పుడు తాము సరైన సౌకర్యాలు లేక అనేక అవస్థలు పడ్డామని ప్రస్తుతం సంక్షేమ హాస్టల్స్‌లో ప్రభుత్వం అనేక సౌకర్యాలు అందిస్తుందన్నారు. అంతకు ముందు జిల్లా సహాయక సంక్షేమ అధికారి కొప్పుల హన్మంతరావు వసతి గృహాన్ని సందర్శించారు. నూతన మెనుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది శ్రీకాంత్, సమ్మయ్య, రాంబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు లయన్స్ క్లబ్ రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాచకులు, దివ్యాంగులకు రగ్గులు పంపిణీ చేశారు. శనివారం కొత్తగూడెంలో మాజీమంత్రి దివంగత కోనేరు నాగేశ్వర్ రావు గృహం వద్ద, బస్టాండ్, పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లలో రోడ్ల పక్కన ఉండే అనాధలకు 50 రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ లయన్ మన్నెం జవహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇలానే ప్రతి ఒక్కరు సమాజంలోని పేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోనేరు ట్రస్ట్ చైర్మన్ లయన్ కోనేరు పూర్ణ చందర్‌రావు, సీనియర్ లయన్ మోరిసెట్టి మోహన్‌రావు, లయన్స్ క్లబ్ కొత్తగూడెం అధ్యక్షుడు షేక్ దస్తగిరి, కోశాధికారి చెరుకు శ్రీనివాస్, లయన్ శ్రీశైలం జయ కుమార్, ఉపాధ్యాయుడు చందర్‌రావు పాల్గొన్నారు.

సంపాదకీయం

అసత్యాలతో రాజ్యాంగంపై చర్చ

రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా శుక్ర, శనివారాల్లో లోక్‌సభలో రాజ్యాంగంపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. భవిష్యత్తులో రాజ్యాంగం ఆధారంగా మాత్రమే పరిపాలన కొనసాగుతుందన్న హామీ ఇవ్వడంలో ఈ చర్చ విఫలమైంది. ఇది రెండు రోజులపాటు ప్రత్యేకమైన చర్చే తప్ప రాజ్యాంగాన్ని కూలంకషంగా చర్చించడానికి ఉపకరించలేదు. శుక్రవారం లోక్‌సభలో రాజ్‌నాథ్ సింగ్ రాజ్యాంగంపై చర్చ ప్రారంభించారు. ఈ రాజ్యాంగం ఓ పేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ప్రధానమంత్రి కావడానికి అవకాశం ఇచ్చిందనడంతో మొదలుపెట్టి మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను ఏకరువు పెట్టారు. "మన రాజ్యాంగం భారత నాగరికతా విలువలను ప్రతిబింబిస్తుందన్నారు. కొంత మంది మన రాజ్యాంగాన్ని వలసవాద రాజ్యాంగం అంటారు. మరికొంతమంది ఒక రాజకీయ పార్టీ ఈ రాజ్యాంగం ఇచ్చిందంటారు. కానీ మన రాజ్యాంగం మన నాగరికత వ్యక్తీకరణ. ఇది మన "జాతీయోద్యమ చరిత్రకు సంకేతం" అన్నారు. కానీ ఈ రాజ్యాంగ రచన పూర్తి అయిన నాలుగు రోజుల తరవాతే సంఘ్ పరివార్ అధికార పత్రిక "పాంచజన్యం" ఈ రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని చేసిన వాదన రాజ్‌నాథ్ సింగ్‌కు గుర్తే రాలేదు. వలసవాద సంకెళ్లను తెంచడానికి సుదీర్ఘ కాలం జరిగిన పోరాటంలో సంఘ్ పరివార్‌కు ఎలాంటి పాత్రా లేనందుకు రాజ్‌నాథ్ సింగ్ సిగ్గు పడలేదు. కానీ రాజ్యాంగం గురించి ప్రత్యేక చర్చను, కాంగ్రెస్‌ను విమర్శించడానికి మహాస్త్రంగా వినియోగించుకోవడాన్ని విస్మరించలేదు. తమకు లేని వారసత్వాన్ని లాగేసుకోవడానికి సకల ప్రయత్నాలూ చేశారు. రెండు రోజులు జరిగిన చర్చను క్షుణ్ణంగా పరిశీలిస్తే కాంగ్రెస్ రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన సందర్భాల లెక్కలు తీయడంతోనే సరిపోయింది. కాంగ్రెస్ హయాంలో అనేకసార్లు రాష్ట్రాల ప్రభుత్వాలను రద్దు చేశారని రాజ్‌నాథ్ సింగ్ గొంతు చించుకున్నారు. ఇందిరా గాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించడాన్ని నోరారా విమర్శించి సంతృప్తి పడ్డారు. ఎమర్జెన్సీ విధించడాన్ని ఎవరూ అంగీకరించలేదు. ఎమర్జెన్సీ విధించినందుకు ప్రజలు ఇందిరా గాంధీని శిక్షించారు కూడా. అయినా ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించారని ఎన్ని సార్లు బీజేపీ నాయకులు తృప్తి పడతారో తెలియదు. దాదాపు అయిదు దశాబ్దాల కిందటి అపశ్రుతిని ఎన్ని సార్లు ఉటంకిస్తారో తెలియదు. రాజ్‌నాథ్ సింగ్ నుంచి ప్రధానమంత్రి మోదీ దాకా గతాన్ని తవ్వి పోసి సకల రుగ్మతలకు కాంగ్రెస్‌దే బాధ్యత అని దండోరా వేయడానికి పరిమితం అయ్యారు. కానీ రాష్ట్రపతి పాలనతో సంబంధం లేకుండానే ఈశాన్య రాష్ట్రాలలో, గోవాలో, మధ్యప్రదేశ్‌లో, మరీ ఇటీవలి కాలంలోనే మహారాష్ట్రలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని గద్దె దించడానికి బీజేపీ మూడు పార్టీలను ఎలా చీల్చిందో మాత్రం చెప్పలేదు. తాము చేసిన తొండిని అంగీకరించే ధైర్యం బీజేపీ ప్రభుత్వానికి లేదు. మోదీ ప్రభుత్వంలో మహిళలు, అణగారిన వర్గాలు, పేదల కోసం ప్రగతిశీల చర్యలు ఎలా తీసుకున్నారో చెప్పారు. నారీ శక్తి వందన పథకం గురించి చెప్పిన మాట చెప్పకుండా ఈ రెండు రోజులుగా చెప్తూనే వచ్చారు. కానీ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి 2029 దాకానో, 2034 దాకానో ఎందుకు ఆగాలో మాత్రం వివరణ ఇవ్వలేదు. అణగారిన వర్గాల కోసం ఇంత చేశాం, అంత చేశాం అని స్వకీర్తిగానంలో తడిసి ముద్దై పోయిన బీజేపీ నేతలకు బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, సమాచార హక్కు చట్టం లాంటి పురోగమన చర్యలు గుర్తుకు రాకపోవడం విడ్డూరం. ఇది తమ వీపు తామె నిమురుకుని తృప్తి పడేవారికి మాత్రమే సాధ్యమయ్యే పని.

వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగ హోదా ఇచ్చామని, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించామని చెప్పుకునే వారికి 370 అధికరణం రద్దే కశ్మీర్‌లో హింసకు కారణం అయితే దీన్ని రద్దు చేసిన తరవాత ఎన్నికలు నిర్వహించడానికి అయిదేళ్లు ఎందుకు ఆగవలసి వచ్చిందో, ఇది ప్రజానుకూలమైన చర్యే అయితే మొన్నటి ఎన్నికల్లో జమ్మూ-కశ్మీర్ ప్రజలు బీజేపీకి ఎందుకు పట్టం కట్టలేదో అన్న ఆత్మ పరిశీలన అవసరం మోదీ ప్రభుత్వానికి గుర్తే రాలేదు. ఒక కుటుంబం రాజ్యాంగానికి మొదటి నుంచి తూట్లు పొడుస్తూనే వచ్చిందని, ఆరు దశాబ్దాల కాలంలో రాజ్యాంగాన్ని 75 సార్లు సవరించారని మోదీ దెప్పి పొడిచారు. కాని తాను అధికారంలోకి వచ్చిన పది పదకొండేళ్ల కాలంలో రాజ్యాంగాన్ని ఎన్ని సార్లు సవరించారో మాత్రం ఆయన చెప్పరు. వాజ్‌పేయి హయాంలో రాజ్యాంగాన్ని మళ్లీ రచించడానికి న్యాయమూర్తి ఎం.ఎన్. వెంకటాచలయ్య నాయకత్వంలో కమిటీ ఎందుకు వేశారో మోదీ చెప్పరు. తాము చేసినవన్నీ సానుకూల సవరణలని సొంత కీర్తి గానంలో మునిగి పోయారు. ఇటీవల ఉత్తర ప్రదేశ్ శాసనసభ ఉప ఎన్నికల సమయంలో, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో ముస్లింలు ఓట్లు వేయకుండా అడ్డుకున్నది తామేనని ఆయన అంగీకరించరు. కాంగ్రెస్ ఇంత కాలంగా ఓటు బ్యాంకు రాజకీయాలే అనుసరించిందని దండోరా వేసిన మోదీ తాము 80-20 సూత్రాన్ని ఎందుకు అనుసరిస్తున్నారో చెప్పరు. 55 ఏళ్ల పాటు కొనసాగిన హయాంలో అంతా మంచే అని ఎవరూ చెప్పడం లేదు. కానీ నెహ్రూ హయాంలోనే అనేక వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య సౌధానికి గట్టి పునాది వేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ కుళ్లబొడిచింది. మోదీ హయాంలో ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ కూడా ఏర్పడలేదు. వాజ్‌పేయి ఏలుబడిలో అయితే ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడులని ఉపసంహరించడానికి ఏకంగా ఒక మంత్రిత్వ శాఖే ఏర్పాటు అయిన వాస్తవం ప్రభుత్వ రంగం పేరెత్తితేనే ఒంటి నిండా తేళ్లు, జెర్రులు పాకే మోదీకి ఎలా అర్థం అవుతుంది! యు.పి.ఎ. ఏలుబడిలో జాతీయ సలహా సమితిని ఏర్పాటు చేసి దానికి సోనియాగాంధీని అధ్యక్షురాలిని చేయడం తప్పో ఒప్పో చర్చించవచ్చు కానీ మోదీ హయాంలో సకల మంత్రిత్వ శాఖలను ప్రధాన మంత్రి కార్యాలయమే నడుపుతుంది. మోదీ మంత్రివర్గంలో జనం గుర్తు పట్టగలిగే మంత్రులు ఎంతమంది? రాజ్యాంగ నిర్మాణంలో ఎంతమంది సంఘ్ పరివార్ నాయకుల పాత్ర ఉంది గనక! రెండు రోజులు రాజ్యాంగంపై చర్చ జరిగితే ప్రధానమంత్రి మొదటి రోజు పార్లమెంటులో కనిపించనే లేదు. ఇది పార్లమెంటు మీద ఆయనకు ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనం. రాజ్యాంగాన్ని కళ్లకు అద్దుకోవడం, నుదుటికి ఆనించుకోవడం ప్రతీకాత్మక చర్య కావొచ్చు. కానీ ఆచరణలో ఎమర్జెన్సీ విధించకుండానే అంతకన్నా ఘోరమైన పనులు చేయడం మోదీ సర్కారుకే చెల్లింది. అబద్ధాలు చెప్పడంలో మోదీ ఆరితేరి పోయారు. ఆయన ఇచ్చిన సమాధానంలో అనేక అసత్యాలు ఉన్నాయి. ఆయన అనుచరులు కిరణ్ రిజిజు, గిరి రాజ్ సింగ్, అనురాగ్ ఠాకుర్ ప్రసంగాల చుట్టూ అసత్యాల దడి మాత్రమే కనిపించింది. దబాయింపు చాకచక్యం మోదీ ఏలుబడిలో రాజ్యాంగం ఉల్లంఘన విస్తృతిని పరిమితం చేయలేదు.

బ్రిక్స్ దేశాలకు ట్రంప్ బెదిరింపు

డాక్టర్ నిలంజన్ బనిక్

డాలర్‌ను వదిలేసి బ్రిక్స్ దేశాలు నూతన కరెన్సీని తయారు చేసుకున్నట్లయితే ఆ దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై 100శాతం సుంకాలు విధిస్తామని ఈ సంవత్సరం నవంబరు 30వ తేదీన త్వరలో అమెరికా అధ్యక్ష పదవిని స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ బెదిరించారు. ఇలా బెదిరించడం ఆయనకు కొత్తేమీ కాదు. ఇతర అంశాలలోనూ ఇలాంటి బెదిరింపులు చేస్తూనే ఉన్నారు. అమెరికాకు దగ్గరగా ఉన్న మెక్సికో, చైనా తదితర దేశాలకు కూడా అధిక సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. జాతీయ రిటైల్ ఫెడరేషన్ అధ్యయనం ప్రకారం, ట్రంప్ బొమ్మలు, ఫర్నిచర్, పాదరక్షలు, వివిధరకాల ట్రావెలింగ్ వస్తువులమీద కూడా అదనపు సుంకాలు విధిస్తామని ప్రతిపాదించాడు. అదనంగా ఇలాంటి వస్తువులను ఏడాదికి 46 బిలియన్ డాలర్లనుంచి 78 బిలియన్ డాలర్ల వరకు వినిమయ దార్లు కొనుగోలుచేసే వీటిని దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు.

దిగుమతి చేసుకునే చైనా వస్తువులపైన అధిక సుంకాలను విధిస్తే అమెరికా వినియోగదారులు కొనుగోలు చేయడం కష్టమవుతుందని ట్రంప్ అన్నారు. దీని మూలంగా చైనా నష్టపోయే అవకాశం ఉందన్నారు. అలాగే ఇండియా టారిఫ్ కింగ్ అని ట్రంప్ మాట్లాడారు. ఇండియాను జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్స్ (జీఎస్పీ) నుంచి తొలగిస్తామని కూడా ట్రంప్ అన్నారు. తాను గతంలో అధ్యక్షుడిగా పనిచేసినప్పుడు కూడా ఈ చర్య తీసుకున్నామన్నారు. 1974వాణిజ్య చట్టం ప్రకారం, అమెరికా విధానకర్తలు ప్రయోజనంపొందే దేశాలు ముఖ్యంగా తక్కువ ఆదాయం గల దేశాల నుంచి 3500 ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ దేశాల నుంచి సుంకం లేకుండానే దిగుమతి చేసుకుంటున్నామని ట్రంప్ అన్నారు. ఈ దేశాలు చేసే వాణిజ్యాన్ని పెంపొందించేందుకు తమ దేశానికి వారి వస్తువులను దిగుమతి చేసుకుంటున్నామన్నారు.

ప్రపంచబ్యాంకు ప్రకారం, 'తక్కువ ఆదాయం గల' దేశం 2023లో తలసరి ఆదాయం 1,045 దాలర్లు పొందినట్లు తెలిపింది. ఇండియా తలసరి ఆదాయం రూ.2700 ఏడాదికి ఉన్నట్లు ప్రపంచబ్యాంకు వెల్లడించింది. ఈ విషయంలో ప్రపంచబ్యాంకు ట్రంప్‌కు మద్దతు తెలియచేస్తున్నది. సాంకేతికంగా ట్రంప్ మాట్లాడింది సరైందేనని ప్రపంచబ్యాంకు అంటోంది. ఇండియా పరిశ్రమలు ఎక్కువకాలం జీఎస్పీ కింద ప్రాధాన్యతను ఇవ్వడం వీలుకాదని తెలిపారు. ఇండియా నుంచి అత్యధికంగా ఎగుమతులు చేసుకునే దేశం అమెరికాయే. టారిఫ్‌లు పెంచినట్లయితే ఆ దేశం వాణిజ్యపరంగా ఇబ్బందులు పడుతుంది. 2022లో ఇండియా 78 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను, 2023లో 77 బిలియన్‌డాలర్ల విలువైన వస్తువులను అమెరికాకు ఎగుమతి చేసింది. జీఎస్‌టి పరిధిలో వస్త్రాలు, గడియారాలు, పాదరక్షలు పనిచేసేటప్పుడు వినియోగించే గ్లోవ్స్ ఆటోమోటివ్ పరికరాలు తదితరాలు అమెరికా దిగుమతి చేసుకుంటున్నది. ఇవేకాకుండా 19శాతం డైమండ్స్, 14శాతం ప్యాక్‌చేసిన ఔషధాలు, శుద్ధిచేసిన పెట్రోలియం ఉత్పత్తులు 8.9శాతం, ఇండియా నుంచి అమెరికాకు ఎగుమతి జరుగుతున్నది. వీటిలోనూ ప్రధానమైన కేటగిరీ వస్తువులు, జౌళి, సరుకులు, ఆటోమోటివ్ పరికరాలు జీఎస్‌టీ జాబితాలోఉన్నాయి. ఇవి కాకుండా అదనపు ఎగుమతులు ఆర్గానిక్ కెమికల్స్, స్టీలు, కొన్ని ఇంజినీరింగ్ వస్తువులు అంటే న్యూక్లియర్ బాయిలర్స్, యంత్రపరికరాలు తదితరాలు ఉన్నాయి.

భారత్ నుంచి ఎగుమతిచేసే వస్తువులు ఆదాయం తక్కువగా ఉండేవి ఉంటాయి. ప్రపంచ మార్కెట్‌లో ఈ వస్తువులకు డిమాండ్ తక్కువగా ఉంటోంది. భారత్ ఆర్థిక శక్తి బలం పుంజుకుంటున్న నేపథ్యంలో ఇంధనం, శిలాజ ఇంధనాలు తదితరాలు ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. చమురు, తదితర దిగుమతులను శుద్ధిచేసి తిరిగి విక్రయించడం వలన మెరుగైన ఆదాయాలు లభిస్తున్నాయి. బంగారం దిగుమతులు, కస్టమ్స్ సుంకాలు 7.5శాతం నుంచి 12.5శాతానికి పెరిగాయి. ఇదే సమయంలో ఉత్పత్తి విలువ ద్వారా జీడీపీకి కలిసేది 17శాతం నిలకడగా ఉంది. ఉత్పత్తిలో పోటీ పెద్దగా ఉండటంలేదు.

ట్రంప్ బొమ్మలు, ఫర్నిచర్, పాదరక్షలు, వివిధరకాల ట్రావెలింగ్ వస్తువులమీద కూడా అదనపు సుంకాలు విధిస్తామని ప్రతిపాదించాడు. అదనంగా ఇలాంటి వస్తువులను ఏడాదికి 46 బిలియన్ డాలర్లనుంచి 78 బిలియన్ డాలర్ల వరకు వినిమయ దార్లు కొనుగోలుచేసే వీటిని దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు.

2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి అర్థభాగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 06శాతం తగ్గాయి. ఈ పరిస్థితి 2005-06 నుంచి అప్పుడప్పుడు తరుగుతూనేఉంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల తయారీరంగాలు ఆటోమొబైల్స్ కార్బొనేటెడ్ సాఫ్ట్ డ్రింక్స్. ఈ రెండు పరిశ్రమలు అత్యధికంగా ఉత్పత్తిచేసే వస్తువులపైన జీఎస్‌టీ 28శాతం ఉండగా, అదనంగా వేసే టారిఫ్‌లతో మొత్తం 40శాతం సుంకాలు ఉంటాయి.

పరోక్ష పన్ను స్థాయి పెరిగితే, ఎగుమతి పోటీ తగ్గుతుంది. అదే సమయంలో ప్రపంచమార్కెట్‌లో 8శాతం ధర పెరుగుతుంది. జౌళి ఉత్పత్తిదారులకు గణనీయంగాయ పెట్టుబడులు అవసర మవుతాయి. ప్రత్యేకించి విలువజోడింపు సర్వీసులు అంటే మార్కెటింగ్ గిడ్డంగులకిచ్చే అద్దెలు, లాజిస్టిక్స్, కొరియర్ సర్వీసులు ఇతర వ్యయాలు పెట్టుబడులలోనే కలుస్తాయి. ఈ అదనపు సర్వీసులన్నిటిపైన అదనంగా జీఎస్‌టి రేటు 18శాతం ఉంటుంది. ట్రంప్ గతంలో పాలించినకాలంలో ఒక పెద్ద ఆయుధాల డీలర్ స్థితిలో పనిచేశారు. అత్యధిక ఆయుధాలను ఆయన విక్రయించారు. 2008లో అమెరికా నుంచి ఇండియా 20 బిలియన్ డాలర్ల విలువైన రక్షణశాఖకు సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసింది. ట్రంప్ ఈసారి అధికారంలో ఉన్న కాలంలో ఇండియా ఇదేవిధంగా కొనుగోలుచేసే అవకాశంఉంది. అందువల్ల టారిఫ్‌ల విషయంలో మార్పు ఉండవచ్చు.

నిజమైన స్వప్నం..!

ఫిజిక్స్ అరుణ్ కుమార్

వన్డే క్రికెట్‌లో భారత్ విశ్వవిజేతగా నిలిచినప్పుడు కపిల్ దేవ్ ఆ టైటిల్ తీసుకుంటున్న సందర్భాన్ని టీవీలో చూస్తూ తాను కూడా ఇలాంటి టైటిల్‌తో మన దేశాన్ని విశ్వ విజేతగా చూడాలనుకున్నాడు ఓ కుర్రాడు. 24 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం చేశాడు ఆ స్వప్నం సాకారం కావడానికి. సచిన్‌గా సాధించి భారతరత్నగా స్ఫూర్తినిస్తున్నారు. తరం మారింది. ఆట మారిందంతే..! అలాంటి కలే. దశాబ్దం పైగా ప్రయాణం..! ఆపుకోలేని కన్నీటి సాక్షిగా ప్రపంచం చూస్తుండగానే చదరంగంలో భారత్ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. గుకేశ్ మేధస్సుకు విశ్వ కిరీటం తలొంచింది. నేడు ప్రతిభారతీయుడి గుండె 'మేరా భారత్ మహాన్' అంటూ ప్రతిధ్వనిస్తున్న ఈవేళ గుకేశ్ విజయాన్ని అభినందిస్తూ...మాస్టర్ బ్లాస్టర్ సచిన్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా చేసిన ఈ కామెంట్‌కు నెటిజన్లు ఆసక్తిగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు మూలాలున్న కుటుంబానికి చెందిన గుకేశ్ ప్రతిభను చిన్నప్పుడే గుర్తించిన తల్లిదండ్రులు నేటి విజయంకోసం తమ జీవితాలనే త్యాగం చేశారు. ఈఎన్‌టీ సర్జన్ అయిన తండ్రి విలువైన తన కెరీర్‌నే పక్కన పెట్టి తన కొడుకు ప్రయాణంలో పాలుపంచుకున్నారు. మైక్రో బయాలజిస్టు అయిన తల్లి సంపాదనతోనే కుటుంబం నెట్టుకొచ్చేవారు.

కొన్ని సందర్భాల్లో టోర్నీలకు వెళ్లడానికి నిధుల సేకరణ కూడా చేసేవారు. చాలా కష్టపడి విశ్వనాథన్ ఆనంద్ మార్గదర్శనం తన కొడుకుకు దొరికేలా చేశారు. ఇక అప్పటి నుంచీ ఆనంద్ పర్యవేక్షణలో గుకేశ్ తనదైన శైలిలో నేటి తరపు కుర్రాడిలా చెస్ ఆటలో ప్రత్యర్థులకు చెమటలు పట్టించే విధంగా దూసుకుపోతున్నారు.

14 రౌండ్స్ వున్న ఫైనల్ మ్యాచ్‌లో తొలి రౌండ్‌లోనే ఓటమి చెంది కాస్త భావోద్వేగానికి గురైనా..... వెంటనే కోలుకున్నాడు. 13వ రౌండ్ ముగిసిన సమయానికి 6.5-6.5తో సమంగా నిలిచినప్పటికీ చివరి రౌండ్ నల్ల పావులతో ఆడినప్పటికీ తన ప్రత్యర్థి డింగ్ లిరెన్ అనుభవాన్ని సైతం అధిగమించి చిరస్మరణీయమైన విజయాన్ని మనకు అందించాడు. నలుపు-తెలుపు గడీల మధ్య చురుకుగా కదులుతూ కాసేపు కళ్లు మూస్తూ, తెరుస్తూ ఆట ప్రారంభంలోనే దూకుడుగా పావులను కదుపుతూ తన వ్యూహాలతో ప్రత్యర్థి ఆటగాళ్లకు అందకుండా వెళ్లడం గుకేశ్ ఆటలోని ప్రత్యేకత అంటూ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కేవలం 18 ఏళ్ల వయస్సులో చదరంగంలాంటి ఆటలో ప్రపంచ చాంపియన్‌గా ఎదిగిన గుకేశ్, ఆ గెలుపులో కీలకపాత్ర పోషించిన వారి తల్లిదండ్రుల నుంచి నేటి యువతరం, తల్లిదండ్రులు చాలా నేర్చుకోవచ్చు. తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను పిల్లలపై గుడ్డిగా ఒత్తిడితో రుద్దకుండా, ర్యాంకులు, మార్కుల పేరుతో ఇబ్బంది పెట్టకుండా పిల్లల ప్రతిభ, శ్రద్ధాసక్తులు ఆధారంగా ప్రోత్సాహం అందించాలి. పిల్లల కలల్ని అందమైన లక్ష్యాలుగా తీర్చిదిద్దాలి. నేటి యువతరం కూడా వయస్సు కేవలం ఒక నంబర్ అని గమనించాలి. చరిత్ర గమనిస్తే అనామకులు కుడా తమ అలుపెరగని ప్రయత్నాల పరంపర కొనసాగిస్తూ, అహర్నిశల శ్రమతో ముందుకెళ్తూ అనుభవజ్ఞులైన హేమాహేమీలపై సైతం అసాధారణ విజయాలు సాధించారు. నవతరానికి స్ఫూర్తిప్రదాతలుగా మిగిలారు. నువ్వే ఓ అద్భుతం అన్న వివేకానంద సూక్తిని మనమంతా మన గుండె శబ్దంగా మార్చుకుంటే మనలోని కోహ్లి, శ్రీనివాస రామానుజన్, విక్రమ్ సారాభాయ్, ద్రౌపది ముర్ము, రాజమౌళి, రజనీకాంత్ వంటి వారు మన రూపంలో కొత్త తరానికి మార్గదర్శకులుగా బయటికొస్తారు.

నీ కలలన్నీ నిజమవుతాయి..!

కానీ దానికి ముందు నువ్వు ఎన్నో సవాళ్లను స్వీకరించాలని అంటారు అబ్దుల్ కలాం. 2013 చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో కార్ల్ సన్, ఆనంద్ ఆటను చూసి కలలుగన్న ఓ పిల్లాడు దశాబ్దం తర్వాత ఆనంద్, కార్ల్‌సన్ తన ఆటను చూసేలా, మెచ్చుకునేలా ఎదగడమంటే ఓ అద్భుతమనే చెప్పొచ్చు. అసాధారణ విజయాలన్నీ ప్రపంచం చూడాలంటే అమావాస్య చీకటిలోనే కొత్త దారులు అన్వేషించాలి. అప్పుడే ఆ విజయాలు వెలుగు శబ్దాలై భవిష్యత్తు తరాలకు ప్రేరణ ఇస్తాయి. గుకేశ్ ఇంకా ఎన్నో గెలుపు మలుపులతో మన దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరుకుంటూ, వారి తల్లిదండ్రులకు సెల్యూట్ చేస్తూ....

సెల్: 9394749536

నిజం బతికే రోజులు రావాలి!!

డాక్టర్ దేవరాజు మహారాజు

అబద్ధం- దర్జాగా బతికి ఏదో ఒకరోజు ఛస్తుంది. నిజం-రోజూ ఛస్తూ, ఏదో ఒకరోజు బతికి భవిష్యత్తులో చరిత్రగా మారుతుంది. అటు తర్వాత అది, అనునిత్యం బతుకుతుంది! శాస్త్రీయ దృక్కోణంలేని సాహితీవేత్తలు, కళాకారులవల్ల సమాజానికి జరిగే మేలు కన్నా కీడే ఎక్కువ! ఒకప్పటి పురాణ రచయితలవల్ల ఆధునిక సమాజం కూడా ఎలా అతలాకుతలం అవుతుందో గమనించండి. ఎనిమిదివేల ఎనిమిది వందల శ్లోకాలతో వ్యాసుడు రాసిన 'జయం' అనే ఒక కట్టుకథను వైశంపాయనుడు ఇరవైనాలుగు శ్లోకాలకు పెంచాడు. దానికి 'భారతం' అని పేరు పెట్టాడు. కొంతకాలానికి దానికి మరో డెబ్బయి ఆరువేల శ్లోకాలు జోడించి, ఆ గ్రంథాన్ని లక్ష శ్లోకాలకు విస్తరించాడు. అప్పుడు దాన్ని 'మహాభారతం' అని అన్నాడు. ఆ తర్వాత ఆ కథలో అనేక ప్రక్షిప్తాలు చేరిపొయ్యాయి. అందుకే మనం అర్థం చేసుకోవాల్సిందేమంటే 'మహాభారతం' చారిత్రక గ్రంథం కాదు- కాలేదు- పైగా, పురాణాల ద్వారా హిందూ ధర్మం మనకు ఇచ్చిన వరాలు కొన్ని ఉన్నాయి. అవి బాల్య వివాహాలు, సతీ సహగమనం, వైధవ్యం, జోగినీ వ్యవస్థ, వరకట్నం వగైరా. ఇవి స్త్రీలను అణిచిపెట్టడానికి ఎంతగా ఉపకరించాయో అందరికీ తెలుసు.

ఇక కుల వ్యవస్థ, అంటరానితనం, బలులు, కన్యాశుల్కం ఇతర మూఢ నమ్మకాలు ఎన్నో- ఎన్నెన్నో. ఇవన్నీ గొప్పతనాలా? సంస్కృతీ సంప్రదాయాల పేరిట కొనసాగించిన వరాలా? శాపాలా? లేక మూఢనమ్మకాలా? ఇంగిత జ్ఞానంతో ఎవరికి వారే ఆలోచించుకోవాలి! మారుతున్న కాలానికి జరుగుతున్న వైజ్ఞానిక ప్రగతిని గమనించకుండా పురాణాలకు అనుగుణంగా ఆధునిక సమాజం ఉండాలనుకోవడం బుద్ధి తక్కువ. ఆధునికంగా జీవిస్తూ వేల ఏళ్ల నాటి విలువల్ని ప్రతిష్టించుకోవాల్సిన అవసరాన్ని కొందరు 'చదువుకున్న నిరక్షరాస్యులు' నొక్కి చెపుతుంటారు. ప్రజలు అలాంటి వారి నోళ్లు మూయించాలి! 'చదువుకున్న అవివేకులు' తమ ఇళ్లలో పెండ్లిళ్లు జరిగితే, సీతారాముల పెళ్లిలోని తలంబ్రాల ఘట్టం పెండ్లి పత్రికలో ముద్రించుకుంటారు. కొత్త జంటను సీతారాముల్లా వర్ధిల్లమని దీవిస్తుంటారు. బాజా భజంత్రీ వాళ్లను సీతారాముల కళ్యాణం పాటలు వాయించమంటారు. ప్రేమకు, అన్యోన్యతకు ప్రతినిధులై సీతారాముల జంట ఉన్నట్టు- రామాయణంలోనే లేదు. 'అమ్మో! సీత కష్టాలు' అనే పదం ఈనాటికీ వాడుకలో ఉంది. రాముడు సీతను అనుమానించి అగ్నిపరీక్ష కోరాడు. చివరకు అడవులపాలు చేసిన మహానుభావుడు! అతను ఎలా ఆదర్శమో ఆలోచించుకోవాలి! కొత్త జంటల్ని సీతారాముల్లా ఉండమని అభినందించడం, ఆశీర్వదించడం ఏమైనా తెలివిగల పనేనా?

వేదాలు, పురాణాలు, ఎంత సంస్కార హీనంగా రాశారన్నది- వేమన కాలంలోనే కాదు, ఆయన తర్వాత కూడా హేతువాద రచయితలే ఎత్తి చూపుతూనే ఉన్నారు. దేవుడి పేరుతో, భక్తి పేరుతో గుడ్డిగా విశ్వసించేవారు- వారి విశ్వాసాల్లో వారు ఉండొచ్చు. కానీ, విశ్వాసాల్లో లేనివారిని, హేతుబద్ధంగా విశ్లేషించుకుని దృఢమనస్కులై ఉన్నవారిని బూతులు తిడితే తాము సంస్కార హీనులమని తమకు తామే ఢంకా బజాయించుకున్నట్టుకాదా? మత బోధకులు ఏం చేశారూ? సహాయపడిన వారికి కృతజ్ఞతలు చెప్పడం కూడా నేర్పించలేదు. పైగా, మనుషుల్ని అవమానపరిచే పదం నేర్పారు. "దేవుడి దయ వల్ల" అని అనమన్నారు. కృతజ్ఞతా భావం ఉంటే అది సహాయపడిన వారికి నేరుగా వ్యక్తం చేయాలి కదా? 'దేవుడి దయ'- అనే పదం మనుషులైన వారిని అవమానపరిచేది. మనువాదులు- మతవాదులు అంతే కదా? వారు మనుషుల్ని మనుషులుగా ఎప్పుడు గుర్తించారు గనక? అయినా సహాయపడ్డవారికీ, సహాయం తీసుకున్న వారికీ మధ్య దేవుణ్ణి ఎందుకు జొప్పించారో- దాని వెనక జరిగిన కుట్ర ఏమిటో అర్థం చేసుకుంటే మంచిది. అబద్ధాన్ని నిలబెట్టాలనుకునే వారికి- నిజాల్ని ప్రకటించే వారికి పొసగదు. తటస్థంగా ఉండే వారంతా ఆలోచించుకోవాలి. దేన్ని ఎంచుకోవాలో నిర్ణయించుకోవాలి. అబద్ధం వైపు, భ్రమల వైపు ఉన్నవారు కూడా ఆత్మ విమర్శ చేసుకుంటే మంచిది. అబద్ధపు పవిత్ర గ్రంథాల ప్రభావం సమకాలీన సమాజంపై ఎలా పడుతూ ఉందో రోజూ వార్తలో చూస్తూనే ఉన్నాం.

అక్రమ సంబంధాలతో రాసిన మత గ్రంథాల్ని అర్ధనిమీలిత నేత్రాలతో విని పరవశించి పోయేవారే ఆలోచించాలి. అర్థరహితమైన వ్యాఖ్యలు చేయడంలో మత గురువులు ఎప్పుడూ ముందుంటారు. "బహిష్టు సమయంలో వంటచేసే మహిళ మరుజన్మలో వావి వరుసలు లేని వ్యభిచారిగా పుడుతుంది"- అని అన్నాడు స్వామి కృష్ణ స్వరూప్‌దాస్. జీవశాస్త్రపరంగా బహిష్టు అంటే ఏమిటో అతను తెలుసుకోలేదు. మరుజన్మ గురించి అవగాహన లేదు. వ్యభిచారాన్ని ఎవరు పెంచి పోషించారో అవగాహన లేదు. పైగా ఎవరూ వ్యభిచారులుగా



పుట్టరు. యుక్త వయసుకు వచ్చాక ఆ వృత్తిలోకి నెట్టివేస్తారు. కనీసమైన ఇంగిత జ్ఞానం లేకుండా నోరుంది కదా- వినే 'బకరా'లున్నారు కదా అని ఏదో ఒకటి వాగడం ఎంత వరకు సబబూ. "ఓరేయ్! నీ తల్లి బహిష్టు సమయంలో కూడా చిన్నప్పుడు నీకు పాలిచ్చిందిరా మనువాదీ!"- అని చెప్పాల్సిన వాళ్లు చెప్పాలి కదా? లేకపోతే అతను తన అజ్ఞానాన్నే గొప్ప జ్ఞానంగా భావిస్తూ ఉంటాడు.

ఇలాంటి విషయం ఏదైనా చెప్పగానే "యేం? మీకు హిందూమతంలోని తప్పులే కనిపిస్తున్నాయా? ఇతర మతాల్ని, ఆ మత గ్రంథాల్ని, ఆ మత బోధకుల్ని విమర్శించరా? ఆ ధైర్యం మీకు లేదా?"- అని తమ స్థాయిని తామే తగ్గించుకుని కొందరు మాట్లాడుతుంటారు. నిజానికి మానవ వాదులెవ్వరూ ఏ మతాన్నీ వెనకేసుకు రారు. మతం- అని అంటే, అది అన్ని మతాల గురించి చెప్పిన మాట! మత విశ్వాసకులు అంటే అది అన్ని మతాల విశ్వాసకులు అని అర్థం. ప్రతిసారీ ఒక్కొక్క మతాన్ని ఉటంకిస్తూ చెప్పడం కుదరదు. అల్లాను ప్రసన్నం చేసుకోవడం కోసం, ఆయన ప్రేమకు పాత్రురాలు కావడం కోసం, కేరళ పాలక్కడ్ జిల్లాలో గర్భవతి అయిన ముప్పయ్యేళ్ల తల్లి, తన ఆరేళ్ల కొడుకు గొంతుకోసి చంపేసింది. పాలకులే కాదు, మత విశ్వాసాలున్న ప్రజలు కూడా ఈ దేశాన్ని త్వరితగతిన పాలరాతియుగంలోకి తీసుకుపోవడానికి నిరంతరం కృషి చేస్తున్నారు. అందుకే, సమాజంలో హేతువాదాన్ని మానవవాదాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది!

మత విశ్వాసాలతో పరిపాలన సాగించిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ఎంత ఘోరంగా విఫలమైందో ప్రత్యక్షంగా చూశాం. కోవిడ్ ఉధృతిలో జనం శవాల గుట్టలుగా పేరుకుపోతూ ఉంటే - నాటి దేశ నాయకుడు మాత్రం ఎన్నికల ర్యాలీలు నిర్వహిస్తూనే వచ్చాడు. కుంభమేళాకు అనుమతి ఇచ్చి ముప్పయి లక్షల మందిని గంగానదిలో నగ్నంగా జలకాలాడించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ వేషంతో బెంగాల్ వెళ్లాడు. బెంగాలీల మెప్పు కోసం బంగ్లా స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకెళ్లానని అబద్ధం చెప్పాడు. కేరళ వెళ్లి బైబిల్ సూక్తులు వల్లించాడని అన్ని చోట్లా అన్ని వేళలా మూర్తీభవించిన మత విశ్వాసకుడిలా రంగులు మార్చాడు. ఇక, మరోవైపు సామాన్యుల్లో వైజ్ఞానిక స్పృహ, నిజాయితీ, నిబద్ధత పెంచడం ఎలాగని కొంతమంది రచయితలు, మేధావులు, సైన్సు సంస్థల కార్యకర్తలూ 'తపన' పడుతూనే ఉన్నారు. "కొందరికి దేవునిపై నమ్మకం ఉంటే ఉండొచ్చు. కానీ, దాని ఆధారంగా ఇతరులపై మతాన్ని రుద్దే హక్కు ఎవరికీ ఉండదు"- అని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధురాలైన నర్స్- ఫ్లోరెన్స్ నైటింగేల్!

"నా మానవత్వానికి మతం లేదు. నీ మతానికి మానవత్వం లేదు. అందుకే నీ మతం నాకు సమ్మతం కాదు"- అని మానవవాదులు గట్టిగా చెపుతున్నారు. ఇందులోని నిజానిజాలు అందరూ సీరియస్‌గా ఆలోచించాలి. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో దమ్‌తరి జిల్లాలో సంతానంలేని మహిళలు బోర్లా పడుకుంటే పూజారులు మంత్రగాళ్లమని చెప్పుకుతిరిగే కొందరు పురుషులు వారి వీపుపై నుంచి తొక్కుతూ వెళతారు. సాంకేతికత పెరుగుతోంది. కాని, జనంలో మూఢ నమ్మకాలు తగ్గడంలేదు. మనుధర్మశాస్త్ర రీత్యా స్త్రీలు కూడా శూద్రులే- అయితే స్త్రీ గర్భం నుంచి పుట్టిన అగ్రవర్ణం వారంతా శూద్రులు కాకుండా ఎలా ఉంటారూ? ఎవరూ సూటిగా సమాధానం చెప్పరు. నిచ్చెన మెట్ల సంస్కృతికి కాలం చెల్లింది. "తెలివితక్కువతనం ఈజ్ ఈక్వల్‌టు- భగవంతుడు"- అనే ఫార్ములా ఇచ్చాడు రాహుల్ సాంకృత్యాయన్! అదెలాగంటే- "నీ తెలివితక్కువ తనాన్ని ఒప్పుకోవడానికి సిగ్గుపడి- భగవంతుడు"- అనే గౌరవనీయమైన పేరు పెట్టుకున్నావ్! అంటే తెలివితక్కువతనం- భగవంతుడితో సమానం అయినట్టే కదా?"- అన్నది రాహుల్ సాంకృత్యాయన్ ఉద్దేశం.

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

వయనాడ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి

పార్లమెంట్ వద్ద కేరళ ప్రతిపక్ష ఎంపీల నిరసన

న్యూఢిల్లీ: వయనాడ్‌కు సహాయ ప్యాకేజీ ఇవ్వాలంటూ కేరళకు చెందిన ప్రతిపక్ష ఎంపీలు శనివారం పార్లమెంట్ వద్ద నిరసన తెలిపారు. ప్రకృతి విలయంలో కొండచరియలు విరిగిపడి భారీగా నష్టపోయిన వయనాడ్‌కు సహాయం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాతో సహా ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటులోని మకర్ ద్వార్ వద్ద నిరసన చేపట్టారు. 'జస్టిస్ ఫర్ వయనాడ్. వయనాడ్‌కు రిలీఫ్ ప్యాకేజీ అందించండి' అన్న బ్యానర్‌ను ప్రదర్శించారు. 'వయనాడ్‌కు న్యాయం చేయండి. వివక్ష చూపవద్దు' అని నినాదాలు చేశారు. ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ... వయనాడ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తున్నదని ఆరోపించారు. వయనాడ్‌తోపాటు హిమాచల్ ప్రదేశ్ బాధితులను రాజకీయాల కారణంగా కేంద్రం ఆదుకోవడం లేదని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో వివక్ష చూపకూడదని అన్నారు. ఇటీవల ప్రియాంక గాంధీ... కేరళ ప్రతిపక్ష ఎంపీలతో కలిసి కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. తక్షణ సహాయం అందించాలని కోరారు.

ఈవీఎం గుడికట్టండి

మహాయుతి ప్రభుత్వ తీరుపై సంజయ్ రౌత్ ఎద్దేవా



ముంబై: మహారాష్ట్రలో నూతనంగా ఏర్పాటైన బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ప్రభుత్వంపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ మండిపడ్డారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) ఆలయం నిర్మించడంపై తొలి కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోవాలని ఎద్దేవా చేశారు. మీడియాతో శనివారం ఆయన మాట్లాడుతూ... 'తొలుత సీఎం నేతృత్వంలో నాగ్‌పూర్‌లో ఈవీఎంలతో ఊరేగింపు నిర్వహించాలి. అక్కడి ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం ముందు ఈవీఎంల ఆలయాన్ని నిర్మించే నిర్ణయం కూడా తొలి కేబినెట్ సమావేశంలో సీఎం తీసుకోవాలని భావిస్తున్నా' అని అన్నారు. కొత్తగా ఏర్పాటైన మహాయుతి ప్రభుత్వం క్యాబినెట్ బాధ్యతలపై ఇంకా నిర్ణయం తీసుకోలేక పోయిందని సంజయ్ రౌత్ విమర్శించారు. మహారాష్ట్రలో హత్యలు, అత్యాచారాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. 'రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తున్నా ఎవరికి ఏ శాఖ ఉందో తెలియడం లేదు. మహారాష్ట్ర గ్రామాల్లో ప్రతిరోజూ హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయి. దీనికి సీఎం సమాధానం చెప్పలేకపోతున్నారు. మహారాష్ట్రలో అరాచకాలు విస్తరించాయి. ఈ ప్రభుత్వం ఈవీఎంలతో ఏర్పడింది. వారికి మెదడు లేదు. వారి మెదళ్లలో ఈవీఎంలు ఉన్నాయి' అని సంజయ్ రౌత్ విమర్శించారు.

కేంద్ర మాజీమంత్రి ఇళంగోవన్ మృతి

చెన్నై: కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఈవీకేఎస్ ఇళంగోవన్ (73) శనివారం మృతి చెందారు. స్వల్ప అనారోగ్యం కారణంగా ఆయన గత కొన్ని రోజుల నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎంఐఓటీ ఆసుపత్రిలో శుక్రవారం చేరారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయన... నెల రోజులుగా చికిత్స పొందుతున్నారు. 2023 ఫిబ్రవరిలో జరిగిన ఉప ఎన్నికల్లో... ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గం నుంచి ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు తిరుమగన్ ఇవెర మృతిచెందిన నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ద్రావిడ ఉద్యమ నేత పెరియార్ ఈవీ రామస్వామి సోదరుడి మనవడే ఇళంగోవన్. చిన్న వయసులోనే ఇళంగోవన్ రాజకీయ ప్రవేశం చేశారు. 1984లో ఆయన తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2004లో ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో ఆయన కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రిగా చేశారు. కాంగ్రెస్ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు రూ.4,025 కోట్ల ఆస్తులు అప్పగింత

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆమోదం మేరకు భూషణ్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కు చెందిన రూ.4,025 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు అందజేసింది. దీనికి సంబంధించి ఫెడరల్ ప్రోబ్ ఏజెన్సీ తాజాగా వివరాలు వెల్లడించింది. ఎన్‌సీఎల్‌టీ ఆమోదం మేరకే జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కంపెనీలో మేజర్ వాటాలు కొనుగోలు చేసినట్లు గుర్తించడంతో ఆస్తులు అందజేస్తున్నట్లు పేర్కొంది. బ్యాంకు రుణ చెల్లింపుల్లో మోసం చేసినట్లు వచ్చిన ఆరోపణలపై 2019లో భూషణ్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌పై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆస్తులు జప్తు చేసింది. అంతకుముందు నెలలో ఆ రుణాలు చెల్లించలేక కంపెనీ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ)ను ఆశ్రయించింది. ఆ సమయంలో భూషణ్ పవర్ అండ్ స్టీల్ సమస్యకు సంబంధించి జేఎస్‌డబ్ల్యూ స్టీల్ పరిష్కార ప్రణాళికను ఎన్‌సీఎల్‌టీ ఆమోదించింది. తర్వాత ఈడీ ఆస్తులు జప్తు చేసింది. ఎన్‌సీఎల్‌టీ ఆమోదంతోనే కంపెనీలో వాటా చేజిక్కించుకునేందుకు బిడ్ వేసినట్లు సుప్రీంకోర్టులో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ స్పష్టం చేసింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఇటీవల ఆమోదం తెలిపింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌ను 1982లో సజ్జన్ జిందాల్ స్థాపించారు. జిందాల్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (జిస్కో), జిందాల్ విజయనగర్ స్టీల్ లిమిటెడ్ (జేవీఎస్ఎల్) కలిసి జిందాల్ స్టీల్‌గా ఏర్పడ్డాయి. ఈ కంపెనీ అమెరికాలో ఏటా 35.7 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీని అతిపెద్ద తయారీ యూనిట్ కర్నాటకలోని విజయనగరలో ఉంది.

బీజేపీ అగ్రనేత ఆడ్వాణీకి అస్వస్థత



న్యూఢిల్లీ: బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే ఆడ్వాణీ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం ఆయనను ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఆడ్వాణీ ఆరోగ్యం క్షీణించడంతో రెండు రోజుల క్రితమే ఆయన్ను ఆసుపత్రిలో చేర్పించినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. 97 ఏళ్ల వయసులో ఉన్న ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్నారు. ఈ ఏడాది ఆగస్టులో కూడా అపోలోలో చికిత్స తీసుకున్నారు. 1927 నవంబరు 8న అవిభక్త భారత్‌లోని కరాచీ (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది)లో జన్మించిన ఆడ్వాణీ... సుదీర్ఘకాలం బీజేపీలో పనిచేసి వివిధ హోదాల్లో సేవలందించారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆయనను దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'తో సత్కరించింది.

'కోరేగావ్ భీమా' వార్షికోత్సవానికి అనుమతి

ముంబై: చారిత్రక కోరేగావ్ భీమా యుద్ధానికి 207 ఏళ్లు అయిన సందర్భంగా పూనేలోని జయ్ స్తంభ్ వద్ద వార్షికోత్సవ ఏర్పాట్లకుగాను మహారాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు అనుమతి లభించింది. ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి నుంచి జనవరి 5వ తేదీ వరకు ఆ స్థలానికి వెళ్లేందుకు మహారాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ ఎస్ఎం మోదక్‌తో కూడిన ఏకసభ్య ధర్మాసనం అనుమతిచ్చింది. ఈనెల 31వ తేదీ అర్ధరాత్రి నుంచి జనవరి 5 వరకు జయ్ స్తంభ్‌ను ప్రజలు సందర్శించేందుకూ అంగీకరించింది. గతంలోనూ అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయంతో ఈ మేరకు అనుమతులు జారీ అయ్యేవి. జనవరి 5 తర్వాత ఆ స్థలంలో యథాతథ స్థితి ఉండాలని ప్రభుత్వానికి కోర్టు స్పష్టంచేసింది. 1818 కోరేగావ్ భీమా యుద్ధానికి స్మారకంగా జయ్ స్తంభ్ ఏర్పాటైంది. ఏటా లక్షల మంది అక్కడకు వెళ్లి నివాళులర్పిస్తారు. కాగా, 2025, జనవరి 1వ తేదీ నాటికి ఈ పోరు జరిగిన 207 ఏళ్లు అవుతాయి. పూనేలోని పెర్నే గ్రామంలోని 'జయ్ స్తంభ్' ఉన్న స్థలం వివాదంలో ఉంది. దీనిపై స్టేటస్ క్వొను కోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం కోర్టు అనుమతి తీసుకుంటుంది.

యువత బొటనవేలు నరికివేస్తోంది

మోదీ సర్కారుపై రాహుల్ విమర్శనాస్త్రాలు

న్యూఢిల్లీ: వివిధ రంగాలను పారిశ్రామికవేత్తలకు అప్పణంగా ఇచ్చేస్తుండటం వల్ల యువత బొటనవేలును కేంద్రం నరికివేస్తోందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. రాజ్యాంగానికి 75 ఏళ్లు అయిన సందర్భంగా లోక్‌సభలో శనివారం జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన కేంద్రంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్లమెంటులో తన మొదటి ప్రసంగాన్ని గుర్తుచేశారు. 'భారత్‌లో యుద్ధం జరుగుతోంది. ఓ వైపు (విపక్షం) రాజ్యాంగాన్ని సమర్థించే వారున్నారు. ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కొక్కరు ఇందులో ఉన్నారు. వారు ఎవరని మీరు అడిగితే తమిళనాడు నుంచి పెరియార్... కర్నాటక నుంచి బసవన్న.. మహారాష్ట్ర నుంచి పూలే, అంబేద్కర్... గుజరాత్ నంచి మహాత్మాగాంధీ ఇలా వరుసగా పేర్లు చెబుతాను. ఈ మహనీయులను పొగడాలంటే మీ మనస్సు ఒప్పుకోదు కానీ తప్పదంటూ ఆ పనిని మీరు చేస్తారు. వాస్తవానికి ప్రాచీనకాల పాలననే మీరు ఇప్పుడూ కావాలని అనుకుంటున్నారు' అని రాహుల్ గాంధీ అన్నారు. ఏకలవ్య, ద్రోణాచర్య కథ చెప్పారు. 'నా చిన్నతనంలో ఢిల్లీ చుట్టూ అడవులు ఉండేవి. ఎయిమ్స్ పక్కనే అడవి ఉండేది. అలాంటి ఒక అడవిలోనే వేలాది ఏళ్ల కిందట ఆరు-ఏడేళ్ల బాలుడు అభ్యాసం చేసేవాడు. సంవత్సరాల తపస్సు తర్వాత గురువు ద్రోణాచార్య అడిగినందుకు తన బొటనవేలు త్యాగం చేశాడు. అతనే 'ఏకలవ్య' అంటూ ఆ కథలో ఏమేమి జరిగిందో రాహుల్ చెప్పారు. అదే క్రమంలో 'అభయ ముద్ర'ను ప్రస్తావించారు. అది ఆత్మవిశ్వాసం, శక్తికి చిహ్నమన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో లేటరల్ ఎంట్రీ ద్వారా వెనుకబడిన వర్గాలు, పేదలు, యువత బొటనవేలును ప్రభుత్వం నరికివేస్తోందని రాహుల్ వ్యాఖ్యానించారు. పారిశ్రామికవేత్త అదానీకి ధారావిని కట్టబెడితే చిన్న, మధ్యస్థాయి వ్యాపారాల బొటనవేలు తెగుతుందన్నారు. సరసమైన మద్దతు ధరలు కోరుతున్న రైతులపై బాష్పవాయువు ప్రయోగించి వారి బొటనవేలు కోసేస్తున్నారని కేంద్రంపై రాహుల్ విమర్శలు గుప్పించారు. భారత పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రక్షణ పరిశ్రమ అదానీ వశమయ్యాయని, నిజాయతీగా పనిచేసే భారత్‌లోని వ్యాపారాల బొటనవేలు తెగుతోందని వ్యాఖ్యానించారు. అలాగే కుల గణన, రిజర్వేషన్లపై 50శాతం పరిమితి తొలగింపునకు రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు.

మీరు రాజ్యాంగాన్ని పరిరక్షిస్తారా... రాహుల్ ఎద్దేవా

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని బీజేపీ మాట్లాడటంపై రాహుల్ వ్యంగాస్త్రాలు సంధించారు. మనుస్మృతి కావాలంటే ఆర్‌ఎస్ఎస్ వ్యవస్థాపకుడు వీడీ సావర్కర్‌కు వ్యతిరేకంగా బీజేపీ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందా అని ఎద్దేవా చేశారు. వేదాల తర్వాత హిందువులకు ఎంతో పవిత్రమైన గ్రంథం మనుస్మృతి అన్న సావర్కర్ మాటలను రాహుల్ గుర్తుచేశారు. రాజ్యాంగంలో భారతీయత లేదని ఆయన అన్నారన్నారు.

రాజ్యాంగం ఆధునిక భారత్ కోసం రూపొందిన డాక్యుమెంట్ అని, చరిత్ర గురించి చెప్పకుండా దీనిని లిఖించలేరని చెప్పారు. 'మీరు రాజ్యాంగాన్ని సమర్థిస్తుండటం మంచిదే కానీ మీ నాయకుడి మాటలకు మీరు కట్టుబడి ఉన్నారా అని అడుగుతున్నా. ఎందుకంటే మీరు దేనిపై దాడి చేస్తున్నారో అదే రాజ్యాంగాన్ని పరిరక్షించడం గురించి మాట్లాడుతున్నారు... అంటే సావర్కర్‌ను ఎగతాళి చేస్తున్నారా' అని బీజేపీనుద్దేశించి రాహుల్ వ్యంగ్యంగా అన్నారు.

రాజ్యాంగ రూపకల్పనలో మీ పాత్రేమిటి?

కమల దళానికి డీఎంకే నేత రాజా ప్రశ్న

న్యూఢిల్లీ: రాజ్యాంగాన్ని రూపొందించడంలో మీరు పోషించిన పాత్ర ఏమిటి... ఆర్‌ఎస్ఎస్, హిందూ సభ ఏ మేరకు తోడ్పాటు అందించాయో చెప్పగలరా అంటూ కమల దళానికి డీఎంకే నేత ఎ.రాజా సవాల్ విసిరారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామంపై మాత్రమే దాడి జరిగింది కానీ మీ హయాంలో రాజ్యాంగ మూలాలన్నీ ధ్వంసమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేము ఎవరి పక్షాన ఉండి పోరాడుతున్నా మన్నది ముఖ్యం కాదు... ఎందుకోసం పోరాడుతున్నామన్నదే ప్రధానమని రాజ్యాంగ పరిరక్షణ కోసం విపక్షాల పోరునుద్దేశించి ఎ.రాజా వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ సమయంలో పీఠికలో 'సెక్యులర్', 'సోషలిస్ట్' పదాలు చేర్చి వుండకపోతే రాజ్యాంగాన్ని అధికార పక్షం మార్చివేసేదన్నారు. లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎమర్జెన్సీ సమయంలో అంతర్గత భద్రత నిర్వహణ చట్టం (ఎంఐఎస్ఏ) అమలు వల్ల ప్రజాస్వామ్యంపై దాడి జరిగింది కానీ మీ పాలనలో 'ప్రజాస్వామ్యం, లౌకికవాదం, న్యాయ పాలన, సమానత్వం, సామ్యవాదం, న్యాయపరమైన నిష్పాక్షికత' ధ్వంసమయ్యాయి' అని రాజా వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ సమయంలో డీఎంకే వ్యవస్థాపకుడు ఎం.కరుణానిధి అరెస్టును కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి గుర్తుచేయగా... కాంగ్రెస్‌తో మా పార్టీకి కొన్ని సమస్యలు ఉన్నా రాజ్యాంగ పరిరక్షణ కోసం కలిసి ఉన్నామని రాజా చెప్పారు. 'ఆ బాధ మాకు తెలుసు. మీ ఉద్బోధ అక్కర్లేదు. మాకు రాజ్యాంగం,. దేశం ప్రధానం. అందుకే కాంగ్రెస్‌తో కలిసి (విపక్షంలో) ఉన్నాం' అని ఆయనన్నారు. రాజా చేసిన కొన్ని వ్యాఖ్యలు సభలో దుమారం రేపాయి. ప్రహ్లాద్ జోషి, నిశికాంత్ దూబే (బీజేపీ) అభ్యంతరం చెప్పారు. బీజేపీ సభ్యురాలు జగదాంబికా పాల్ సభాపతి స్థానంలో ఉండి ఆ వ్యాఖ్యలు రికార్డుల్లో ఉండవన్నారు.

ప్రజలు వద్దన్నా ఏపీని కాంగ్రెస్ విభజించింది: టీడీపీ

రాష్ట్ర ప్రజలు వద్దన్నాగానీ కాంగ్రెస్ ఏకపక్షంగా ఆంధ్రప్రదేశ్‌ను విభజించిందని తెలుగు దేశం పార్టీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఆరోపించారు. రాష్ట్ర విభజన ప్రతిపాదనను ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తిరస్కరించినా... పార్లమెంటులో బిల్లుకు ఆమోదం పొందిందని, దక్షిణాది రాష్ట్ర సభ్యులను బయటకు పంపి ఈ బిల్లును ఆమోదించారన్నారు. 1984లో ఎన్‌టీరామారావు ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ తిరస్కరించిందని గుర్తుచేశారు. ఒక దేశం, ఒకే ఎన్నిక ప్రకారం స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని కేంద్రాన్ని కోరారు. విద్యార్థులకు రాయడం, చదవడం తెలియడం లేదని, దీనిని దృష్టిలో పెట్టుకొని 'విద్యా హక్కు'ను 'నాణ్యమైన విద్యా హక్కు'గా సంస్కరించాలని సూచించారు. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదముద్ర వేసేందుకు గడువు విధించాలని కోరారు.

అదొక వినాశనాస్త్రం

ఒక దేశం, ఒక ఎన్నికపై డెరెక్ ఓ బ్రెయిన్

న్యూఢిల్లీ: నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి వాటిపై నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు జమిలి ఎన్నికల బిల్లును కేంద్రం తెరమీదకు తెచ్చిందని టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ వ్యాఖ్యానించారు. ఆ దిశగా పడిన అడుగు... వినాశనానికి దారి తీస్తుందని హెచ్చరించారు. డెరెక్ శనివారం తన బ్లాగ్‌లో ఒక దేశం, ఒకే ఎన్నిక (ఓఎన్ఓఈ) గురించి ఇలా రాశారు. 'నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, సామ్యవాద వ్యతిరేక విధానాలు, రూపాయి క్షీణత, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గినా దేశంలో ఇంధన ధరలు తగ్గించకపోవడం తదితర ప్రధానాంశాలపై నుంచి దృష్టి మళ్లించేందుకు ఒక దేశం, ఒక ఎన్నికను వినాశనాస్త్రంగా కేంద్రం వినియోగిస్తోంది' అని డెరెక్ పేర్కొన్నారు. ఈ బిల్లు కూడా గతేడాది ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు లాంటిదేనని వ్యాఖ్యానించారు. మణిపూర్ పరిస్థితిని చక్కదిద్దడంలో వైఫల్యాన్ని కప్పిపుచ్చి ప్రైమ్ టైమ్‌లో ఒక దేశం, ఒక ఎన్నికపై చర్చలు పెద్దఎత్తున సాగుతున్నాయన్నారు. కులగణన, డీలిమిటేషన్ పూర్తి అయిన తర్వాతే మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోకి రాగలదు... అంటే 2034కు ముందు అందుకు ఆస్కారం ఉండదని డెరెక్ ఓ బ్రెయిల్ వ్యాఖ్యానించారు. ఒక దేశం, ఒకే ఎన్నికపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ (హెచ్ఎల్‌సీ) రాజ్యాంగంలో 18 సవరణలు సూచించిందన్నారు. 'రాజ్యాంగాన్ని సవరించే బిల్లును పార్లమెంటు ఆమోదించాలంటే మూడొంతుల మెజారిటీ అవసరం. రాజ్యాంగంలోని అధికరణ 368(2) ప్రకారం పంచాయతీలు, మున్సిపాలిటీలకు జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు సగానికిపైగా రాష్ట్రాలు అధికరణ 324 ఎకు సవరణలను ధ్రువీకరించాలి. ఒక్కటే ఓటర్ల జాబితా ఉండాలంటే అధికరణ 325కు సవరణలనూ రాష్ట్రాలు ఆమోదించాలి. జమిలి ఎన్నికలపై హెచ్ఎల్‌సీలో ఒక్క ముఖ్యమంత్రిగానీ రాష్ట్రాల నుంచి ప్రతినిధిగానీ లేరు. రాజ్యాంగ సవరణల ప్రభావం నేరుగా రాష్ట్రాల అసెంబ్లీలు, ప్రభుత్వంపై ఉంటుంది కాబట్టి ఈ అంశాలలో రాష్ట్రాల సమర్థనను పొందడం కేంద్రానికి అవసరం' అని డెరెక్ పేర్కొన్నారు. జమిలి ఎన్నికలు జరిగితే కేంద్రంతో పాటు రాష్ట్రంలో ఒకటే పార్టీకి ప్రజలు ఓటేసేందుకు 77శాతం అవకాశం ఉంటుందని ఐడీఎఫ్‌సీ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో వెల్లడైందని డెరెక్ ఓ బ్రెయిన్ తెలిపారు. ఇదిలావుంటే ఒక దేశం, ఒక ఎన్నికను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు రెండు బిల్లులను కేంద్రం సిద్ధం చేసింది. రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లును దిగువ సభలో కేంద్ర న్యాయ మంత్రి మేఘవాల్ ప్రవేశపెట్టనున్నారు.

మహిళలపై నేరాలు ఢిల్లీలో అధికం

కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నేరాలు నానాటికీ పెరుగుతున్నాయని మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నెలకొన్న పరిస్థితి గురించి కేంద్రమంత్రి అమిత్ షాకు శనివారం ఆయన లేఖ రాశారు. శాంతిభద్రతల సమస్యను వివరించేందుకు తనకు సమయం ఇవ్వాలని కోరారు. భారత్‌లోని మెట్రో నగరాలతో పోలిస్తే అత్యధికంగా మహిళలపై నేరాలు జరుగుతున్నది ఢిల్లీలోనేనని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఆ విషయంలో ఢిల్లీ తొలి స్థానంలో ఉందని, హత్యలు, దోపిడీలు రోజురోజుకీ పెరుగుతున్నాయని తెలిపారు. నేర గణాంకాలు పరిశీలిస్తే 'నేర రాజధాని'గా మన దేశం, ఢిల్లీ మారేలా ఉన్నాయని, పాఠశాలలు, విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు తరచూ వస్తున్నాయని, డ్రగ్స్ సంబంధిత నేరాలు 300 శాతానికి పైగా పెరిగాయని కేజ్రీవాల్ ఆందోళన వెలిబుచ్చారు. బాంబు బెదిరింపుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎంత భయపడుతున్నారో ఊహించారా అని ప్రశ్నించారు. నిత్యం వారంతా భయంభయంగా బతుకుతున్నారని, పట్టపగలే హత్యలు, కాల్పులు, కిడ్నాప్‌లు జరుగుతున్నాయని విమర్శించారు. రాజధానిలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని, ఈ వైఫల్యాల కారణంగా ఢిల్లీకి 'రేప్ క్యాపిటల్', 'క్రైం క్యాపిటల్' అనే కొత్త పేర్లు వస్తున్నాయని కేజ్రీవాల్ తెలిపారు. రాజధానిలో నెలకొన్న పరిస్థితి గురించి మరింత స్పష్టంగా వివరించేందుకు సమయం ఇవ్వాలని కోరుతున్నానని లేఖలో పేర్కొన్నారు. ఇటీవల ఈశాన్య ఢిల్లీలోని షహదారాలో మార్నింగ్‌వాక్‌కు వెళ్లిన సునీల్ జైన్(52) అనే వ్యాపారిని బైక్‌పై వచ్చిన దుండగులు తుపాకీతో కాల్చి చంపారు. మరో ఘటనలో దక్షిణ ఢిల్లీలోని గోవింద్‌పురిలో మరుగుదొడ్డి పరిశుభ్రతపై రెండువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి కత్తిపోట్లకు గురై ప్రాణాలు కోల్పోయాడు. కుమారుడు తల్లిని దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటనలపై స్పందించిన కేజ్రీవాల్ కేంద్ర మంత్రికి లేఖ రాశారు.

స్కూళ్లకు బెదిరింపు కాల్స్... 12 ఏళ్ల విద్యార్థి పనే

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వరుస బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. శుక్రవారం పశ్చిమ విహార్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కేంబ్రిడ్జ్ పాఠశాల సహా కొన్ని విద్యాసంస్థలకు కాల్స్ వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ కాల్స్ చేసింది 12 ఏళ్ల విద్యార్థిగా పోలీసులు గుర్తించారు. ఢిల్లీలోని అనేక పాఠశాలలకు బాంబు బెదిరింపులు వస్తున్నాయని మీడియాలో కథనాలు చూసి తాను మెయిల్ చేసినట్లు బాలుడు వెల్లడించినట్టు పోలీసువర్గాలు తెలిపాయి. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వ్యక్తులను పోలీసులు పట్టుకోవడం లేదన్న ఆవేదనతో తాను ఆ పని చేశానని పేర్కొన్నట్లు సమాచారం. దీంతో అధికారులు బాలుడితో సహా అతడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. మరోవైపు.. శనివారం సైతం ఆర్కేపురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సహా కొన్ని విద్యాసంస్థలకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, బాంబు నిర్వీర్య దళంతో అక్కడకు చేరుకుని తనిఖీలు నిర్వహించగా... ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీలో ఇలా పాఠశాలలకు బెదిరింపులు రావడం వారంలో ఇది మూడోసారి. డిసెంబరు 9న కూడా 40కి పైగా స్కూళ్లకు ఈ తరహా బెదిరింపులే వచ్చాయి. పాఠశాల ఆవరణల్లో పేలుడు పదార్థాలు అమర్చామని, వాటిని పేల్చకుండా ఉండాలంటే 30 వేల డాలర్లు ఇవ్వాలని ఆగంతకులు బెదిరించారు. అయితే, అది నకిలీదని ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

రాకెట్లు, బుల్లెట్ల శబ్దాలతో వణికిపోయాం

సిరియా నుంచి వచ్చిన నలుగురు భారతీయులు

న్యూఢిల్లీ: పశ్చిమాసియా దేశం సిరియాలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల వేళ అక్కడ ఉన్న భారతీయులను కేంద్ర ప్రభుత్వం స్వదేశానికి రప్పిస్తోంది. శనివారం నలుగురు భారతీయులు ఢిల్లీ విమానాశ్రయంలో దిగారు. సిరియాలోని కల్లోల పరిస్థితులతో వణికిపోయిన వారు... సురక్షితంగా స్వదేశానికి చేరుకోవడంపై సంతోషం వ్యక్తంచేశారు. అక్కడి భారత దౌత్య కార్యాలయం స్పందించిన తీరును ప్రశంసించారు. వారు ఎదుర్కొన్న భయానక పరిస్థితులను మీడియాకు వెల్లడించారు. 'రెండు వారాల క్రితం నేను సిరియా వెళ్లాను. ఇలా జరుగుతుందని అనుకోలేదు. భారత దౌత్య కార్యాలయం అక్కడినుంచి మమ్మల్ని లెబనాన్‌కు తరలించింది. కల్లోల పరిస్థితుల వేళ విమానాలు నడపకపోవడంతో బస్‌లో లెబనాన్‌కు వెళ్లాం. ఆ తర్వాత గోవా... ఇప్పుడు ఢిల్లీకి వచ్చాం' అని ఒకరు వెల్లడించారు. 'గత నాలుగు నెలలుగా నేను సిరియాలో ఉద్యోగం చేస్తున్నాను. ఇటీవల మా ప్లాంట్ సమీపంలోకి రాకెట్లు దూసుకొచ్చాయి. వెంటనే ఎంబసీకి సమాచారం ఇచ్చాను. అక్కడి పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. ప్రతిరోజు రాకెట్లు, బుల్లెట్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. మాకు ప్రతి దశలో సహకరించిన ఎంబసీ, భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అని ఇంకొకరు తెలిపారు. రాకెట్లు, బుల్లెట్లు పేలుతున్న శబ్దాలతో వణికిపోయామని మరొకరు పరిస్థితులను గుర్తుచేసుకొని ఆందోళన వ్యక్తంచేశారు. భారత విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించిన గణాంకాల ప్రకారం... సిరియా నుంచి ఇప్పటివరకు 77 మంది భారతీయులను కేంద్రం తరలించింది. అనేక కారణాల వల్ల అక్కడ ఉన్న భారతీయులు తిరిగి రావాలనుకుంటే తగిన సదుపాయాలు కల్పిస్తామని తెలిపింది.

మీడియాలో అతిశయోక్తులు వద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో 'వీఐపీ దర్శనం' పేరుతో అదనపు రుసుం వసూలుచేసే పద్ధతికి వ్యతిరేకంగా దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తాము జరిపిన విచారణ గురించి కొన్ని పత్రికల్లో 'తప్పుడు సమాచారం' రావడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. విజయ్ కిశోర్ గోస్వామి అనే వ్యక్తి దాఖలు చేసిన ఈ పిల్‌ను అక్టోబరు 25న విచారించిన సీజేఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసింది. 'గతంలో కోర్టులో జరిగిన విచారణను తప్పుగా చూపించారు. విచారణ సమయంలో సందర్భానుసారం వివిధ ప్రశ్నలు తలెత్తుతాయి. వాటిని మీడియాలో తప్పుగా, అతిశయోక్తులతో చూపించరాదు. ఈ పరిస్థితి దేశవ్యాప్తంగా ఉంది' అని ధర్మాసనం పేర్కొంది. కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 27కు వాయిదా వేసింది. 'ప్రత్యేక దర్శనం' పేరిట రూ.400 నుంచి రూ.500 వసూలు చేయడం సంపన్న భక్తులకు, సాధారణ ప్రజలకు మధ్య విభజనను చూపడమేనని, ఆలయ ప్రాంగణాల్లో అందరినీ సమదృష్టితో చూసేలా కేంద్రం ఆదేశాలు జారీ చేయాలని పిటిషనరు కోరారు.

జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన నోటీసు

న్యూఢిల్లీ: విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌ను పదవి నుంచి తొలగించేందుకు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని విపక్షాలు నిర్ణయించాయి. ఈ మేరకు 55 మంది ఎంపీలు సంతకాలు చేసిన నోటీసును రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీకి సమర్పించాయి. సంతకాలు చేసిన వారిలో కాంగ్రెస్ ఎంపీలు వివేక్ టంఖా, దిగ్విజయ్ సింగ్, కేటీఎస్ తుల్సి, డీఎంకే సభ్యుడు పి.విల్సన్, సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ తదితరులు ఉన్నారు. విశ్వహిందూ పరిషత్ లీగల్ సెల్ ఈ నెల 8న అలహాబాద్ హైకోర్టు ఆవరణలో ఉమ్మడి పౌరస్మృతిపై నిర్వహించిన సదస్సులో జస్టిస్ యాదవ్ చేసిన ప్రసంగం వివాదాస్పదంగా మారింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని పక్షపాతపూరిత, విద్వేషపూరిత ప్రసంగం చేశారని ఎంపీలు నోటీసులో పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో పాటించాల్సిన నైతిక విలువలపై సుప్రీంకోర్టు 1997 మే 7న 'న్యాయ జీవితంలో విలువల పునరుద్ధాటన' పేరుతో ప్రవర్తనా నియమావళి జారీ చేసిందని, జస్టిస్ యాదవ్ చేసిన ప్రసంగం అందుకు విరుద్ధంగా ఉందని తెలిపారు. ఈ కారణాల దృష్ట్యా జడ్జీల విచారణ చట్టం-1968 ప్రకారం తమ నోటీసును రాష్ట్రపతికి పంపించి సభలో ప్రవేశపెట్టేలా ఆమోదం తీసుకోవాలని కోరారు.

'వైల్డ్ చికెన్' వివాదంలో హిమాచల్ సీఎం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. తాజాగా వైల్డ్ చికెన్ వ్యవహారం ఆయనను ఇరకాటంలో పెడుతోంది. సీఎం పాల్గొన్న కార్యక్రమంలో చికెన్ వడ్డించిన వీడియో వైరల్ కావడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిమ్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం, ఇతర నేతలు పాల్గొన్నారు. దానిలో భాగంగా ఏర్పాటు చేసిన విందు మెనూలో వైల్డ్ చికెన్ ఉంది. దానిని వడ్డించిన వీడియో వైరల్ అయింది. సుఖు ఆ వంటకం తిననప్పటికీ ఆరోగ్యశాఖ మంత్రి, ఇతర అతిథులకు నిర్వాహకులు వడ్డించారు. ఆ చికెన్‌ను మెనూలో చేర్చడాన్ని తప్పుపడుతూ జంతు సంరక్షణ సంస్థ వీడియోను పోస్టు చేసింది. దాంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 1972 అటవీ సంరక్షణ చట్టం ప్రకారం రక్షిత జాతుల జాబితాలో 'వైల్డ్ చికెన్' కూడా ఉంది. వాటిని వేటాడటం శిక్షార్హం. దాంతో సీఎం, ఇతర నేతలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఘటనపై ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ వివాదంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ 'స్థానికులు నాకు ఆ ఆహారం అందజేశారు. కానీ నేను దానిని తినలేదు. అయితే కొన్ని మీడియా ఛానెళ్లు మాత్రం నేను ఆ చికెన్ తిన్నానంటూ ప్రసారం చేస్తున్నాయి. పర్వత ప్రాంత ప్రజల జీవనశైలిలో నాన్‌వెజ్ ఫుడ్ ఒక భాగం' అని వెల్లడించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

గురుకులాల్లో కామన్ డైట్ ప్రారంభం

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంక్షేమ పాఠశాలలో లైబ్రరీనీ కంప్యూటర్ ల్యాబ్‌లో అందుతున్న కోర్స్‌లను డిజిటల్ క్లాస్ రూం సిఓఈ ద్వారా విద్యార్థులకు అందే ప్రత్యేక కోర్సులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. కొత్త డైట్ ప్రారంభం అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా గురుకులాల్లో చదువుతున్న ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్‌లలో బలమైన ఆహారాన్ని అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మంత్రులు, ఎమ్మెల్యేలు శనివారం హాస్టల్‌లను సందర్శిస్తున్నారు. గురుకులాల్లో చదువుతున్న 8 లక్షల మందికి బలమైన ఆహారం అందించాలని నిపుణులైన డాక్టర్‌ల సమక్షంలో డైట్ మెనూ ఏర్పాటు చేసుకుంటున్నాం. ప్రభుత్వం గురుకులాల్లో తల్లిదండ్రులను భావించి మా భవిష్యత్ మీద అని అభయమిచ్చి ఇక్కడ చేరిన వారికి తెలంగాణ ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నామన్నారు. గత 10 సంవత్సరాలుగా విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్‌లు ఇచ్చి బదిలీలు చేసి నియామకాలు చేపట్టి అధ్యాపకవర్గ అసహనాన్ని తొలగించామన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా 25 వేల పాఠశాలకు 11 వందల కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పుస్తకాలు డ్రెస్‌లు సమయానికి అందిస్తున్నామన్నారు. ఇప్పుడున్న ధరలను పోలిస్తే 40 శాతం డైట్ చార్జీలు 200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచామని, గతంలో కిరాయిల ఇవ్వలేదని గురుకుల అద్దె భవనాలు ఖాళీ చేసే పరిస్థితి ఉంటే అద్దె బిల్లులు చెల్లించామన్నారు. మెస్ ఛార్జీలు గ్రీన్ ఛానెల్ ద్వారా చెల్లిస్తామని, రాబోయే కాలంలో ఆరోగ్యంగా ఉంటూ మానసికంగా బలంగా ఉంటూ తెలంగాణ అభివృద్ధిలో మీరంతా భాగస్వామ్యం కావాలన్నారు. జూడో, చేస్‌లో ఇక్కడ ఎక్కువగా ఆడుతున్నారు. మేము ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని అకుంఠిత దీక్షతో చదువుకొని మీ ముందు మంత్రిగా ఇక్కడ ఉన్నానని, ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారని, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, టీజీపిఎస్‌సి ఛైర్మన్ బుర్ర వెంకటేశం, ఫైనాన్స్ సెక్రెటరీ రామకృష్ణ గురుకులాల్లో చదివి ఇక్కడికి ఎదిగారన్నారు. జవహర్ లాల్ నెహ్రూ నవ రత్నాలు స్థాపించి టెక్నికల్‌గా దేశం ఎక్కడికో ఎదిగిందని, మీరు మీ తెలివి నీ మెరుగుపరుచుకోవాలని, మీ తల్లిదండ్రులకు గ్రామానికి తెలంగాణకి పేరు తెచ్చే విధంగా మీరు ఎదగాలన్నారు. మీకు మున్సిపల్ వాటర్ రేపటి నుండి ఉచితంగా వస్తాయని, ఈ గురుకులలో ఒక బోర్ వేసి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. మౌళిక వసతులు కల్పనలు 25 లక్షలు మంజూరు చేస్తున్నామని, 20 మంది జూడో క్రీడాకారులకు జూడో డ్రెస్‌లు కలెక్టర్ ఆధ్వర్యంలో అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వస్తుందని, ఈ స్కూల్ నుండి అక్కడ కూడా పెద్ద ఎత్తున సీట్లు సంపాదించాలని, తాను సౌత్ కొరియా పోయినప్పుడు అక్కడ స్పోర్ట్స్ యూనివర్సిటీ చూశానని, ఆ చిన్న దేశానికి 34 ఒలంపిక్స్ మెడల్స్ వచ్చాయన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు.

సంకల్పం మంచిదైతే విజయం తథ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంకల్పం మంచిదైతే విజయం తథ్యం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, ఇన్ఫోసిస్ సహకారంతో నిర్వహిస్తున్న యూత్ ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం కావాలన్నా అందుకు సహకారం నానుంచి ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. దేశం మొత్తం 25 రాష్ట్రాల్లో నిర్మాణ్ ఆర్గనైజేషన్‌లను ఏర్పాటు చేస్తున్న ఈ సంస్థ ఈరోజు మన మహబూబ్ నగర్ జిల్లాలో మొదటి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. మన మహబూబ్ నగర్ నుంచే రానున్న రెండు సంవత్సరాల్లోనే 2600 మంది యువతకు ప్లేస్‌మెంట్ ఇస్తామనే లక్ష్యం నిర్ణయించుకుని పనిచేస్తున్నందుకు నేను వీరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని ఆయన చెప్పారు. మొదటి సంస్థనే మహబూబ్ నగర్‌లో మొదటి సెంటర్‌గా ఏర్పాటు చేసినుదుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు అభినందనలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ అవకాశాన్ని మహబూబ్ నగర్ యువత వినియోగించుకొని జీవితంలో స్థిరపడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ సిఇఓ మయూర్, సిఓఓ అనురాధ, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంచి విద్యతోనే పిల్లల భవిష్యత్తు..

మంచి విద్య తోటే పిల్లల భవిష్యత్తు అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో శనివారం నూతన డైట్ మెనూ ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఒకే రకమైన మెనూ ఉండేదని, కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా అయిన తరువాత 40శాతం అధికంగా డైట్ చార్జీలు పెంచడం జరిగిందని ఆయన తెలిపారు. గత 10 సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని ఆయన మండిపడ్డారు. ప్రధానంగా పిల్లల భవిష్యత్తు కోసం ఏఏ కార్యక్రమాలు చేయాలో నిర్ణయించుకొని, ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, మండల అధికారులు సైతం ఈరోజు శ్రమిస్తున్నారని ఆయన చెప్పారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే మంచిగా చదువుకోవాలని, మీ అందరి దృష్టి అంతా కూడా చదువు పైన కేంద్రీకరించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి అని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వాణిశ్రీ, మహబూబ్ నగర్ గ్రామీణ తహసీల్దార్ సుందర్ రాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్, సిఐ అప్పయ్య, కౌన్సిలర్ ఖాజా పాషా, శ్రీనివాస్ యాదవ్, విద్యార్థులు, తల్లితండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఐ ఇంజనీరింగ్ హబ్‌ను ప్రారంభించిన టెక్‌వేవ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ప్రముఖ గ్లోబల్ ఐటి, ఇంజనీరింగ్ సొల్యూషన్స్ సంస్థ టెక్‌వేవ్, హైదరాబాద్‌లో తన రెండో ఆఫీస్ స్పేస్‌ను, తన మొదటి ఏఐ ఇంజనీరింగ్ హబ్‌ను ప్రారంభించింది. 100,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ అత్యాధునిక కేంద్రం తదుపరి తరం పని వాతావరణాన్ని అందించడానికి రూపొందించబడింది. ఇది మొత్తం వృద్ధికి, మా క్లయింట్‌లకు మెరుగైన మద్దతునిచ్చేందుకు మా సహచరులకు వినూత్నమైన స్థలాన్ని అందించడానికి మా నిబద్ధతను బలపరుస్తుంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని టెక్‌పార్క్‌లో ఉన్న ఈ కేంద్రాన్ని మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా టెక్‌వేవ్ సహ వ్యవస్థాపకుడు ఛైర్మన్ దామోదర్‌రావు గుమ్మడపు, టెక్‌వేవ్ సీఈఓ, సహ వ్యవస్థాపకులు రాజ్ గుమ్మడపు, టెక్‌వేవ్ ఇండియా ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రరావు మాట్లాడుతూ "ఏఐలో మా విస్తరించిన సర్వీస్ ఆఫర్‌లతో సహా మా అన్ని సేవలలో మా వృద్ధి విస్తరణకు మద్దతు ఇవ్వడానికి ఈ కొత్త కేంద్రం ఒక ముఖ్యమైన ఉత్ప్రేరకంగా ఉపయోగపడుతుందన్నారు. దాదాపు 1,200 మంది అసోసియేట్‌లకు సదుపాయం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రం తెలంగాణలో టెక్‌వేవ్ విస్తరణలో మరో ప్రధాన దశను సూచిస్తుందన్నారు. హైదరాబాద్‌లోని రెండు కార్యాలయాలతో పాటు, ఖమ్మంలో వృద్ధి చెందుతున్న కార్యాలయంతో కంపెనీ తన ప్రాంతీయ ఉనికిని బలోపేతం చేస్తోందన్నారు. ఖమ్మం కార్యాలయం ప్రస్తుతం 400 మంది అసోసియేట్‌లను కలిగి ఉందన్నారు. టెక్‌వేవ్ అంతర్జాతీయ వృద్ధి, విజయాల ప్రయాణంలో మరో మైలురాయిని సాధించాయన్నారు.

ఐఐటీ ప్రవేశాలే లక్ష్యం : దాన కిషోర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతిభావంతులైన విద్యార్థినీలకు ఐఐటిలలో ప్రవేశాలు పొందేందుకు వీలుగా మహేశ్వరంలోని సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఐఐటి కోచింగ్ ఇనిస్టిట్యూట్ పెట్టిస్తానని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో న్యూ కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ ముఖ్య అతిథిగా హాజరై గురుకులంలో కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. గురుకులంలో తరగతి గదులను, వాష్ రూంలలో పారిశుద్ధ్యంను పరిశీలించిన ముఖ్య కార్యదర్శి పరిశీలించారు. విద్యార్థులతో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ మాట్లాడారు. కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ మాట్లాడుతూ తెలంగాణలో గురుకుల ప్రక్షాళనకు ప్రభుత్వం నడుం బిగించిదన్నారు. కొత్త కామన్ డైట్‌తో పాటు గురుకులాల బలోపేతానికి చిత్త శుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఈ గురుకులంలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులకు 1000 మార్కులకు గానూ 980, 974 మార్కులు అమ్మాయిలు సాధించారని, సరైన గైడెన్స్, శిక్షణ లేకపోవడం వల్ల ఐఐటిలలో ప్రవేశాలు పొందలేక పోయారన్నారు. ఐఏఎస్‌లకు ఎంపికయ్యే అభ్యర్థులలో 30 శాతం మంది ఐఐటిలలో చదివిన వారే నన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదివిన విద్యార్థులకు సంవత్సరం వేతనంగా దేశ, విదేశీ కంపెనీలు కోట్లలో వేతన ప్యాకేజీలు ఇస్తున్నాయన్నారు. విద్యార్థినిలతో పాటు వారి తల్లిదండ్రులు తమ పిల్లలు గొప్ప వాళ్ళుగా చేయాలన్నా కలలు కనాలన్నారు. ఈ గురుకులంలో ఇంటర్ చదివే విద్యార్థినిలకు ఐఐటిలలో సీట్లు వచ్చేలా ప్రత్యేక కోచింగ్ ఇప్పిస్తామన్నారు. వచ్చే శనివారం సాంఘిక సంక్షేమ గురుకులం స్కూల్, జూనియర్ కళాశాలలో గైనిక్ డాక్టర్ ఆధ్వర్యంలో 550 మంది విద్యార్థినీల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. సిఎస్ఆర్ నిధులు రూ.60 లక్షలతో మినరల్ వాటర్, బెంచ్‌లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పిస్తామన్నారు. గురుకులంలో విద్యార్థినిలకు ఆహ్లాదం పంచేలా ఫ్లోరల్ గార్డెన్ ఏర్పాటు చేస్తామన్నారు. మహేశ్వరం సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించేందుకు, అమలు పరిచేందుకు జోనల్ కమిషనర్, ఆర్‌డిఓ, సిడిపిఓ, ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో కమిటీనీ ఏర్పాటు చేస్తామన్నారు.

పేదింటి ఆడబిడ్డలను ఆదుకునేందుకే కళ్యాణ లక్ష్మి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కారేపల్లి : పేదింటి ఆడబిడ్డలను ఆదుకునేందుకే కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ప్రభుత్వం ద్వారా అందజేయడం జరుగుతుందని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వైఎస్ ఎన్ గార్డెన్లో ఇటీవల మంజూరైన కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను అన్నింటిని అమలు చేసి తీరుతుందని ఆయన పేర్కొన్నారు. కొత్తగా పెళ్లయిన మహిళలకు కానుకగా అందిస్తున్న కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించటం జరుగుతుందని పేద కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల పార్టీ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస రావు, నాయకులు నర్సింగ్ శ్రీనివాసరావు, ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగోడ ఐలయ్య, ఎండి హనీఫ్, గోపాల్ నాయక్, మేదరి వీర ప్రతాప్, తహసిల్దార్ సంపత్ కుమార్, సీఐ తిరుపతిరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు మంత్రివర్గ విస్తరణలో స్థానం కల్పించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : రాష్ట్ర క్యాబినెట్‌లో ముస్లిం మంత్రి లేకపోవడం బాధాకరం అని తహ్రీక్ ముస్లిం షబ్బాన్ అధ్యక్షులు మహమ్మద్ ముస్తాక్ మాలిక్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో మైనార్టీలకు స్థానం కల్పించి మేనిఫెస్టోలో మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు అత్యధికంగా ముస్లిం సమాజం మద్దతు ఇచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 14 శాతం ఉన్న మైనారిటీలను మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం ఇది తొలిసారి అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మత ఘర్షణలు ఎక్కువ అవుతున్నాయని దీనిని అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సూచించారు. 1953 తర్వాత తొలిసారిగా తెలంగాణ మంత్రివర్గంలో ముస్లిం ప్రతినిధి లేదని అన్నారు. అలాగే ముస్లిం ఎమ్మెల్యే ఎవరూ ఎన్నిక కాలేదని వెల్లడించారు. రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లిం ప్రాతినిధ్యాన్ని తిరస్కరించడంలో గుజరాత్, అస్సాం రెండూ బీజేపీ పాలిత రాష్ట్రాలతో కలిసాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు అక్బర్ అక్తర్ అలీ, గఫర్, ఖలీద్ ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర - ఘట్‌కేసర్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి పౌష్టికాహారం అందించే విధంగా ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచడం జరిగిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల్ ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో శనివారం ప్రభుత్వం డైట్ చార్జీలు 40 శాతం పెంచిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గన్నారు. ఈ మేరకు విద్యార్థులు మార్చ్ ఫాస్ట్‌లో కలెక్టర్ గౌతంకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు హైజిన్ పౌష్టికాహారం, యూనిఫామ్, షూస్ సాక్స్‌లు, కాస్మోటిక్ చార్జీలు అందించడం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలని అన్నారు. దశాబ్దాలుగా మారని డైట్ చార్జీలను ఈ ప్రభుత్వం 40 శాతం మేర పెంచి, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తుందని తెలిపారు. గురుకుల పాఠశాలలో చేరే విద్యార్థులకు నాణ్యమైన విద్య, భద్రతతో పాటు హైజిన్ పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తల్లిదండ్రులలో మరింత నమ్మకాన్ని పెంపొందించే విధంగా ఫ్యాకల్టీ కృషి చేయాలని సూచించారు. అనంతరం వంటశాలను, తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలసి మధ్యాహనం భోజంన చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, సాంఘీక సంక్షేమ శాఖ జిల్లా అధికారి వినోద్ కుమార్, ఘట్‌కేసర్ తహశీల్దార్ డివిఎస్ రజిన్, పాఠశాల ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గన్నారు.

ఆవిర్భావ కార్యక్రమాలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కాప్రా : సిపిఐ పార్టీ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్ అన్నారు. శనివారం ఈసీఐఎల్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సిపిఐ కౌన్సిల్ సమావేశం శంకర్రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అమరులైన ఎం బాల మల్లేష్, ఖమ్మం జిల్లా పోటు ప్రసాద్‌ల చిత్రపటానికి పూలమాలు వేసే నివాళులర్పించారు. అనంతరం డిజి సాయిలు గౌడ్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారతదేశంలో 1925లో డిసెంబర్ 26 నా కాన్పూర్‌లో ఆవిర్భవించారు. 99 సంవత్సరాలు పూర్తిచేసుకుని 100 సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా, రాష్ట్ర, జిల్లా, గ్రామాలలో డిసెంబర్ 26న సభలు, సమావేశాలు నిర్వహించాలని జిల్లా కౌన్సిల్ సభ్యులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 30న సత్తా వార్షికోత్సవాలను ప్రారంభ సభ నల్గొండలో నిర్వహిస్తున్నామని సభను విజయవంతం చేసేందుకు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని అన్నారు. సభలు సమావేశాలలో సిపిఐ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాల గురించి ప్రజలకు తెలియజేయాలని నేడు దేశంలో జరుగుతున్న కాంగ్రెస్, బిజెపి పార్టీలు పెట్టుబడిదరులకు కొమ్ముకాస్తున్న విధానాలను బిజెపి, ఆర్ఎస్ఎస్ ద్వారా జరుగుతున్న నష్టాలను ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. సిపిఐ పార్టీ బలపరిచేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు.

నాణ్యత పాటిస్తూ లక్ష్యాలు సాధించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మార్చి 31 వరకు ఇకపై రోజుకు 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలని సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఆయన అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్పత్తి, నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. లక్ష్యాల మేరకు ఉత్పత్తి సాధిస్తున్న గనులను, ఏరియాలను ఆయన అభినందిస్తూ, వెనుకబడి ఉన్న ఏరియాలు ఇప్పుడు పుంజుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లక్ష్యాల సాధనతో పాటు నాణ్యతకు, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నాణ్యత తగ్గినట్లయితే వినియోగదారుల విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏరియాలో పై అధికారుల నుంచి కింది స్థాయి వరకు అందరూ దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియటానికి ఇంకా 108 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, ఈ సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తూ రోజుకు కనీసం 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అదే మోతాదులో బొగ్గు రవాణా నిర్వహించాలన్నారు. బొగ్గు రవాణాకు ఆటంకం లేకుండా, రైల్వే అధికారులతో సంప్రదిస్తూ వినియోగదారులకు సకాలంలో బొగ్గు అందచేయాలని సూచించారు. విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును అందజేసే బాధ్యత మనపై ఉందని తెలియజేశారు. ఆయనతో పాటు సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, జి.వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ ఎస్.డి ఎం.సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవి ప్రసాద్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఎల్‌ఓసి అందజేత

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్ ఓల్డ్ మల్కాజిగిరికి చెందిన నిహారిక అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి ఎల్.ఓ.సి దరఖాస్తు చేసుకోగా శనివారం మంజూరైన 2 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బోయిన్ పల్లి క్యాంప్ ఆఫీసులో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సంక్షేమ సహాయనిధి పేదలు అనారోగ్యానికి గురైన సమయంలో వారికి ఆపన్నహస్తంలా ఉపయోగపడుతుందన్నారు. మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నీలం సతీష్, జనార్ధన్, చిన్న యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆహార భద్రత పాటించాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు : విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి, ఉన్నతమైన స్థానాలలో నిలబెట్టడానికి ప్రతిఒక్కరు కష్టపడి పనిచేయాలని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మి నర్సింహ్మారెడ్డి అన్నారు. శనివారం కడ్తాల్ గిరిజన బాలుర ఆశ్రమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ కార్యక్రమంలో పాల్గొని అధ్యపకులకు పలు సూచనలు చేశారు. కామన్ డైట్ ద్వారా విద్యార్థులకు భోజన ఏర్పాటులో సమయపాలన పాటించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు, అనేక సౌకర్యాలు కల్పించారని అన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నారని వారందరికీ రాజకీయాల కతీతంగా అందరం నమ్మకం, ఆత్మవిశ్వాసం కలిగించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పరేడ్ బ్యాండ్ కొనుగోలు నిమిత్తం 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసం, వసతుల ఏర్పాటులో ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతానరసింహ, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, చేగురి వెంకటేష్ నాయకులు బిక్యానాయక్, బిచ్యానాయక్, మల్లేష్ గౌడ్, యాదయ్య గౌడ్, గురిగళ్ళ రామచంద్రయ్య, ఎంపీడీవో సుజాత, మండల వ్యవసాయ అధికారిని శ్రీలత, హాస్టల్ వార్డెన్ రాములు, అధ్యాపకులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హఫీజ్ పేటలోని మార్తాండ నగర్ మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో 1వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు దంత, కంటి పరీక్షలు చేయబడినవి. 200 మంది విద్యార్థులను పరీక్షించడం జరిగింది. అందులో 47 మంది విద్యార్థులు పిప్పి పళ్ళు గుర్తించడం, పళ్ళ పరిశుభ్రత గురించి, పళ్ళు ఎలా రక్షించుకోవాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలని దంత వైద్యులు విద్యార్థులకు వివరించారు. స్కూల్ టీచర్లకు, విద్యార్థులకు తక్కువ ఫీజుతో సి ఆర్ పాలీ క్లినిక్, రోటరీ డయాగ్నోస్టిక్స్ సెంటర్లో ఉన్న ఆధునిక వైద్య సదుపాయాల గురించి తెలియజేశారు. కంటి పరీక్షలు చేయించుకున్న కొంతమందికి మెల్లకన్ను, దృష్టి దోషం నిర్ధారించబడి వి.సి ఆర్ ఫౌండేషన్‌లోని ఎల్‌వి ప్రసాద్ ప్రాథమిక కేంద్రం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రభుత్వం సహకరించి మెల్ల కన్ను కరెక్షన్, దృష్టి దోషం కరెక్షన్, అద్దాలు ఇచ్చి వారి భవిష్యత్తు కి మేలు చేయవచ్చు. ఈ క్యాంపుకి డెంటిస్టులు డాక్టర్ అజయ్‌రావు, డాక్టర్ ప్రశాంతి విద్యార్థులకు పరీక్షలు చేసి సహకరించారు. ఎల్ వి ప్రసాద్ వైద్యులు కంటి పరీక్షలు చేశారు. ఈ క్యాంప్‌లో సిఆర్ పాలీ క్లినిక్ సిఓఓ విజయ, ఎల్ వి ప్రసాద్ హాస్పిటల్ నుండి 8మంది టెక్నీషియన్స్, తదితరులు పాల్గొన్నారు. సి ఆర్ ఫౌండేషన్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె రజిని బ్రెష్‌లు, పేస్టులు స్పాన్సర్ చేయగా వాటిని విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. సిఆర్ పాలీ క్లినిక్ రోటరీ డయాగ్నస్టిక్స్ కొండాపూర్‌లో చాలా తక్కువ ఫీజుతో, పరీక్షలకు అతి తక్కువ రుసుముతో ప్రజలకు అందరికీ సేవలు అందుతున్నాయి. ఈ సేవలను స్థానికులు వినియోగించుకోవాలన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

విశాలాంధ్ర – హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచింది. రాష్ట్రంలోని అన్ని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ అధికారులు ఆయా స్కూల్‌కు వెళ్లి పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ముషీరాబాద్, చార్మినార్‌ల స్కూల్స్‌కు సంబందించిన కార్యక్రమాన్ని హయత్‌నగర్‌లోని స్వాతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ జాయింట్ కమీషనర్ శ్రీవత్స కోట హాజరయ్యారు. ముషీరాబాద్, చార్మినార్ రెసిడెన్సియల్ స్కూళ్లను సందర్శించారు. విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. కామన్ డైట్ మెనూ, మెరుగైన డైట్, కాస్మెటిక్ ఛార్జీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొత్త వాణిజ్య భవనాలపై సోలార్ తప్పనిసరి ?

విశాలాంధ్ర – శేరిలింగంపల్లి: మీడియా డే మార్కెటింగ్, నగరానికి చెందిన ప్రసిద్ధ ఎక్స్‌పోస్ నిర్వాహకులు డైరీ, ఫుడ్ ఎక్స్‌పోస్ 4వ ఎడిషన్ ఇండియా గ్రీన్ ఎనర్జీ ఎక్స్‌పో 6వ ఎడిషన్, గ్రీన్ 4వ ఎడిషన్‌ను ప్రారంభించారు. డైరీ, ఫుడ్ ఎక్స్‌పోస్ను పరిశ్రమల, సంఘాల నాయకులు గురువారం ప్రారంభించారు. ఇవి 13వ తేదీ వరకు తెరిచి ఉంటాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంటాయి. తెలంగాణ ప్రభుత్వ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్స్‌పోను సందర్శించి, ఇతర రెండు ఎక్స్‌పోలు 6వ ఎడిషన్ ఆఫ్ ఇండియా గ్రీన్ ఎనర్జీ ఎక్స్‌పో, గ్రీన్ వెహికల్ ఎక్స్‌పో 4వ ఎడిషన్ ప్రారంభించారు. అనంతరం తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు బి అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సోలార్ పవర్ పాలసీ 2015 సంవత్సరంలో ఎంతో సంచలనం సృష్టించి భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ వంటి పథకాల కింద సౌరశక్తిని ప్రోత్సహించేందుకు భారత కేంద్ర ప్రభుత్వం అనేక రాయితీలను అందజేస్తుందని రాజేష్ తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రం పరిశ్రమను ప్రోత్సహించదు లేదా పరిశ్రమను ప్రోత్సహించడానికి అటువంటి రాయితీలు లేదా ప్రోత్సాహకాలను అందించడం లేదన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్‌ను ప్రారంభించిన సిఎం, డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర – హైదరాబాద్ : రాష్ట్ర విద్యా రంగ చరిత్రలో నేడు అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి. బీసీ మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో ఒకే సారి కామన్ మెనూ నేడు విజయవంతంగా ప్రారంభమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిల్కూరులో ని టీజీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గం బోనకల్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ప్రారంభించారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, గ్రంధాలయ చైర్మెన్లు ఇతర ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపిఎస్, ఐ.ఎఫ్.ఎస్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కామన్ డైయిట్ ను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కొరకు చదువుతోపాటు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలో ఒకే రకమైన పౌష్టిక ఆహారం అందించే విధంగా డైట్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నది. పెంచిన డైయిట్ చార్జీల కనుగుణంగా నేడు కామన్ డైయిట్ అమలులోకి వచ్చింది. రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు దాదాపు 140 ఈ కామన్ డైయిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితోపాటు, 450 మంది సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా సీనియర్ అధికారులు రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యారులు, తల్లితండ్రుల సమక్షంలో కామన్ డైట్ ను ప్రారంభించి, విద్యార్థులతో కల్సి భోజనం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఇక నుండి ప్రతి నెలా 10 వ తేదీనే డైయిట్ చార్జీల బిల్లులను గ్రీన్ ఛానెల్ లో చెల్లించనున్నట్టు ప్రకటించారు. వికారాబాద్ పట్టణంలోని మైనారిటీ సంక్షేమ హాస్టల్లో రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కామన్ డైట్ ను ప్రారంభించారు. తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం గ్రామంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల (బాలురు) లో విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు, కామన్ డైట్ మెనూ ను రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ షేక్ పేట సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ బాయ్స్ కళాశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర బీ.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

ఘనంగా నీలం రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర – శేరిలింగంపల్లి: స్వాతంత్ర సమరయోధులు, సిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపనలో ప్రముఖులు నీలం రాజశేఖర్ రెడ్డి 30వ వర్ధంతి సంధర్భంగా సిఆర్ ఫౌండేషన్ కొండాపూర్, హైదరాబాద్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి రిసెర్చ్ సెంటర్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. నీలం రాజశేఖర్ రెడ్డి కమ్యూనిస్టు నిబద్ధతతో ఉన్న ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చినప్పటికీ అలనాటి భారత దేశ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డి స్వయాన సోదరుడైనప్పటికీ వారు కమ్యూనిస్టు పార్టీ సమున్నతికి నిర్విరామంగా కృషి చేశారు. ముఖ్యంగా పార్టీలో యువకులను, మేధావులను ప్రోత్సహించారని వక్తలు రాజశేఖర రెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. సిఆర్ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ పల్లా వెంకట్ రెడ్డి, భారత మహిళా సమాఖ్య ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి బివి విజయలక్ష్మి, ఫౌండేషన్ సెక్రటరీ చెన్నమనేని వెంకటేశ్వరరావు నీలం రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి చంద్ర రాజేశ్వరరావుతో పాటు ఢిల్లీ కేంద్రంగా జాతీయ కార్యదర్శిగా చాలా సంవత్సరాలు పనిచేసి రిటైర్డ్ అయిన తర్వాత హైదరాబాద్ వచ్చారని, నీలం రాజశేఖర్ రెడ్డి విద్యార్థులను, యువకులను, పార్టీలో వారిని ప్రోత్సహించారని తెలియజేశారు. సిఆర్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్, నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ కన్వీనర్ కంభంపాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ నీలం రాజశేఖర రెడ్డి రిసెర్చ్ సెంటర్లో జరుగుతున్న కార్యక్రమాల గురించి తెలియజేశారు. భారత మహిళా సమాఖ్య ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి బివి విజయలక్ష్మి మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్లోలోని లైబ్రరీ విస్తరణకు డిజిటలైజేషన్ ద్వారా విద్యార్థులకు, యువకులకు అందరికీ ప్రోత్సాహం లభిస్తుందని తెలియజేశారు. సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోస్య భట్ల కల్పన, సభ్యులు, జ్యోత్స్న, లలిత, ఆశ్రమ వాసులు ఉమెన్ ఎంపవర్మెంట్ సెంటర్ విద్యార్థినిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర – తుర్కయంజాల్ : శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకున్నప్పుడే ప్రజల్లో దాగి ఉన్న అసమానతలు మూఢనమ్మకాల రుగ్మతులను రూపుమాపవచ్చని ఫిరా జాతీయ అధ్యక్షులు ప్రొ. నరేంద్రనాయక్ అన్నారు. ఆదివారం మానవ వికాస వేదిక 20 వసంతాల వేడుకలు అబ్దుల్లాపూర్మెట్ మండలం బాటసింగారంలో మానవ వికాస వేదిక హ్యూమనిస్ట్ సెంటర్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఫిరా జాతీయ అధ్యక్షులు ప్రొ.నరేంద్రనాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలు రోజు రోజుకి పెరిగిపోవడానికి కారణం శాస్త్రీయ దృక్పథం లేకపోవడమేనన్నారు. తెలంగాణలో మూఢనమ్మకాల నిర్మూలన చట్టం రావాలని ఆయన పేర్కొన్నారు. నాస్తిక, హేతువాద భావ సారూప్యం కలిగిన ఇతర సంఘాలలో ఉద్యమాలను నడిపిన 70 సం.రాలు దాటిన వారి కృషికి గాను డా.సమరం. గోరా, భానుప్రసాద్, హను, గుత్తా జ్యోత్స్న, నార్నే వెంకటసుబ్బయ్య, గుమ్మా వీరన్నలను సన్మానించారు. అనంతరం సాంఘిక భావ విప్లవకారులైన త్రిపురనేని రామస్వామి, అబ్రహం కొవ్వూరు, ప్రేమానంద్, నరసింహయ్య, గోరా–సరస్వతి ప్రముఖుల చిత్రపటాలను, బుద్ధుడు, అంబేద్కర్, పెరియార్ రామస్వామి, జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే, భగత్సింగ్ విగ్రహాలను సెంటర్ వేదికపై హేతువాద ప్రముఖులు ఆవిష్కరించారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల నుండి అతిధులుగా వచ్చిన వారు వారి వారి రాష్ట్రాలలో జరుగుతున్న హేతువాద ఉద్యమాల తీరుతెన్నులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మానవ వికాస వేదిక కేంద్ర కమిటీ అధ్యక్షులు సాంబశివరావు. ప్రధాన సెక్రటరీ ఎం.ఎస్. మూర్తి. స్వేచాలోచన మాస పత్రిక ఎడిటర్ హనుమంతరావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ డైమండ్స్‌లో ఆర్టిస్ట్రీ షో ప్రారంభం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మలబార్ గోల్డ్ డైమండ్స్ లో డిసెంబర్ 14 నుండి 22వ తేదీ వరకు సోమాజిగూడ షోరూం లో 'ఆర్టిస్ట్రీ షోను ప్రముఖ నృత్య కళాకారిణి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల చేతుల మీదుగా ప్రారంభించారు. హస్తకళా నైపుణ్యంతో, అద్భుత డిజైన్లతో, విస్తృత శ్రేణిలో తీర్చిదిద్దిన సాంప్రదాయ సమకాలీన ఆభరణాల కళాత్మక వైభవాన్ని ఈ ప్రత్యేక ప్రదర్శనలో ప్రదర్శిస్తున్నారు.మైన్ డైమండ్ ఫెస్టివల్లో భాగంగా వజ్రాల విలువపై 25 శాతం వరకు తగ్గింపు, పాత మైన్ డైమండ్ ఆభరణాలపై 100 శాతం మార్పిడి విలువను పొందే ప్రత్యేక అవకాశం అదనంగా కస్టమర్లకు కల్పించబడిందని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తెలంగాణ (హైదరాబాద్) జోనల్ హెడ్ మొహమ్మద్ షరీజ్, షోరూమ్ హెడ్ రెజై, డిప్యూటీ షోరూమ్ హెడ్ జిజీశ్ లు తెలిపారు. ఆర్టిస్ట్రీ షో లో ప్రదర్శించబడుతున్న ప్రతి ఆభరణం ఎంతో ప్రత్యేకమైనదని, ప్రతి డిజైన్ భారతీయ సాంప్రదాయ కళ, హస్తకళా నైపుణ్యానికి నిదర్శనం అన్నారు. మలబార్ గోల్డ్ డైమండ్స్ ప్రత్యేకమైన బ్రాండ్లు 'మైన్' డైమండ్ జ్యువెలరీ, 'ఎరా' అన్కట్ డైమండ్స్ 'ప్రీసియా' జెమ్స్టోన్ జ్యువెలరీ, 'ఎత్నిక్స్' హ్యాండ్ క్రాఫ్టెడ్ జ్యువెలరీ, 'విరాజ్' రాయల్ పోల్కీ జ్యువెలరీ వంటి విస్తృత శ్రేణి సేకరణలతో పాటు అత్యంత పరిపూర్ణతతో అద్భుతంగా రూపొందించిన ఎన్నో ఆభరణాలు ఈ ప్రత్యేక ప్రదర్శనలో లభిస్తాయని వారు పేర్కొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం కృషి : సీపీ సుధీర్ బాబు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం పౌష్టికాహార ప్రణాళికను అమలు చేస్తూ, వారికి మంచి ఆరోగ్యం, భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. శనివారం అబ్దుల్లాపూర్మెట్ మండలంలోని బాట సింగారం మహాత్మ జ్యోతిబాపూలే సాంఘిక సమీకృత బాలుర ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన యూనిఫామ్ డైట్ లాంచ్ కార్యక్రమంలో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి, ఎస్‌టీపీ హ్యాండ్ బుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాచకొండ కమిషనర్ తసుధీర్ బాబు ఐపీఎస్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మంచి భోజన సదుపాయాలు అందించేందుకు ముఖ్యమంత్రి ఎనిమిది సంవత్సరాల తర్వాత విద్యార్థి డైట్ చార్జీలను 40 శాతం పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. విద్యార్థులు బలంగా ఉండాలంటే మంచి పౌష్టికాహారం అవసరమని అన్నారు. విత్తనం కష్టాలను ఎదుర్కొని బలంగా చెట్టు ఎదిగినట్లుగా, మీరు కూడా కష్టాలను తట్టుకుని గొప్ప స్థాయికి ఎదగాలని అన్నారు. మంచి పౌష్టిక ఆహారం, ఆరోగ్యం బాగుండాలని ఉద్దేశంతో ప్రభుత్వం మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. చిన్న వయసులోనే మంచి ఆహారం తీసుకుంటూ భవిష్యత్తులో గొప్ప స్థాయిలలోకి చేరి, మంచి ఆఫీసర్లుగా ఎదగాలని విద్యార్థులకు అయన సూచించారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఏకరీతి ఆహార ప్రణాళిక ద్వారా విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తూ, వారి ఆరోగ్యం కోసం ప్రతి విద్యార్థికి నెల డైట్ ఖర్చును పెంచినట్లు తెలిపారు. విద్యార్థులు డాక్టర్, ఐఏఎస్, ఐపీఎస్ కావాలంటే ప్రతి రోజూ పాఠశాలకు హాజరై, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ వంద శాతం అటెండెన్స్‌తో కష్టపడి చదువుకోవాలని అన్నారు. విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో 10/10 జీపీఏ సాధించేందుకు కష్టపడి ఇష్టంగా చదవాలని అన్నారు.

సాయంత్రం 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు చదువు ఎంత ముఖ్యం అనే విషయాన్ని గుర్తించి, తమ పిల్లలను పాఠశాలలకు పంపించి, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ హైటెన్షన్ పోల్ సర్వే లైన్ మార్చాలి

విశాలాంధ్ర – అమనగల్లు : కడ్తాల్ మండల కేంద్రానికి సమీపంలో 765 కేవీ విద్యుత్ హైటెన్షన్ పోల్ సర్వే లైన్ మార్చాలని మండల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, టొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో బాధిత రైతులు, బీదర్ పవర్ ట్రాన్స్మిషన్ ప్రైవేట్ లిమిటెడ్ డిజిఎం సంతోష్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రం సమీపంలోని సన్న చిన్న కారు రైతుల పొలాల మీదుగా బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్ మిషన్ లిమిటెడ్ అథారిటీ ద్వారా బళ్లారి నుంచి మిర్యాన్ పెట్ వరకు హైటెన్షన్ లైన్ ఏర్పాటు క్రమంలో, అందులో భాగంగా పోల్స్ వేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వేచేసి, లైన్ అలైన్మెంట్ మార్కింగ్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మండల కేంద్రం మీదుగా గతంలో నాలుగు భారీ పవర్ గ్రిడ్ హైటె న్షన్ లైన్లు ఏర్పాటు చేయడంతో ఇప్పటికే చాలా మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పుడు మరో లైన్ వేయడం వలన రైతుల కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. బీదర్ దగ్గర 3000 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న సోలార్ యూనిట్ నుండి కరెంటు సరఫరాకు మరొక 2700 ఎకరాల వ్యవసాయ భూమిని నిరుపయోగంగా మార్చుతున్నారని దుయ్యబట్టారు. సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ,జంగా రెడ్డి, గూడూరు మల్లికార్జున్ రెడ్డి, జనార్ధన్, ఎలగమోని పాండు, అభిషేక్, క్యామ రాజేష్, బోసు రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసేందుకే మిషిక చారిటీ ట్రస్ట్ ఏర్పాటు

విశాలాంధ్ర – కారేపల్లి : సింగరేణి కాలరీస్ కార్మికుడైన నాన్న వాంకుడోత్ గోబ్రియ లక్ష్యం నెరవేర్చటానికి మిషిక చారిటీ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ఫౌండర్ వాంకుడోత్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కారేపల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్ తమ కుమార్తె మిషిక పుట్టిన రోజు పురస్కరించుకొని సంస్థకు సంబంధించి బ్రోచర్‌ను మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్ చేతుల మీదిగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో సంస్థ కార్యక్రమాలను వివరించారు. చంఢీగర్‌లో సోషల్ సైన్స్ మేనేజ్‌మెంట్ రిసెర్చ్ సైంటిస్ట్‌గా పని చేస్తున్న తన వేతనంలో సగం సోషల్ సర్వీస్‌కు వినియోగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తనతో పాటు తన ధర్మపత్ని చెన్నైలోని కేవీ విద్యానికేతన్ ఉపాధ్యాయురాలు సుభద్ర, సోదరుడు వాంకుడోత్ కృష్ణలు సైతం భాగస్వాములుగా ఉండి వారి వంతుగా వారి వేతనంలో సగం చారిటీ ట్రస్ట్‌కు వినియోగించనున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్నా, డబ్బులేక ఉన్నత చదువులు కొనసాగించలేక పోయినా తమ సంస్థ దృష్టికి తీసుకవస్తే సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కారేపల్లి మండలం కొత్తతండాకు చెందిన యువతి డెంటల్‌లో సీటు సాధించినా పేదరాలు కావటం ఫీజు ఇబ్బందులు పడిన విషయం తెలుసుకొని ఆమెకు రూ.40 వేలు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. ఇతరుల వద్ద నుండి ఎలాంటి డోనేషన్లు తీసుకోకుండా తమ కుటుంబ సభ్యుల సంపాదనతోనే మిషిక ట్రస్ట్‌ను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర కాలెండర్‌ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్, ల్కెవ్ జిల్లా ఇంచార్జీ బానోత్ బాలునాయక్, ప్రముఖ రియల్టర్ మదగాని వెంకటేశ్వర్లు, ట్రస్ట్ సభ్యులు వాంకుడోత్ కృష్ణ, సుభద్ర పాల్గొన్నారు.

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించిన మేయర్

విశాలాంధ్ర – మేడిపల్లి : పీర్జాదిగూడ నగరపాలకసంస్థ మేయర్ అమర్‌సింగ్ తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ ఆహ్వానం మేరకు శనివారం బండి కన్వెన్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేయర్ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వారికి కల్పిస్తున్న మౌలిక సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ పరిసరాలు, శుభ్రతను పరిశీలించిన అనంతరం, మేయర్ విద్యార్థులతో మాట్లాడారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు అందే సౌకర్యాల ప్రమాణాలు పాటించేలా, పఠన శక్తి, సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, అనంత్ రెడ్డి, సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, సాంబిరెడ్డి, భరత్ కుమార్, శశీ మోహన్ గుప్తా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, స్టాఫ్ మెంబెర్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బ్లూ పీటర్ హెల్త్ రీసెర్చ్ సెంటర్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

విశాలాంధ్ర – కాప్రా : లెప్రా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న (బిపిహెచ్‌ఆర్‌సి) బ్లూ పీటర్ హెల్త్ రీసెర్చ్ సెంటర్ సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం సంతోషకరంగా ఉందని లెప్ర సీఈవో ప్రశాంత్ కుమార్, ఇంటర్నేషనల్ లెప్రా సి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నరసింహారావులు అన్నారు. శనివారం చర్లపల్లిలోని లేప్రాసిలో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేప్రో సొసైటీ యొక్క పరిశోధన కేంద్రం శాస్త్రీయ నైపుణ్యం అత్యాధునిక పరిశోధన సౌకర్యాలను మిళితం చేస్తుందని అన్నారు. వివిధ రాష్ట్రాలలో క్షయ, కుష్టి వ్యాధి, ఫైలేరియాసిస్, ఉష్ణ మండల వ్యాధులు వంటి వ్యాధులకు కమ్యూనిటీలతో సన్నిహితంగా పనిచేస్తుందన్నారు. బిపిహెచ్‌ఆర్‌సి ప్రభుత్వ ఆరోగ్య క్రమలు విద్యాసంస్థలు ఎన్జీవోలు కార్పొరేట్లతో కూడా పనిచేస్తుంది. చర్లపల్లిలోని గ్యాస్, చమురు కంపెనీలలో కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల, నార్సింగి కళాశాల విద్యార్థుల సంఘాలతో కుష్టి, టిబి, హెచ్ఐవి ఎల్ఎఫ్‌లపై అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లిప్రా సీఈఓ ప్రసాద్ కుమార్, బి పి హెచ్ ఆర్ సి వ్యవస్థాపక డైరెక్టర్ సుజై సునీత, బిపిహెచ్‌ఆర్‌సి ఇంచార్జ్ డాక్టర్ మైకుల్ సుకుమార్, డాక్టర్ అవర్ణ శ్రీకాంతం, రమేష్, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు శ్రీనివాస్ రెడ్డికి ఆహ్వానం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఇందిరమ్మ కాలనీ వాసులు శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ కాలనీలో నెలకొన్న సమస్యల గురించి వివరించి వాటికి తగు మార్గం చూపాలని కోరారు. అదే విధంగా 25వ తేదీన నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరు కాగలరని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ యోహాన్, షారుణ్, రవి, శేఖర్, సిద్దయ్య, సైదులు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

విశాలాంధ్ర-దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి.పోచంపల్లి 8 వార్డ్‌లో శనివారం గ్రేట్ ఫుల్ హెడ్ సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలు ఆధ్వర్యంలో సత్య సువార్త ప్రార్ధన మందిరం నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెంబర్ యాదయ్య పాల్గొని చిన్నపిల్లలకు ఆయన చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలు మాట్లాడుతూ ప్రతి మంగళవారం, శుక్రవారం ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద 200 మందికి పైగా ఉచిత భోజన కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని తెలిపారు. అందులో భాగంగా దుండిగల్ స్లమ్ ఏరియా పిల్లలకు వంద మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఎంతోమందికి ఎంత డబ్బు ఇచ్చినా సరిపోదని, ఒక పూట అన్నం పెడితే చాలని చాలామంది అంటుంటారని తెలిపారు. సర్వేజనా సుఖినోభవంతు అన్నదాత సుఖీభవ కొంతమంది దాతల సహకారంతో ఈ పౌండేషన్ నిర్వహిస్తునని తెలియజేశారు.

అసర్ల మౌనిక బీరప్పకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర – మేడిపల్లి: యూత్ కాంగ్రెస్ ఎన్నికలలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అసర్ల మౌనిక బీరప్పకు శనివారం ఉదయం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, టీపీసీసీ సెక్రటరీ సరిత హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్కారాలు, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో యూత్ కాంగ్రెస్ ప్రాముఖ్యతను వారు వివరించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అసర్ల మౌనిక బీరప్ప పార్టీకి మరింత సేవచేయాలని, యువతను ప్రేరేపించడంతో పాటు పార్టీలో కొత్త శక్తిని నింపేలా కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, ఆసర్ల బీరప్ప, మల్లికార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యమ యోధుడు

మానం ఆంజనేయులు అభినందన సభలో ప్రముఖుల ఉద్ఘాటన

విశాలాంధ్ర–హైదరాబాద్:
సహకార ఉద్యమంతో పాటు అనేక కార్మిక పోరాటాల్లో ఎన్నో నిర్బంధాలు, సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ ఏడు దశాబ్దాలపాటు రాజీలేని పోరు సాగించిన యోధుడు మానం ఆంజనేయులు అని వక్తలు ప్రశంసించారు. భారతదేశ సహకార రంగంలో నాలుగు దశాబ్దాలపాటు అద్వితీయ సేవలందించిన సుప్రసిద్ధ సహకారవేత్త, ఏపీ రాష్ట్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు, నాఫ్కాబ్ మాజీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఏ మానం ఆంజనేయులు అభినందన సభ ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ అధ్వర్యంలో శనివారం హైదరాబాద్ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పీఎస్ ఎంపైర్‌లో ఘనంగా నిర్వహించారు. ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, నాఫ్కాబ్ తెలంగాణ ఫెడరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి నరసింహారెడ్డి, ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పీఆర్ రంగరాజు, ది ఏపీ మహేశ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ రమేశ్‌కుమార్ బంగ్, విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు, అగ్రసేన్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ ప్రమోద్ కుమార్ కెడియా, నవభారత్ కోఆపరేటివ్ బ్యాంకు రిటైర్డ్ ఎండీ పొట్లూరి పాండురంగారావు, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, మాజీ ఎంఎల్‌సీ పీజే చంద్రశేఖరరావు, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బీఎస్ మోహన్‌రెడ్డి, జనరల్ మేనేజర్ ఎస్.మధుకర్, సీపీఐ సీనియర్ నాయకుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి, శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ పి.ప్రేమ్‌పావని, అభినందనసభ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వి.చంద్రశేఖర్, సీపీఐ ఏపీ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఆంజనేయులు అనుభవం వృధా కారాదు: దాసరి శ్రీనివాసులు

దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ సుదీర్ఘకాలం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా మానం ఆంజనేయులు పనిచేయడం సాధారణ విషయం కాదన్నారు. ఆంజనేయులు అనుభవం వృధాగా పోవద్దని, ఆయన అనుభవాలతో పుస్తకం రాస్తానని అన్నారు. ఆయన జీవితంపై పీహెచ్‌డీ చేయాలని సూచించారు. రంగరాజు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని కోఆపరేటివ్ బ్యాంకులు దేశంలోనే మూడవస్థానంలో ఉన్నాయన్నారు. కోఆపరేటివ్ వ్యవస్థలో ఏ సమస్య వచ్చినా ఆంజనేయులు పరిష్కరించేవారన్నారు.

సహకారోద్యమ భీష్ముడు: నరసింహారెడ్డి

వేమిరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకారోద్యమానికి మానం ఆంజనేయులు ఒక నిర్వచనమని, సహకారోద్యమ భీష్ముడన్నారు. సహకార రంగంపై, సమస్యలపై పూర్తి అవగాహన గల నాయకుడని, ఆయన గురించి ఎలాంటి పరిచయం అవసరం లేదన్నారు. 1983లో విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ పరిపాలన పగ్గాలు చేపట్టి... ఆ బ్యాంకు మార్గదర్శిగా మారారన్నారు. ఆయన కృషి, నాయకత్వం విశాఖ బ్యాంకును దక్షిణ భారతదేశంలోనే దిగ్విజయ సంస్థగా నిలబెట్టారన్నారు. ఆయన సేవలు ఈ బ్యాంకికే పరిమితం కాకుండా తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ సహకార ఉద్యమం వరకు విస్తరించాయని చెప్పారు. ఆయనకు 2016లోనే 'నవభారత రత్న' పురస్కారం లభించిందని నరసింహారెడ్డి అన్నారు.

సామాన్యుల అభ్యున్నతి కోసం శ్రమించారు: జేవీ

జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థి, కార్మిక ఉద్యమాలతో పాటు సామాన్యుల అభ్యున్నతి కోసం ఆంజనేయులు శ్రమించారని అన్నారు. విశాలాంధ్ర సబ్ ఎడిటర్‌గా పనిచేశారన్నారు. ఎంఎల్‌ఏగా ప్రజాజీవితంలో అనేక సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. విశాఖలో హిందుస్థాన్ షిప్ కార్మిక సంఘాన్ని స్థాపించి, కార్మికుల హక్కుల కోసం శ్రమించారన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని పోరాడి సాధించారన్నారు. వేలాదిమంది దళితులు, గంగిరెద్దుల వాళ్లకు ఇళ్లు నిర్మించి ఇచ్చారన్నారు.

ఆర్థిక అసమానతల నివారణకు సహకార వ్యవస్థే పరిష్కారం: ఆంజనేయులు

సహకార బ్యాంకులు సామాన్య ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం పనిచేయాలని, అలా చేస్తేనే వాటికి సార్థకత ఉంటుందని మానం ఆంజనేయులు అన్నారు. సమాజంలో మార్పు కోసం సహకారవాదులంతా మరింత చైతన్యంతో కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఇది వ్యాపారం కాదని, దీనికి ఒక లక్ష్యం ఉందన్నారు. వ్యత్యాసాలను కొంతైనా తగ్గించాల్సిన బాధ్యత సహకార సంస్థలపై ఉందన్నారు. సోషలిజం, పెట్టుబడిదారీ విధానాల మధ్య సిద్ధాంత ఘర్షణ ఉన్నప్పటికీ, రెండు రకాల భావాలు గల దేశాలన్నింటిలోనూ సహకార వ్యవస్థకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. 2012లోనే ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించిందని, రెండోసారి 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ప్రతి దేశంలోనూ ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, వాటిని సహకార వ్యవస్థే కొంతైనా తగ్గిస్తుందని ఐక్యరాజ్య సమితి చెబుతోందన్నారు. ప్రభుత్వాల నుంచి ఆర్థిక సహాయం కావాలని అడిగినా, ఏ రూపంలో తీసుకున్నా సహకార సంస్థలు బతకవని, అలా చేస్తే స్వతంత్రంగా ఉండలేవని మానం ఆంజనేయులు అన్నారు. ఎప్పుడైనా ప్రభుత్వాలు, వాటి ఆర్థిక సహాయంపై ఆధారపడితే కోఆపరేటివ్ వ్యవస్థ మునిగిపోతుందని హెచ్చరించారు. ప్రభుత్వాలే సహకార వ్యవస్థపై ఆధారపడాల్సిందే గానీ, పాలకుల ఆర్థిక సహాయంతో వ్యవస్థ బతకకూడదనే విధానాన్ని రూపొందించుకున్నామని చెప్పారు. ఇప్పుడు కూడా సహకార సంస్థ ప్రభుత్వం వద్ద డబ్బులు పెడుతున్నాం తప్పితే... ఏనాడూ ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందలేదన్నారు. దేశంలో ఎక్కడా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు ప్రభుత్వ ఆర్థిక సహాయంతో బతకడం లేదని ఆంజనేయులు స్పష్టం చేశారు.

మార్పులకు శ్రీకారం: చలసాని

చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అర్బన్ బ్యాంకులన్నింటినీ ఐక్యం చేస్తూ 1986లో రాష్ట్ర అసోసియేషన్ స్థాపించడం ద్వారా ఆనాడు ప్రభుత్వంపై, ప్రభుత్వాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి సహకార వ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. 1983లో విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన అతి చిన్నదైన ఆ సంస్థ నేడు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద అర్బన్ బ్యాంకుగా అభివృద్ధి చెందడానిక ఆయన అనుసరించిన వ్యూహాలే కారణమన్నారు. సహకార వ్యవస్థ పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించారన్నారు. 40 ఏళ్లకు పైగా సహకార బ్యాంకింగ్ వ్యవస్థ, సహకార రంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారంలో అద్వితీయ పాత్ర పోషించారన్నారు.

30 ఏళ్లు మకిలి అంటకుండా పనిచేశారు: ఆర్వీ రామారావు

ఆర్వీ రామారావు మాట్లాడుతూ మానం ఆంజనేయులు నిరాడంబర జీవితం గడిపారన్నారు. ఎవరి స్కూటర్ వచ్చినా... దానిపై వెళ్లేవారని తెలిపారు. ఏటీఎంలు వచ్చాక బ్యాంకులలో సేవలు తగ్గాయని, కానీ విశాఖ కోఆపరేటివ్ బ్యాంకులో ఎప్పుడు చూసినా మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు కనిపిస్తారన్నారు. కోటి రూపాయలతో ప్రారంభమైన బ్యాంకు లావాదేవీలను రూ.7675 కోట్లకు పెంచారన్నారు. ఎలాంటి మకిలి అంటకుండా 30 ఏళ్లు పనిచేశారని ప్రశంసించారు. మంచిపనిచేసే ప్రతివాడు కమ్యూనిస్టే అని రామారావు పేర్కొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమం అవశ్యం

పెనుగొండ లక్ష్మి నారాయణ

విశాలాంధ్ర–విజయవాడ:
ప్రస్తుత గ్రంథాలయాల దుస్థితి దృష్ట్యా మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మి నారాయణ పిలుపునిచ్చారు. సాహిత్య, సాంస్కృతిక సంస్థలు, పుస్తక ప్రచురణకర్తల అధ్వర్యంలో శనివారం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ ప్రారంభ కార్యక్రమం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి కారల్ మార్క్స్, రోడ్డు, బీసెంట్ రోడ్డు మీదుగా లెనిన్ విగ్రహ పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. వివిధ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు, విజ్ఞాన సందేశాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివ ప్రసాద్ అధ్యక్షత సభ జరిగింది. పెనుగొండ మాట్లాడుతూ ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో గ్రంథాలయ పన్ను కూడా ఉంటుందని, గ్రంథాలయాల నిర్వహణకు నిధులు ఇవ్వాలని, కొత్త పుస్తకాలు సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం వంటి వారు సాగించిన పోరాటాలతో 1956లో గ్రంథాలయ చట్టం వచ్చిందని పెనుగొండ చెప్పారు. వల్లూరు శివ ప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమాన్ని అరసం రాష్ట్ర నాయకత్వం బాధ్యతగా నడిపిస్తుందన్నారు. విజయవాడ నుంచే నాడు ప్రారంభమైన ఉద్యమ స్ఫూర్తితో పునర్వికాస ఉద్యమం ప్రారంభమైందన్నారు. కేరళ, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల్లో కొత్త గ్రంథాలయాలు ప్రారంభించడం, పాతవి ఆధునీకరించటం, అవసరమైన సిబ్బందిని నియమించడం వంటివి జరుగుతుంటే మన రాష్ట్రంలో మూడేళ్ల క్రితం కొనుగోలు చేసిన పుస్తకాలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రచయిత దేవినేని మధుసూదనరావు మాట్లాడుతూ మాతృభాషలో విద్యా బోధన అవసరమని, ఆంగ్లం , హిందీలోనూ పట్టు సాధించాలని సూచించారు. సాహితీ స్రవంతి కార్యదర్శి వరప్రసాద్, జనసాహితీ నాయకుడు చందు నాగేశ్వరరావు, ప్రచురణ కర్తలు టి.మనోహర్ నాయుడు (విశాలాంధ్ర) లక్ష్మయ్య (ప్రజాశక్తి) వెంకట నారాయణ (పల్లవి), గుత్తికొండ లక్ష్మి (సాహితీ) మాట్లాడుతూ గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు అక్కినేని వనజ, చంద్రరావు, పి.చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య, ఆర్ పిచ్చయ్య, పిన్నమనేని మురళీ కృష్ణ, గోళ్ల నారాయణ రావు, మోతుకూరి అరుణ కుమార్, చలపాక ప్రకాష్, సింగంపల్లి ఆశోక్ కుమార్, చిగురుపాటి భాస్కరరావు, కొప్పర్తి రంబాబు పాల్గొన్నారు.

హీరోలకిచ్చే ప్రాధాన్యత రైతులకేది?

- జనసేవాదళ్ ముగింపు సభలో రామకృష్ణ ప్రశ్న
- నందిగామలో ఎర్రదండు కవాతు

విశాలాంధ్ర–నందిగామ:
తెలుగు రాష్ట్రాల్లో సినిమా హీరోలకి ఇచ్చే ప్రాధాన్యత రైతులకు లేకుండా పోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సీపీఐ శతవార్షికోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్వర్యంలో ఐదు రోజులుగా నందిగామ అయ్యదేవర కాళేశ్వరరావు ప్రాంగణంలో నిర్వహించిన రెడ్‌షర్ట్ వలంటీర్ జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా నందిగామ గాంధీసెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడారు. అంతకుముందు సీపీఐ నందిగామ కార్యాలయం నుండి 100 అడుగుల ఎర్రజెండాతో రెడ్‌షర్ట్ వలంటీర్లు గాంధీ సెంటర్ వరకు కవాతు నిర్వహించారు. ఎర్ర టీ షర్టులు, అరుణపతాకాలతో నందిగామ ప్రధాన రహదారులు కళకళలాడాయి. దీంతో సీపీఐ నేత సూర్యదేవర నాగేశ్వరరావు నందిగామ ప్రజలకు మరోసారి గుర్తుకు వచ్చారు. రామకృష్ణ మాట్లాడుతూ వందల కోట్ల రూపాయల పెట్టుబడితో సినిమాలు తీసి... లాభాపేక్ష కోసం చేసే పనులకు ప్రభుత్వాలు మద్దతుగా నిలవడం ఏమిటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఓ థియేటర్‌లో తొక్కిసలాట జరిగి ఆడపడుచు మృతిచెందిందని, ఆమె కుమారుడు కోమాలో ఉన్నాడని, ఆ కుమారుడు లేచి తన తల్లి గురించి అడిగితే రాజకీయ పార్టీలు ఏమి సమాధానం చెబుతాయని నిలదీశారు. ఓ బీజేపీ మంత్రి ఒక్కసారైనా బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా ప్రభుత్వానిదే తప్పు అంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని, అటువంటి మంత్రులకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. పంటలు సక్రమంగా పండక...పండిన పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని రామకృష్ణ విమర్శించారు. సూర్యదేవర నాగేశ్వరరావు పుట్టిన గడ్డపై నందిగామలో రెడ్‌షర్ట్ వలంటీర్ల జనసేవాదళ్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమన్నారు. గత ఐదేళ్లు జగన్ ప్రభుత్వం అడ్డగోలు పరిపాలన సాగించిందని, ప్రజలతోనే కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేలతో పనిలేదన్నట్లు జగన్ వ్యవహరించారని, అందుకే వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు అదేదారిలో నడవకుండా ప్రజలకు అండగా నిలవాలని, ప్రజా సమస్యలపై అలసత్వం లేకుండా చూడాలని, ప్రజా సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వాలు పనిచేయాలని హితవు పలికారు. గొప్ప విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని రామకృష్ణ మండిపడ్డారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. 2025 డిసెంబర్ 26వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో లక్ష మంది కమ్యూనిస్టు, అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలతో భారీసభ జరుగుతుందని, దీనికి పెద్దఎత్తున ప్రజలు సమీకృతం కావాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీని అంతమొందించాలని ఎంతోమంది ప్రయత్నాలు చేశారని, కానీ వారి ఆశలు అడియాశలయ్యాయన్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు మాట్లాడుతూ 2025 డిసెంబర్ 26 సీపీఐ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాలకు సీపీఐ వెనకాడదని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రెడ్‌షర్ట్ వలంటీర్ల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు విన్నవించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ త్యాగధనుల ప్రాంతమైన నందిగామలో జనసేవాదళ్ రెడ్‌షర్ట్ వలంటీర్ల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం గర్వంగా ఉందన్నారు. మహిళా ఉద్యమాలు నిర్వహించి ప్రజలకు అండగా నిలిచిన పార్టీ సీపీఐ అన్నారు. ముగింపు సభకు అధ్యక్షత వహించిన సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ పాలకుల అవినీతిపై పోరాడతామని స్పష్టంచేశారు. క్వారీలు, ఇసుక, గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుంటామన్నారు. ఇంతకుముందు వైసీపీ నాయకులు అక్రమ తవ్వకాలకు పాల్పడితే... ఇప్పుడు టీడీపీ నాయకులు దోపిడీ చేస్తున్నారన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు స్వాగతం పలకగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు వందన సమర్పణ చేశారు. జనసేవాదళ్ రాష్ట్ర సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ నార్ల వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నక్కి లెనిన్‌బాబు, వి.జాన్సన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్జీ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, వల్లంకొండ బ్రహ్మం, వీరులపాడు ఎంపీటీసీ సభ్యులు ఎం.ప్రకాశరావు, మాజీ సర్పంచ్ వట్టికొండ చంద్రమోహన్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి, మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల కోట్లతో అమరావతి అభివృద్ధి

- రేపటి సీఆర్డీఏ సమావేశంలో నిర్ణయం
- రాబోయే 30 ఏళ్ల దృష్ట్యా రోడ్ల నిర్మాణం
- ఇళ్లు నష్టపోతే న్యాయం చేస్తాం: మంత్రి నారాయణ

విశాలాంధ్ర–మంగళగిరి:
రాజధాని ప్రాంతంలో మరో రూ.20వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. దీనిపై సోమవారం జరిగే సీఆర్డీఏ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. సీడ్ క్యాపిటల్ నుంచి జాతీయ రహదారికి అనుసంధానం కానున్న ఈ–11, ఈ–13, ఈ–15 రోడ్లను మంత్రి పరిశీలించారు. రోడ్ల అనుసంధానం పనుల బాధ్యతను అసోసియేట్స్ సంస్థకు అప్పగించినట్లు చెప్పారు. ఈ సంస్థ ఇచ్చిన డిజైన్ల ఆధారంగా ఆయన శనివారం మంగళగిరి డీజీపీ కార్యాలయం, ఎర్రబాలెం డాన్‌బాస్కో ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 20,017 చదరపు కిమీల పరిధిలో తూర్పు నుంచి పశ్చిమం వరకు 16 రోడ్లు, ఉత్తరం నుంచి దక్షిణం వరకు 18 రోడ్లు వస్తున్నాయని నారాయణ చెప్పారు. గంటకు 80–100 కిమీల వేగంతో ప్రయాణించేందుకు వీలుగా రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. రహదారి నిర్మాణాల క్రమంలో ఇళ్లు కోల్పోతున్న వారు ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కోరారు. 'సీడ్ కేపిటల్ నుంచి ఈ–11, ఈ–13 రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానం చేసే డిజైన్లు సిద్ధం చేస్తున్నామన్నారు. రాజధాని కోసం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూమి రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారని చెప్పారు. గత ప్రభుత్వం రాజధాని లేకుండా మూడు ముక్కలాట ఆడిందని, కూటమి అధికారంలోకి వచ్చాక రాజధాని నిర్మాణానికి ఇబ్బందులు తొలగింస్తోందని నారాయణ అన్నారు. రూ.22 వేల కోట్ల విలువైన టెండర్లకు సీఆర్డీఏ ఆమోదం తెలిపిందన్నారు. మరో రూ.20 వేల కోట్లకు సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదం లభిస్తుందని చెప్పారు. ప్రైవేట్ ఆస్తులకు ఎక్కువ ఇబ్బంది లేకుండా అటవీ భూములున్న ప్రాంతాల నుంచే ఈ రోడ్లను అనుసంధానం చేస్తున్నామన్నారు. ఇళ్లు నష్టపోతున్న వారితో అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించి న్యాయం చేస్తారని తెలిపారు. ఎవరినీ ఇబ్బందిపెట్టకుండా రోడ్లు నిర్మిస్తామని నారాయణ వెల్లడించారు.

'జమిలి' అత్యవసరమైతే ప్రభుత్వాన్ని రద్దు చేయండి: అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ:
ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వన్ నేషన్–వన్ ఎలక్షన్ బిల్లును ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని, ఇంత అత్యవసరంగా జమిలి ఎన్నికల బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఏముందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీకి అంత తొందర ఉంటే వెంటనే ప్రభుత్వాన్ని రద్దు చేసి... ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈనెల 16న లోక్‌సభ ముందుకు వన్ నేషన్–వన్ ఎలక్షన్ బిల్లు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి ఎన్నికల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. అయితే ఈ ప్రతిపాదనపై ప్రతిపక్ష నేతల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ 'జమిలి ఎన్నికలు జరిగిన ఆరునెలల అనంతరం ఏదైనా రాష్ట్రంలో వివిధ పరిస్థితుల వల్ల ప్రభుత్వం మెజారిటీని కోల్పోతే రాబోయే నాలుగేళ్ల పాటు రాష్ట్రాన్ని ఎవరు పరిపాలిస్తారు' అని ప్రశ్నించారు. ఈ విధానం ఆచరణ సాధ్యం కాదన్నారు. ఈ బిల్లు ఫెడరలిజం, ప్రజాస్వామ్య సూత్రాలకు విఘాతం కలిగిస్తోందని... కావున దీనిని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ డిమాండ్ చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు తమ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పంపిన వివరణాత్మక లేఖను ఉటంకిస్తూ... ఈ ఆలోచనను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని పునరుద్ఘాటించారు.

కారణజన్ముడు ఎన్టీఆర్

- భారతరత్న పోరాడి సాధిస్తాం
- సినీ వజ్రోత్సవాల్లో చంద్రబాబు, వెంకయ్యనాయుడు
- 'తారకరామం-అన్నగారి అంతరంగం' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి:
కారణజన్ముడు ఎన్టీఆర్ అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు. విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారకరామారావు సినీ వజ్రోత్సవాన్ని కృష్ణా జిల్లా పోరంకిలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎన్టీఆర్ తొలి చిత్రం 'మనదేశం' విడుదలై 75 ఏళ్లయిన సందర్భంగా ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ అధ్వర్యంలో వజ్రోత్సవాన్ని నిర్వహించారు. 'తారకరామం-అన్న గారి అంతరంగం' అనే పేరుతో కమిటీ రూపొందించిన పుస్తకాన్ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీఎం చంద్రబాబు, వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ తొండెపు దశరథ జనార్దన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అధ్యక్షత వహించారు. సీఎం మాట్లాడుతూ... పాత్రలకు ప్రాణం పోసిన ఏకైక నటుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన 300పైగా చిత్రాల్లో నటించారన్నారు. ప్రతి పాత్రలో జీవించారన్నారు. ఆయన మాదిరిగా వైవిధ్యమైన పాత్రలు పోషించిన నటుడు మరొకరు లేరని అన్నారు. అన్ని రకాల పాత్రలతో ప్రజలను మెప్పించారన్నారు. పరిశోధన చేసి మరీ వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీనాధుడు పాత్రలు పోషించారన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకూ ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఉంటుందని తెలిపారు. జాతీయ భావాలతో ప్రాంతీయ పార్టీని నడిపిన ఏకైక నాయకుడు, యుగపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వడం అంటే తెలుగు జాతిని గౌరవించడమని, ఆయనకు భారతరత్న ఇచ్చే వరకూ పోరాడి సాధిస్తామన్నారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ... ఎన్టీఆర్‌లో తనకు నచ్చింది క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే తత్వం అని అన్నారు. నిజంగా ఆయన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడని కొనియాడారు. స్వర విన్యాసం, నట విన్యాసం కలిగిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. నాయన ప్రస్థానానికి సంబంధించి అన్ని విషయాలతో పుస్తకాన్ని తీసుకురావడంపై టీడీ జనార్దన్, భగీరథ్ బృందాన్ని ఆయన అభినందించారు. ఎన్టీఆర్ తొలి చిత్రానికి నిర్మాతగా వ్యవహరించిన శతాధిక వృద్ధురాలు కృష్ణవేణి (102) హాజరవడం విశేషం. సినీరంగంలో ఆయన పోషించిన పాత్రలను, ఆయనతో ఉన్న అనుబంధాలను పలువురు ప్రముఖులు గుర్తు చేసుకున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, సీనియర్ నటి జయప్రద, నిర్మాతలు డీ సురేశ్ బాబు, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, నందమూరి రామకృష్ణ, కేఎస్ రామారావు, శ్యామలాదేవి, సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్ర హోదా హామీ పునరుద్ధరించండి: ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్:
జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని... దాన్ని నెరవేర్చాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. కేంద్రపాలిత ప్రాంతంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనం ఏమీ లేదన్నారు. 'జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారడం వల్ల కలిగిన ఉపయోగమేమిటో ఇప్పటికీ తెలియదన్నారు. క్రీడల్లో ఒక్కరే కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అంతకు మించి సారథులు ఉంటే గందరగోళానికి దారి తీయవచ్చు. అలాగే దేశానికి ఓకే ప్రధానమంత్రి, ఒకటే కేంద్రప్రభుత్వం ఉంటుంది. ఒక ప్రాంతంలో రెండు అధికారాలు ఉంటే అక్కడ అభివృద్ధికి అవకాశం ఉండదు. ఎన్నికైన ముఖ్యమంత్రికి తన మంత్రివర్గంతో కలిసి ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది. ఇద్దరి చేతుల్లో అధికారం ఉంటే అక్కడ పురోగతి ఉండదు' అని ప్రముఖ జాతీయ మీడియా సంస్థ పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒమర్ పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.